RNI.No. APTEL/2014/57702
ESTD: 1999
www.voodayam.com
Postal Regd. No. GTR/117/2025-27




# వుదయం




గుంటూరు | 25-03-2026 బుధవారం | సంపుటి : 12 | సంచిక : 390 | SINCE 25 YEARS CIRCULATED TELUGU DAILY | రూ. 3.00 | పేజీలు : 12 | VOODAYAM Telugu DAily
Simultaneously Published from Guntur, Hyderabad, Adilabad, Karimnagar, Khammam & Warangal
Follow us on

## మత మార్పిడితో ఎస్‌సి హోదా, రక్షణ రద్దు

● హిందు, సిక్కు, బౌద్ధ మతాలు మినహా ఇతర ఏ మతంలోకి మారినా ఎస్‌సి, ఎస్‌టి చట్ట భద్రత వర్తించదు ● ఏపీ హైకోర్టు తీర్పుకి సుప్రీంకోర్టు ఓకె



**న్యూఢిల్లీ :** ఎస్సీ కులానికి చెందిన వారు మతం మారితే ఎస్‌సి హోదా రద్దు అవుతుందని దేశ అత్యున్నత న్యాయస్థానం సంచలన తీర్పు ఇచ్చింది. హిందూ, బౌద్ధ, సిక్కు మతాల్లోకి కాకుండా ఇతర ఏ మతంలోకి మారినా వారి ఎస్‌సి హోదా రద్దు అవుతుందని సుప్రీంకోర్టు మంగళవారం స్పష్టం చేసింది. గతంలో ఏపీ హైకోర్టు ఇచ్చిన తీర్పును సమర్థించింది. గతంలో ఏపీ హైకోర్టు జరిగిన విచారణలో.. క్రైస్తవ మతంలోకి మారిన పాస్టర్ ఎస్‌సి, ఎస్‌టి చట్టం కింద రక్షణ పొందలేరని సుప్రీం న్యాయస్థానం స్పష్టం చేసింది. దీనిని సవాల్ చేస్తూ వారు సుప్రీం కోర్టును ఆశ్రయించగా..

మిగతా 2లో



# ట్రంప్, మోడీ సంభాషణ

## పశ్చిమాసియా సంక్షోభం గురించి మాట్లాడుకున్న అగ్రనేతలు

● హోర్ముజ్ జలసంధిని తెరిపించే అవసరంపై మంతనాలు ● మోడీ ట్రంప్‌తో మాట్లాడినట్లు భారత్‌లో అమెరికా రాయబారి సెర్గియో గోర్ 'ఎక్స్'లో పోస్టు

**న్యూఢిల్లీ, మార్చి 24 (వుదయం) :** ప్రపంచ వాణిజ్యం కోసం హోర్ముజ్ జలసంధిని తెరిచి ఉంచాల్సిన అవసరం సహా పశ్చిమాసియాలో కొనసాగుతున్న సంక్షోభంపై యుఎస్ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రధాని మంత్రి నరేంద్ర మోడీతో మంగళవారం చర్చించారు. కొనసాగుతున్న ఉద్రిక్తతల మధ్య ఇద్దరు నాయకులూ ఆ ప్రాంతంలోని భద్రతా పరిస్థితిని సమీక్షించడమే కాక నిరంతరాయ ఇంధన సరఫరాలను పునరుద్ధరించాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారని అధికార వర్గాలు పేర్కొన్నాయి. మధ్యప్రాచ్యంలో తీవ్రమవుతున్న పరిస్థితులపై, ముఖ్యంగా ప్రపంచ ఇంధన మార్గాల్లో స్థిరత్వాన్ని కాపాడుకోవడంపై చర్చించేందుకు ప్రధాని నరేంద్ర మోదీ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో మాట్లాడారని భారతదేశంలోని అమెరికా రాయబారి సెర్గియో గోర్ ఎక్స్‌పై ఒక పోస్ట్‌లో తెలిపారు. [illegible] ట్రంప్ ఇప్పుడే ప్రధాన మంత్రి [illegible] మాట్లాడారు. హోర్ముజ్ జలసంధిని తెరిచి ఉంచాల్సిన ప్రాముఖ్యతతో సహా, మధ్యప్రాచ్యంలో కొనసాగుతున్న పరిస్థితిపై వారు చర్చించారు, అని ఆయన పేర్కొన్నారు.

### ఇరాన్‌పై ఇంకా దాడులు

**వుదయం డెస్క్, మార్చి 24 :** సంఘర్షణకు ముగింపు పలకడానికి టెహ్రాన్‌తో తాము చర్చలు జరుపుతున్నామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించినప్పటికీ, ఉద్రిక్తతలు తగ్గే సూచనలు కనిపించడం లేదు. ఈ ప్రకటన తర్వాత, మంగళవారం రాత్రి ఇరాన్‌లోని పలు నగరాలపై అమెరికా–ఇజ్రాయెల్

మిగతా 2లో

## కాంగ్రెస్‌ను వీడుతున్నట్టే !

### నేడో, రేపో రాజీనామా చేయనున్న జీవన్‌రెడ్డి

● ఫలించని ఏఐసీసీ బుజ్జగింపులు ● జీవన్ రెడ్డి నివాసానికి పార్టీ రాష్ట్ర చీఫ్, మంత్రులు ● సుదీర్ఘంగా బుజ్జగింపు ● కాంగ్రెస్ కండువా కప్పుకునేందుకు జీవన్‌రెడ్డి నిరాకరణ ● ఇంట్లో, బయట ఇందిరమ్మ ఫ్లెక్సీల తొలగింపు



**జగిత్యాల, మార్చి 24 (వుదయం ప్రతినిధి) :** గత కొంతకాలంగా కాంగ్రెస్ పార్టీపై తీవ్ర అసంతృప్తితో ఉన్న సీనియర్ నేత, జగిత్యాల మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి ఎట్టకేలకు పార్టీని వీడేందుకు రెడీ అయ్యారు. ఇప్పటికే పార్టీ హైకమాండ్ రంగంలోకి దిగి జీవన్ రెడ్డిని బుజ్జగించేందుకు చేసిన ప్రయత్నాలు విఫలం అయ్యాయి. తాజాగా తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్ రంగంలోకి దిగినా జీవన్ రెడ్డి వెనక్కి తగ్గడం లేదు. పార్టీ నుంచి వెళ్లిపోవాలనే ఆయన డిసైడ్ అయినట్లు అర్థం అవుతోంది. మంగళవారం జగిత్యాలకు వెళ్లి జీవన్‌రెడ్డితో భేటీ అయిన పీసీసీ చీఫ్.. పార్టీలోనే కొనసాగాలని.. కాంగ్రెస్‌ను వీడొద్దని విజ్ఞప్తి చేశారు. అయినప్పటికీ జీవన్ రెడ్డి మాత్రం ససేమిరా వెనక్కి తగ్గలేదని తెలుస్తోంది.

మిగతా 2లో

# తగినన్ని చమురు నిల్వలు

### 41 దేశాల నుంచి దిగుమతులు, గృహావసరాలకు గ్యాస్ సరఫరాలు పెంచుతున్నాం
### గల్ఫ్ నుంచి 3.75 లక్షల భారతీయులను సురక్షితంగా తీసుకువచ్చాం : రాజ్యసభలో ప్రధాని మోడీ



**న్యూఢిల్లీ, మార్చి 24 (వుదయం) :** పశ్చిమాసియాలో పరిణామాలపై ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మంగళవారం రాజ్యసభలో ప్రసంగించారు. సోమవారంనాడు లోక్ సభలో ప్రసంగించిన ఆయన, మరురోజే పెద్దల సభలో మాట్లాడారు. ఈ సంక్షోభం నడుమ భారత్ వద్ద తగినంత ముడి చమురు నిల్వలు ఉండటమే కాక ఆరోగ్యవంతమైన సరఫరా ఏర్పాట్లు ఉన్నాయని ఆయన సభకు తెలిపారు. వ్యూహాత్మక పెట్రోలియం నిల్వలను, శుద్ధి సామర్థ్యాన్ని విస్తరించామని, సంక్షోభం నడుమ చోటు చేసుకుంటున్న అంతరాయల నుంచి దేశాన్ని కాపాడేందుకు ఇంధన దిగుమతులు ఇప్పుడు 41 దేశాల నుంచి వస్తున్నాయని, దేశీయ గ్యాస్, ఎరువుల సరఫరాలను బలోపేతం చేస్తున్నామని ప్రధాని వివరించారు.
గల్ఫ్ దేశాల్లోని భారతీయులు యుద్ధ సంక్షోభంలో చిక్కుకున్నారని ప్రధాని తెలిపారు. ఆయా దేశాల్లో కోటి మందికి పైగా భారతీయ కార్మికులు పనిచేస్తున్నారని చెప్పారు. గల్ఫ్ దేశాల నుంచి 3.75 లక్షల మందిని సురక్షితంగా భారతదేశానికి తీసుకువచ్చామని అన్నారు. భారతీయుల రక్షణకు తమ ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందన్నారు. అమెరికా, ఇజ్రాయెల్, ఇరాన్‌తో ఎప్పటికప్పుడు సంప్రదిస్తున్నామని తెలిపారు. మన ముందు చాలా సవాళ్లు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు.
అర్థిక వ్యవస్థకు ఇంధనమే వెన్నెముక...

మిగతా 2లో



భారత విదేశాంగ విధానం ప్రధాని వ్యక్తిగత విషయం అయిపోయింది. ఆయన అమెరికా ఇజ్రాయిల్ చెప్పినట్లే చేస్తారు: ప్రతిపక్ష నేత [illegible]

5

## సాదాబైనామాలకు త్వరలో మోక్షం

● కొనుగోలుదారు అఫిడవిట్ ఇస్తే సరిపోతుంది
● దరఖాస్తుదారులకు మేలు జరిగేలా జీ.ఓ. 76
● శాసన మండలిలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



2

## మరి 8 ఏళ్లు రాష్ట్ర రాజకీయాల్లోనే

ఢిల్లీలో ఓ ఛానల్ డిబేట్‌లో సిఎం రేవంత్‌రెడ్డి

కేంద్రంలో దక్షిణాదికి దక్కని కీలక పదవులు



**న్యూఢిల్లీ :** తాను మరో ఎనిమిదేళ్ల పాటు తెలంగాణలో రాష్ట్ర రాజకీయాల్లోనే ఉంటానని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఆ తర్వాత దేశ రాజకీయాల అరంగేట్రం గురించి ఆలోచిస్తానని చెప్పారు. ఒకవేళ భవిష్యత్తులో దేశ రాజకీయాలకు తాను అవసరమని పార్టీ భావిస్తే, ఆ నిర్ణయాన్ని హైకమాండ్‌కే వదిలేస్తున్నానని చెప్పారు. దేశంలోనే తెలంగాణ డీఎన్‌ఏ భిన్నమైందన్న ఆయన ఇదొక వైబ్రెంట్ ప్లేస్ అని కొనియాడారు. తెలంగాణకు, గాంధీ కుటుంబానికి ఉన్న ప్రత్యేక అనుబంధం ఉందని గుర్తుచేశారు. తాను ఒక నాయకుడిలా కాకుండా, కార్యకర్తగానే భావిస్తానని, వారి కష్టనష్టాలు తనకు తెలుసని పేర్కొన్నారు. మంగళవారం ఢిల్లీలో ఓ మీడియా ఛానెల్ డిబెట్ లో సీఎం మాట్లాడారు.

మిగతా 2లో

## సర్వర్లు మొరాయించడంతో రిజిస్ట్రేషన్లకు అంతరాయం

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అందని సేవలు

రిజిస్ట్రేషన్ల కోసం గంటల తరబడి పడిగాపులు

మధ్యాహ్నం తర్వాత సేవలు పునఃప్రారంభం




**హైదరాబాద్, మార్చి 24 (వుదయం ప్రతినిధి) :** మొరాయించిన సర్వర్లతో రాష్ట్ర వ్యాప్తంగా రిజిస్ట్రేషన్లకు అంతరాయం ఏర్పడింది. సుమారు నాలుగు గంటల పాటు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో పనులు సాగ లేదు. దీంతో స్లాట్ బుకింగ్ చేసుకుని.. రిజిస్ట్రేషన్ల కోసం వచ్చిన ప్రజలు.. గంటల తరబడి ఆఫీసుల ముందు పడిగాపులు కాశారు. మంగళవారం ఉదయం నుంచే సాంకేతిక సమస్యలు తలెత్తడంతో సర్వర్లు

## పీజీ మెడికల్ కౌన్సెలింగ్ గడువును పెంచలేం

### మీ సమస్యలను జాతీయ మెడికల్ కమిషన్‌కు చెప్పుకోవచ్చు
### ప్రైవేటు వైద్య కళాశాలకు సుప్రీం వెసులుబాటు



**న్యూఢిల్లీ :** తెలుగు రాష్ట్రాల్లోని పీజీ వైద్య విద్యార్థులకు, ప్రైవేట్ మెడికల్ కళాశాలలకు సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. పీజీ మెడికల్ సీట్ల భర్తీకి సంబంధించిన కౌన్సెలింగ్ గడువును పెంచేందుకు అత్యున్నత న్యాయస్థానం నిరాకరించింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోని పీజీ వైద్య సీట్ల భర్తీకి సంబంధించి కౌన్సెలింగ్ గడువును పొడిగించాలని దాఖలైన పిటిషన్లను సుప్రీంకోర్టు కొట్టివేసింది. ఇప్పటికే అనేక విడతలుగా కౌన్సెలింగ్ ప్రక్రియ పూర్తయినందున, ఇకపై సమయాన్ని పొడిగించడం సాధ్యం కాదని న్యాయస్థానం స్పష్టం చేసింది. ఈ కేసుపై మంగళవారం విచారణ చేపట్టిన దేశ అత్యున్నత న్యాయస్థానం ఇప్పటికే ఏడుసార్లు కౌన్సెలింగ్ నిర్వహించిన విషయాన్ని గుర్తు చేసింది. ఇన్ని అవకాశాలు కల్పించిన తర్వాత కూడా ఇంకా గడువు పెంచాలని కోరడం సమంజసం కాదని అభిప్రాయపడింది. విద్యా సంవత్సరం క్యాలెండర్‌ను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. జాతీయ మెడికల్ కమిషన్ కోర్టుకు సమర్పించిన వివరాలను ధర్మాసనం పరిగణనలోకి తీసుకుంది. ప్రతి ఏటా దేశవ్యాప్తంగా మెడికల్ సీట్లు మిగిలిపోవడం సహజమని, దీని కోసం నిరంతరం గడువు పెంచడం కుదరదని ఎన్‌ఎంసీ స్పష్టంచేసింది. మిగిలిపోయిన సీట్లలో అత్యధికం ప్రైవేట్ మెడికల్ కాలేజీల్లోనే ఉన్నాయని, ప్రభుత్వ కోటా సీట్లు దాదాపు భర్తీ అయ్యాయని కమిషన్ వివరించింది. ఈ నేపథ్యంలో గడువు పొడిగింపు అవసరం లేదని...

మిగతా 2లో

# త్వరలో డీలిమిటేషన్

● లోక్ సభ స్థానాలు 816కు పెంపు ● దేశంలో 6085కి పెరగనున్న శాసనసభ స్థానాలు
● రాష్ట్రంలో అదనంగా 60 అసెంబ్లీ స్థానాలు ● మహిళలకు ఎక్కువ సీట్లు

**హైదరాబాద్, మార్చి 24 (వుదయం ప్రతినిధి) :** లోకసభ, రాష్ట్రాల అసెంబ్లీ స్థానాలను 50 శాతం మేర పెంచే దిశగా కేంద్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. బిల్లు అమలైతే లోక్‌సభ స్థానాలు 816కి, అసెంబ్లీ స్థానాలు 6,185కి పెరుగుతాయి. దేశవ్యాప్తంగా లోక్‌సభ స్థానాలతో పాటు అన్ని రాష్ట్రాల అసెంబ్లీ సీట్లను 50 శాతం మేర పెంచాలని కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ప్రస్తుత పార్లమెంటు సమావేశాల్లోనే బిల్లు ప్రవేశపెట్టేందుకు మోదీ ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఈ ప్రతిపాదన అమలైతే,

మిగతా 2లో

## ప్రజల దృష్టి మళ్లించే ప్రయత్నం



● ఆరు గ్యారంటీలపై బిల్లు పెడుతున్నాం ● ఆ భయంతోనే హడావిడిగా నాపై ఈ కార్ రేస్ చార్జిషీట్ ● బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**హైదరాబాద్, మార్చి 24 (వుదయం ప్రతినిధి) :** ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారెంటీలపై తాము బిల్లు పెడుతుండటంతో, ప్రజల దృష్టిని మళ్లించేందుకే హడావుడిగా తనపై ఫార్ములా–ఈ రేస్ కేసులో ఛార్జిషీట్ దాఖలు చేశారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రాష్ట్ర ప్రభుత్వంపై మండిపడ్డారు. ఇది ముమ్మాటికీ అక్రమ కేసు అని ఆయన ధ్వజమెత్తారు. మంగళవారం అసెంబ్లీలో మీడియా ప్రతినిధులతో నిర్వహించిన 'చిట్ చాట్'లో ఆయన ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు.

## నాకు మంత్రి పదవి ఇస్తే ప్రభుత్వానికే మంచిది

### మీడియాతో కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి



**మార్చి 24 (వుదయం ప్రతినిధి) :** తాను పదవుల కోసం పాకులాడే వ్యక్తిని కాదని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి స్పష్టం చేశారు. ఏ పదవి లేకపోయినా ప్రజల్లో తనకు ఎనలేని ఆదరణ, గౌరవం ఉందన్నారు, తనకు మంత్రి పదవి ఇస్తే అది వ్యక్తిగతంగా తనకంటే కాంగ్రెస్ పార్టీ, రాష్ట్ర ప్రభుత్వానికే మంచి పేరు తెస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. మంత్రి పదవి విషయంలో గతంలో అధిష్టానం తనకు హామీ ఇచ్చిందన్న ఆయన అధిష్టానం ఇప్పుడు ఏం చేస్తుందో తనకు తెలియదన్నారు. మంగళవారం అసెంబ్లీ లాబీలో ఆయన మీడియాతో చిట్ చాట్ చేశారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ మళ్లీ అధికారంలోకి రావాలంటే తనలాంటి తెలంగాణ ఉద్యమకారుల సేవలు పార్టీకి చాలా అవసరమని ఆయన పేర్కొన్నారు. కేడర్‌లో పట్టున్న నేతలను గుర్తించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని పరోక్షంగా గుర్తు చేశారు. సీఎం రేవంత్ రెడ్డితో తనకు ఎలాంటి ఇబ్బందులు లేవని రాజగోపాల్ రెడ్డి స్పష్టత ఇచ్చారు. ఈ నెల 23న ముఖ్యమంత్రితో ప్రత్యేక భేటీ ఏదీ జరగలేదన్న ఆయన అసెంబ్లీలో ఎదురుపడినప్పుడు కేవలం మర్యాదపూర్వకంగా పలకరించుకున్నామని తెలిపారు. మంగళవారం అసెంబ్లీ డైనింగ్ హాల్‌లో కేటీఆర్‌తో జరిపిన సుదీర్ఘ భేటీపై స్పందించిన ఆయన అది కేవలం సాధారణ సంభాషణ మాత్రమేనని చెప్పారు. అయితే, ఆ చర్చల్లో గత రాజకీయ పరిణామాలను

## డ్వాక్రా గ్రూపు మహిళల కు కేటాయించిన పొలం అన్యాక్రాంతం అవుతుంది

**బినామీ పేర్లతో బడా బాబులు అన్యాక్రాంతం చేస్తున్నారు**

**న్యాయం చేయాలంటూ ఆర్డిఓ ను కలిసిన మత్స్యకార మహిళలు**



**కావలి, మార్చి 23, వుదయం ప్రతినిధి:**
గత కొన్ని సంవత్సరాల క్రితం డ్వాక్రా పొదుపు గ్రూపు మహిళలకు ఇచ్చిన పొలం, నేడు అన్యాక్రాంతమవుతుందని, పరిశీలించి తమకు న్యాయం చేయాలంటూ కావలి ఆర్టీవో ఎలీషా బాబును కలిసి వినతి పత్రం అందజేశారు. కావలి రూరల్ మండలం చెన్నాయపాలెం, పెద్ద పట్టపు పాలెం గ్రామ డ్వాక్రా పొదుపు మహిళలు పెద్ద ఎత్తున కావలి చేరుకొని గ్రీవెన్స్ డే సందర్భంగా సోమవారం కావలి ఆర్డీవో కార్యాలయంలో అర్జీ అందజేసి సమస్యను విన్నవించారు. పొదుపు మహిళలు పలువురు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గత కొన్ని సంవత్సరాల క్రితం పెద్ద పట్టపుపాలెం పంచాయతీ లో 100 డ్వాక్రా పొదుపు గ్రూపు మహిళలు ఉన్నారు. 1998వ సంవత్సరంలో నందెమ్మపాలెం కాలువ ప్రక్కన పోరంబోకు భూమి దాదాపు 150 ఎకరాల పొలం ఉన్నది. దానిని ఆ నాటి ప్రభుత్వ పెద్దలు, నాటి నాయకులు పొదుపు మహిళలకు సాగు చేసుకునీ అనుభవించమని కేటాయించారు. ఆ పొలంలో దాదాపు 20 లక్షల రూపాయలు ఖర్చుపెట్టి చెట్లు తీయించి, చదును చేసి పొదుపు గ్రూపు మహిళల అంతా కలిసి సాగు చేసుకుంటున్నామని తెలిపారు. తమ కుటుంబాలు ఆ పొలంతో జీవనం సాగిస్తున్నారు. కొంతకాలం తరువాత అప్పటి అధికారులు లకు విన్నవించుకొనగా వారు తమకు అనుకూలంగా స్పందించి డ్వాక్రా పొదుపు గ్రూపుల పేర్లు మీద పట్టాలు మంజూరు చేసి ఇస్తామని నమ్మబలికారు అన్నారు. కానీ కాలక్రమమైన వాటి ఊసే లేకుండా కొంతకాలం గడిచిన తర్వాత మరల అధికారుల దృష్టికి తీసుకుపోగా వారు 13 గ్రూపులకు దాదాపు 40 నుంచి 50 మంది సభ్యులకు పట్టాలు మంజూరు అయినదని తెలిపారు. అందుకుగాను తమకు జన్మభూమి పథకంలో రిజిస్టర్ చేసిన నెంబర్ 7/06/06/98 ను ఇచ్చారు అని తెలిపారు. అలాగే సర్వే నెంబర్ 4575,369 కూడా తమకు ఇచ్చారని తెలిపారు. తమ గ్రామంలో మాజీ సర్పంచ్ టిడిపి పార్టీ మీద గెలిచిన నాగన్న గారి శ్రీనివాసులు అనే నాయకుడు తర్వాత కాలంలో వైసీపీ పార్టీలో చేరి బినామీల పేర్ల మీద, తమ పొలాలను ఆక్రమించుకొని ఉన్నారని పేర్కొన్నారు. ఆ బినామీ పేర్లు పరిశీలిస్తే పెద్ద పెద్ద బడా బాబుల పేర్లు బయటికి వస్తాయని అందుకుగాను అధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాలని కోరారు. ప్రస్తుతం ఆ ప్రాంతంలో రామాయపట్నం పోర్టు పరిధిలోకి రావడంతో వాటికి గిరాకీ పెరిగి అన్యాక్రాంతమవుతున్నాయని వాటికి పట్టాలు కూడా సృష్టించుకుంటూ తమ మత్స్యకార మహిళలకు అన్యాయం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కనుక ఉన్నతాధికారులు పరిశీలించి తగు చర్యలు చేపట్టాలని కోరారు. ఈ సందర్భంగా ఆర్డీవోకు వినతి పత్రం అందజేశారు.

# రాష్ట్రంలోని మూడు ప్రాంతాలను సమానంగా అభివృద్ధి చేస్తున్నాం

**మిట్టల్ స్టీల్ ఫ్యాక్టరీ వల్ల లక్ష మందికిపైగా ఉద్యోగాలు**

**3వ డివిజన్‌లో రోడ్డు పనులకు శంకుస్థాపన చేసి, ఇస్త్రీబండిని అందచేసిన ఎమ్మెల్యే గద్దె రామమోహన్**



**విజయవాడ , మార్చి 23, వుదయం ప్రతినిధి:**
రాష్ట్రంలోని మూడు ప్రాంతాలను సమానంగా, సమగ్రంగా అభివృద్ధి చేయడానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటున్నారని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామమోహన్ చెప్పారు. ఒక వైపున అమరావతి, మరోవైపున వైజాగ్, రాయలసీమలో పలుప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేస్తున్నారని చెప్పారు. రాయలసీమ ప్రాంతానికి నీరు అందించిన ఘనత కూడా తమ ప్రభుత్వానిదేనని అన్నారు. సోమవారం ఉదయం తూర్పు నియోజకవర్గ పరిధిలోని 3వ డివిజన్ రామచంద్రనగర్ ఆప్కాబ్ బ్యాంక్ రోడ్డులో తెలుగుదేశం పార్టీ ఆఫీస్ దగ్గర రూ.7.57 లక్షల అంచనా వ్యయంతో చేపట్టిన రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన కార్యక్రమం జరిగింది. తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామమోహన్ హాజరై పూజలు చేసి నిర్మాణ పనులను ప్రారంభించారు. అనంతరం డివిజన్‌లోని నిరుపేద కుటుంబానికి చెందిన ఉప్పులూరు శివయ్యకు జీవనోపాధి నిమిత్తం 20 వేల రూపాయల విలువ చేసే ఇస్త్రీబండిని ఎమ్మెల్యే గద్దె రామమోహన్ తన సొంత నిధులతో కోనుగోలు చేసి ఉచితంగా అందచేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గద్దె రామమోహన్ మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో విశాఖపట్నంలో ఉక్కు ఫ్యాక్టరీ కోసం ఉద్యమాలు చేశారన్నారు. విశాఖలో ఉక్కు ఫ్యాక్టరీ వచ్చిన తర్వాతే అక్కడ అభివృద్ధి జరిగిందన్నారు. ఇప్పుడు విభజిత ఆంధ్రప్రదేశ్‌లో అనకాపల్లిలో మిట్టల్ సంస్థ ఆధ్వర్యంలో లక్షా ముప్పై వేల కోట్ల రూపాయల వ్యయంతో స్టీల్ ఫ్యాక్టరీని నిర్మాణం చేయడం చాలా ఆనందంగా ఉందన్నారు. సుమారు లక్ష మందికిపైగా ఈ ఫ్యాక్టరీ ద్వారా ఉద్యోగాలు పొందుతారన్నారు. ఇది చంద్రబాబునాయుడు ముందు చూపునకు నిదర్శనమని అన్నారు. ఇలాంటి మంచి కార్యక్రమాలకు ప్రతిపక్ష పార్టీలు కూడా మద్దతు ప్రకటించి తామంతా ఒక్కట్టిగానే ఉన్నామనే సంకేతాలు పంపాలన్నారు. ఇలాంటి అనేక పరిశ్రమలు రాష్ట్రంలో మరిన్ని స్థాపించనున్నారని తెలిపారు. కియా మోటార్స్ వల్ల అక్కడి వారికి ఉద్యోగాలు పొందడమే కాకుండా ఆ పరిసర ప్రాంతాల్లోని భూములకు బాగా డిమాండ్ పెరిగిందన్నారు. ఇలాంటి అంశాలపై కనీస పరిజ్ఞానం లేని ప్రతిపక్షం మన రాష్ట్రంలో ఉందన్నారు. ఐదు సంవత్సరాలు రాష్ట్రాన్ని పాలించిన వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వం పథకాలను ఉపయోగించుకోలేపోయారని అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పాలన అనుభవంతో కేంద్ర ప్రభుత్వ పథకాలను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకుంటూ కేంద్రం సహకారంతో రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తున్నారన్నారు. ప్రజలను ఏమార్చడానికి ప్రతిపక్షాలు అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారని ప్రజలు చాలా జాగ్రత్తగా ఉండాలని చెప్పారు. పిల్లల భవిష్యత్తు కోసం ప్రతి విషయాన్ని చాలా నిశితంగా పరిశీలించిన తర్వాతే నిర్ణయాలు తీసుకోవాలన్నారు. రాయలసీమకు నీరు అందించిన ఘనత కూడా తెలుగుదేశం పార్టీదేనని చెప్పారు. రాష్ట్రంలోని మూడు ప్రాంతాలను అభివృద్ధి చేస్తున్నామని ఎమ్మెల్యే గద్దె రామమోహన్ అన్నారు. ఈ కార్యక్రమంలో తూమాటి ప్రేమ్‌నాథ్, తాడి బాబూరావు, గద్దె రమేష్, యలమంచిలి పండు, గొల్లపల్లి నారాయణరావు, ముమ్మనేని ప్రసాద్, కృష్ణ ప్రసాద్, యలమందరావు, దాడి సుబ్బారావు, రాజనాల పవన్, గుత్తికొండ మోహన్‌రావు, గుంజా ఏసు, రాజనాల సురేష్ ,గల్లా రవి, ఈఈ సామ్రాజ్యం, ఏ.ఇ. దీక్షిత్ తదితరులు పాల్గొన్నారు.

## కావలి లోనీ అక్రమ కట్టడాలపై కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు

**నెల్లూరు , మార్చి 23, వుదయం ప్రతినిధి:**
ప్రజలు, వాహన చోదకులు నిత్యం తిరుగుతున్న చిన్నపాటి రోడ్లు కలిగిన ప్రాంతాలలో, ఎలాంటి అనుమతులు లేకుండా బహుళ అంతస్తు భవనాలు నిర్మించుటపై సోమవారం గ్రీవెన్స్ డే సందర్భంగా నెల్లూరు జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో బాధిత పిర్యాదు దారుడు అర్జీ అందజేశారు. కావలి రూరల్ మండలం రుద్రకోట గ్రామ నివాసి కె ఆదిశేషారెడ్డి ఈ ఫిర్యాదు చేశారు. వారి మాటల్లో గమనిస్తే. కావలి పట్టణం జనతా పేట సౌత్, రెండవ వీధిలో స్వర్ణ వసంత లక్ష్మి కొండప నాయుడు దంపతులు ఈ అపార్ట్మెంట్ నిర్మిస్తున్నారన్నారు. కావలి మున్సిపాలిటీ పర్మిషన్ లేకుండా సుమారు 63 అంకనముల స్థలంలో అపార్ట్మెంట్ నిర్మాణం జరుగుతుంది. ఈ అపార్ట్మెంట్ నిర్మిస్తున్న వీధిని గమనిస్తే చిన్నపాటిదిగా కనిపిస్తూ, 15 అడుగులు వెడల్పుతో ఇరుకు మార్గంగా కనిపిస్తుంది. 14.9*79.8 అక్షాంశ రేఖాంశాల ప్రకారం, 5 అంతస్తుల బహుళ నిర్మాణం చేపడుతున్నారు. ప్రస్తుతం ఈ నిర్మాణం గ్రౌండ్ ఫ్లోర్ పూర్తి చేసుకుని, స్లాబ్ వేసినట్లు తెలిపారు. వీరు ప్రభుత్వ నిబంధనలకు అతీతంగా నిర్మాణం చేపట్టడం జరిగిందన్నారు. సంబంధిత వార్డు సచివాలయం సిబ్బంది పలుమార్లు వీరిని హెచ్చరించి, అనుమతులు లేకుండా నిర్మించవద్దని తెలియజేసినప్పటికీ, అధికార బలం, అండ బలం మెండుగా ఉన్నాయని చెప్పుకుంటూ నిర్లక్ష్యంతో కూడిన వైఖరితో ఈ బహుళ అంతస్తు నిర్మాణాన్ని వీరు చేపట్టారు అని తెలియజేశారు.
ఈ విషయమై ఫిర్యాదు దారుడు కే ఆదిశేషారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేసి తదుపరి చర్యలు చేపట్టవలసిందిగా కోరుతూ ఆర్జీ దాఖలు చేసినట్లు తెలిపారు.

## అక్షరాభ్యాస వేడుక సాంస్కృతిక వైభవాన్ని చాటిచెప్పాయి ...

**గూడూరు ఎమ్మెల్యే డాక్టర్ పాశం సునీల్ కుమార్**



**గూడూరు, మార్చి 23, వుదయం ప్రతినిధి:**
గూడూరు లోని శ్రీ విజయ దుర్గ అమ్మవారి ఉపపీఠం నందు అక్షరాభ్యాస వేడుకలుపండుగ వాతావరణంలో అక్షరాభ్యాస వేడుకలు అక్షరాభ్యాస వేడుకలలో ముఖ్య అతిధిగా పాల్గొన్న గూడూరు శాసనసభ్యులు పాశిం సునీల్ కుమార్ ముఖ్య అతిధిగా పాల్గొన్న హిందూ ధర్మ పరిరక్షణ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ దాసరి శ్రీనివాసులు ప్రముఖులకు సాగర స్వాగతం పలికిన హిందూ ధర్మ పరిరక్షణ ట్రస్ట్ తిరుపతి పార్లమెంట్ అధ్యక్షులు కోట సునీల్ కుమార్ స్వామి ఎస్సి, ఎస్టీ, మైనారిటీ, మత్స్య కారులకుటుంబాలకు చెందిన 117 మంది విద్యార్థులకు అక్షరాభ్యాసన 'అక్షరభ్యాస' అనే ఆధ్యాత్మికంగా సుసంపన్నమైన మరియు సాంస్కృతికంగా ఉత్సాహభరితమైన కార్యక్రమానికి సాక్ష్యమిచ్చింది. భక్తి, ఆశీర్వాదాలు మరియు స్ఫూర్తిదాయక సందేశాలతో నిండిన ఆనందమయ వాతావరణంలో ఈ కార్యక్రమం జరగడం చాలా సంతోషంగా ఉందని గూడూరు నియోజకవర్గం శాసన సభ్యులు డాక్టర్ పాశం సునీల్ కుమార్ అన్నారు. సోమవారం గూడూరు లోని శ్రీ విజయ దుర్గ అమ్మవారి ఉపపీఠం నందు ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త,హిందూ ధర్మ పరిరక్షణ ట్రస్ట్ తిరుపతి పార్లమెంట్ అధ్యక్షులు డాక్టర్ కోట సునీల్ కుమార్ స్వామి పరివేక్షణలో హిందూ ధర్మ పరిరక్షణ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ దాసరి శ్రీనివాసులు రిటైర్ ఐఏఎస్ వారి పిలుపుమేరకు రాష్ట్రవ్యాప్తంగా ఐదు రోజుల నుండి నిర్వహిస్తున్న చిన్నపిల్లల పండుగ అయిన అక్షరాభ్యాస వేడుకలు పండుగ వాతావరణం లో నిర్వహించారు. ఈ వేడుకల్లో ముఖ్య అతిధిగా గూడూరు నియోజకవర్గం శాసనసభ్యులు డాక్టర్ పాశిం సునీల్ కుమార్ పాల్గొన్ని చిన్నారులందరికీ అక్షరాభ్యాస కార్యక్రమం ఎంతో విశేష రీతిలో నిర్వహించారు. వసంత పంచమి వంటి పండుగ వాతావరణంలో అక్షరాభ్యాసం చేయడం పిల్లల చదువుకు శుభారంభం, సరస్వతీ దేవి కటాక్షం కోసం అత్యంత ప్రశస్తం. మాఘ శుద్ధ పంచమినాడు వసంత రుతువు ప్రారంభంలో, బాసర వంటి పుణ్యక్షేత్రాలలో, ఇళ్లలో చిన్న పిల్లలకు అక్షరాల జ్ఞానాన్ని అందించే ఈ వేడుకను ఘనంగా, సాంప్రదాయ బద్ధంగా జరుపుకుంటారనీ కోట సునీల్ కుమార్ స్వామి తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ పాశం సునీల్ కుమార్ మాట్లాడుతూ డాక్టర్ దాసరి శ్రీనివాసులు ట్రస్టు తరపున అందరిని ప్రేరేపిస్తూ రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో తాను చైర్మన్గా అలాగే రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలిచినప్పటికీ ఈ అక్షరాభ్యాస వేడుకలలో పాల్గొనడం మొదటిసారి అని తెలియజేస్తూ పిల్లలకు అక్షరాభ్యాసం చేయడం చాలా ఆనందంగా ఉందని తెలియజేశారు. అనంతరం కోట సునీల్ కుమార్ స్వామి మాట్లాడుతూ చిన్నారులందరికీ స్కూల్ బ్యాగ్ పలక బలపం నోట్ బుక్ పెన్ను అలాగే చాక్లెట్లు బిస్కెట్ ప్యాకెట్లు అమ్మవారికి నివేదించిన కేసరి ప్రసాదం తో పాటు అన్నప్రసాద్ వితరణ కార్యక్రమం నిర్వహించి వారందరికీ చక్కటి భోజనంతో కార్యక్రమం ముగిసిందనీ తెలిపారు. *ప్రత్యేకించి ఎస్సీ ఎస్టీ మత్స్యకార కాలనీల నుండి విచ్చేసిన పిల్లలు ఎంతో శ్రద్ధతో జై శ్రీరామ్ జై శ్రీరామ్ అంటూ నినాదం చేస్తూ తమ తల్లిదండ్రులు తమకు నేర్పించిన గురు బ్రహ్మ గురు విష్ణు అనే శ్లోకం మొదలుకొని ఇంటిదగ్గర నేర్పించిన అనేక శ్లోకాలు చక్కగా మననం చేస్తూ ఓం నమశ్శివాయ సిద్ధం నమః ఉచ్చారణతో అక్షరాభ్యాసం చేస్తూ తమకు అందించిన బ్యాగును చూసి మురిసిపోతూ తమతో పాటు వచ్చిన పెద్దలతో స్కూలుకి ఎప్పుడు పంపిస్తావు అని అడుగుతూ తెగ మురిసిపోవడం చాలా తృప్తినిచ్చిందన్నారు . ఈ కార్యక్రమంలో ఆది నుండి ప్రోత్సహించి 117 మంది విద్యార్థులకు అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించే అవకాశాన్ని కల్పించిన హిందూ ధర్మ పరిరక్షణ ట్రస్టు మరియు ప్రభుత్వం వారికి మనసా వాచా కర్మణా హృదయపూర్వక ధన్యవాదములుతెలిపారు . అనుక్షణం మా వెంట ఉండి ప్రతి ఒక్కరిని తమ కుటుంబ సభ్యుల లాగా భుజం మీద చేయి మాకు అహర్నిశలు అండదండగా తోడునీడగా ఉండి ప్రోత్సహిస్తున్న చైర్మన్ డాక్టర్ దాసరి శ్రీనివాసులు ఐఏఎస్ కి మనసా వాచా కర్మణా హృదయపూర్వక ధన్యవాదములు తెలిపారు .ఈ కార్యక్రమం మా జీవితంలో ఎప్పటికీ మరువలేనిది. చిన్నపిల్లల కళ్ళల్లో ఉన్న ఆనందాన్ని చూస్తే ఇప్పటికీ మా కళ్ళల్లో ఆనందభాష్పాలు రాలుతూనే ఉన్నాయి. యుద్ధ వాతావరణం సమసిపోవాలని హోమాలు శ్రీ విజయ దుర్గ అమ్మవారి పీటాన్ని స్థాపించడానికి ముందు శ్రీ విజయ దుర్గ పీఠాధిపతుల వారి నుండి మంత్ర ఉపదేశం తీసుకున్న తర్వాత అనేక ప్రాంతాలలో ప్రత్యేకించి ఎస్సీ, ఎస్టీ మత్స్యకార కాలనీలలో మరియు అనేక గ్రామాలలో ఆర్థికంగా పూజ కోసం ఖర్చు పెట్టుకోలేనటువంటి అనేకమంది హిందూ బంధువుల సంక్షేమం గూడూరు అమ్మవారి పీఠం నుండే పూజా ద్రవ్యాలు ప్రసాదాలు అన్నింటిని తీసుకువెళ్లి అక్కడ హోమాన్ని నిర్వర్తించినట్లు కోట సునీల్ కుమార్ స్వామి తెలిపారు. అనేక పుణ్య క్షేత్రాలలో హోమాలు పూర్తిచేసుకుని ఈరోజు లోక కళ్యాణార్థం ప్రత్యేకించి ప్రస్తుతం నడుస్తున్న యుద్ధ వాతావరణం కారణం చేత సామాన్యులకు ఎటువంటి ఆటంకం కలగకూడదని అలాగే ఎటువంటి ప్రాణహాని జరగరాదని అలాగే లోకంలో ఉన్న వారంతా సంతోషంగా సుభిక్షంగా ఉండాలని అతి త్వరలో యుద్ధాలనే సమసిపోయి అందరు శాంతియుతంగా నడవాలని సంకల్పంతో 900 యాగాన్ని గూడూరులోని మన విజయదుర్గ అమ్మవారి ఉపపీఠం నందు నిర్వహిస్తున్నామనీ తెలిపారు.

## రాష్ట్ర ముఖచిత్రాన్ని మార్చనున్న భారీ స్టీల్ ప్లాంట్ - కూటమి ప్రభుత్వ విజన్‌కు నిదర్శనం

**టీడీపీ యువ నాయకులు గద్దె క్రాంతి కుమార్**



**విజయవాడ , మార్చి 23, వుదయం ప్రతినిధి:**
అనకాపల్లి జిల్లాలో అర్సెలార్ మిట్టల్ నిప్పన్ స్టీల్ ప్లాంట్ శంకుస్థాపన జరగడం రాష్ట్ర పారిశ్రామిక అభివృద్ధికి కీలక మైలురాయిగా నిలిచిందని టీడీపీ యువ నాయకులు గద్దె క్రాంతి కుమార్ పేర్కొన్నారు. సోమవారం ఉదయం గద్దె క్రాంతి కుమార్ 12వ డివిజన్ కృష్ణా నగర్ ఏరియాలో పర్యటించి, పేద దళిత యువకుడు గద్దె కోటి (మరియబాబు) కి స్వయం ఉపాధి నిమిత్తం కొబ్బరి బొండాల వ్యాపారం చేసుకునేందుకు కొబ్బరి బోండాలా బండిని గద్దె క్రాంతి కుమార్ సొంత నిధులతో అందజేసిన ప్రారంభించారు. ఈ సందర్బంగా గద్దె క్రాంతి కుమార్ మాట్లాడుతూ అనకాపల్లి జిల్లాలో సోమవారం నాడు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా సుమారు రూ.1,35,964 కోట్ల భారీ పెట్టుబడితో దేశంలోనే అతిపెద్ద స్టీల్ ప్లాంట్ కు శంకుస్థాపన జరుగుతుందన్నారు. ఈ గ్రీన్ ఫీల్డ్ ఇంటిగ్రేటెడ్ స్టీల్ ప్లాంట్ ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా దాదాపు లక్ష మందికి ఉద్యోగావకాశాలు కలగనున్నాయని తెలిపారు. ఏడాదికి 17.8 మిలియన్ మెట్రిక్ టన్నుల ఉక్కు ఉత్పత్తి సామర్థ్యంతో రాష్ట్రాన్ని పారిశ్రామికంగా మరింత బలపరిచే శక్తి ఈ ప్రాజెక్టుకు ఉందన్నారు. మొత్తం 5,465 ఎకరాల్లో రెండు దశల్లో నిర్మితమవుతున్న ఈ స్టీల్ ప్లాంట్ రాష్ట్ర అభివృద్ధి దిశగా మరో కీలక అడుగుగా నిలుస్తుందని, పెట్టుబడులను ఆకర్షించడంలో కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు ఇది నిదర్శనమని చెప్పారు. గత వైసిపి ప్రభుత్వం విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేసి నిర్వీర్యం చేయాలని ప్రయత్నించిందని విమర్శించిన గద్దె క్రాంతి కుమార్, కూటమి ప్రభుత్వం మాత్రం విశాఖ స్టీల్ ప్లాంట్‌ను యథావిధిగా కొనసాగించడంతో పాటు మరో భారీ స్టీల్ ప్లాంట్‌ను రాష్ట్రానికి తీసుకురావడం గొప్ప విషయం అని అన్నారు. రాష్ట్ర అభివృద్ధి, యువతకు ఉద్యోగాలు, పారిశ్రామిక పురోగతే లక్ష్యంగా పనిచేస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం సమర్థతను ఈ ప్రాజెక్టు స్పష్టంగా ప్రతిబింబిస్తోందని కొనియాడారు.రాబోయే రోజుల్లో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే అగ్రగామి పారిశ్రామిక రాష్ట్రంగా ఎదగడం ఖాయమని గద్దె క్రాంతి కుమార్ విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బండి బాలయోగి, నూతి శ్రీనివాస్, సాయన సత్యనారాయణ, మాదిరెడ్డి రవి, ఎస్.కె. నాగూర్, గద్దె తంబీ తదితరులు ఉన్నారు.

## చెందోడులో మెగా ఉచిత వైద్య శిబిరం

**★ నిరుపేదల ముంగిటకే ఉచిత వైద్య శిబిరం**



**గూడూరు, మార్చి 23, వుదయం ప్రతినిధి:**
నిరుపేదల ముంగిటకే కార్పొరేట్ వైద్యం అందించేందుకు శ్రీకారం చుట్టామని ఎం.వి.రావు. ఫౌండేషన్ చైర్మన్ ముప్పవరపు లీలామోహన్ కృష్ణ తెలిపారు. నెల్లూరు జిల్లా కోట మండలం చెందోడు గ్రామంలోని దళిత వాడలో ఉన్న అంగన్వాడీ కేంద్రం వద్ద సోమవారం ఉదయం ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. తిరుపతి పట్టణానికి చెందిన అర్థాల అల్లయ్య చారిటబుల్ ట్రస్ట్, ఎస్ ఆర్ చారిటబుల్ ట్రస్ట్, ఎం.వి. రావు ఫౌండేషన్ సంయుక్తంగా మార్చి 22 నుంచి శ్రీకారం చుట్టిన ఈ కార్యక్రమాలు ప్రతిరోజు నిర్వహిస్తున్నామని ఈ క్రమంలో సోమవారం చంద్రుడు దళితవాడలో ఉన్న అంగన్వాడీ కేంద్రం వద్ద ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి దళితవాడ, వడ్డీ పాలెం గ్రామస్తులకు ఉచితంగా కోట పట్టణానికి చెందిన రమేష్ఐ కేర్ ఆధ్వర్యంలో గ్రామస్తులకు కంప్యూటర్ ద్వారా కంటి పరీక్షలు నిర్వహించి వారికి ఉచితంగా కంటి అద్దాలు, కంటి చుక్కల మందులను అందజేశారు. పదిమందికి కంటి అద్దాలు, పదిమంది కంటి ఆపరేషన్లకు గుర్తించి వాసన్ ఐ కేర్ కు ఆపరేషన్ నిమిత్తం తరలించారు. అనంతరం దళితవాడ వాసులకు అంగన్వాడీ కేంద్రంలోని చిన్నారులకు సీజనల్ వ్యాధులు సోకకుండా వారికి హోమియో మందులను పంపిణీ చేశారు. అనంతరం కోట మండల పరిషత్ కార్యాలయం అభివృద్ధి అధికారి పి, శివప్రసాద్, ఉత్తమ రక్తదాతగా, మెట్టు గ్రామానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు నాగుర్ రెడ్డికి జాతీయ ఉగాది పురస్కారాలను అందజేసి ఘనంగా సన్మానించారు. బుధవారం నుంచి తిరుపతి పట్టణానికి చెందిన కార్పొరేట్ ఆసుపత్రులకు చెందిన వైద్యులచే ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నాము అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎం.వి. రావు ఫౌండేషన్ చైర్మన్ ముప్పవరపు లీల మోహన్ కృష్ణ, కార్యదర్శి ఎం. విజయలక్ష్మి, ఆర్థల. అల్లెయ్య చారిటబుల్ ట్రస్ట్ అధినేత కేశవులు, ఎస్ ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ సంధ్యారాణి, అంగన్వాడి కేంద్రం ఉపాధ్యాయిని ఎం. రూపలత, ఎస్. భార్గవి.
విద్యార్థులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యం.

**.డి. వై.ఎఫ్. ఐ జిల్లా కార్యదర్శి ఏం.వి.రమణ , ఐద్వా జిల్లా కార్యదర్శి షేక్ మస్తాన్. బి**




**గూడూరు, మార్చి 23, వుదయం ప్రతినిధి:**
,డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యమని డి. వై.ఎఫ్. ఐ జిల్లా కార్యదర్శి ఏం.వి.రమణ , ఐద్వా జిల్లా కార్యదర్శి షేక్ మస్తాన్. బి. లు పేర్కొనారు.సోమవారం గూడూరు పట్టణంలో నీ టవర్ క్లాక్ సెంటర్ కి జీపు జాతా చేరుకుంది. గూడూరు సీపీఎం, ప్రజాసంఘాల నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మత్తు పదార్థాల కట్టడి లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలం చెందాయన్నారు. రోజురోజుకి గంజాయి, మత్తు పదార్థాల మాఫియా లో యువత చిక్కుకొని జీవితాలు చిన్నాభిన్నం చేసుకుంటున్నాయన్నారు. నెల్లూరు జిల్లాలో గంజాయి ముఠా కి వ్యతిరేకంగా పోరాడుతున్న సీపీఐ నాయకులు పెంచలయ్యను హత్య గావించడం జరిగిందన్నారు.పెంచలయ్య కుటుంబానికి ప్రభుత్వం తక్షణమే ఆర్థిక సహాయం ప్రకటించాలన్నారు. ఆయన సతీమణికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని , అదేవిధంగా కుటుంబ పోషణకు ఐదు ఎకరాలు భూమి నీ ఇవ్వాలని తెలిపారు. భగత్ సింగ్ స్ఫూర్తి తో విద్యార్థులు , యువత కలిసి గంజాయిని నిర్మూలిద్దామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డి. వై. ఎఫ్.ఐ జిల్లా అధ్యక్షులు బి.పి.నరసింహ , ఐద్వా జిల్లా అధ్యక్షులు టి.శివ కుమారి,ఐద్వా రూరల్ కార్యదర్శి షాహీన , ఐద్వా నగర కార్యదర్శి కె.పద్మ ఎస్.ఎఫ్. ఐ జిల్లా కార్యదర్శి వి.నరేంద్ర , గూడూరు సీపీఎం ప్రాంతీయ కార్యదర్శి జోగి శివ కుమార్ , బి.వి రమణయ్య ,పామంజి మణి , పుట్టా శంకరయ్య , అడపాల ప్రసాద్ , ఎంబేటి చంద్రయ్య , వెంకటరామి రెడ్డి ,గండి కోట మధు , చంద్ర మోహన్ , తదితరులు పాల్గొన్నారు.

## భగత్ సింగ్ త్యాగం యువతకు ఆదర్శం

**సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సీ హెచ్. ప్రభాకర్**

**గూడూరులో ఘనంగా భగత్ సింగ్ 95వ వర్ధంతి**




**గూడూరు, మార్చి 23, వుదయం ప్రతినిధి:**
భగత్ సింగ్ త్యాగం యువతకు ఆదర్శమని, ఆయన ఆశయాలు కొనసాగించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సిహెచ్. ప్రభాకర్, నియోజకవర్గ కార్యదర్శి జి. శశి కుమార్ పిలుపునిచ్చారు. సోమవారం గూడూరు పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో గూడూరు సీపీఐ నియోజకవర్గ సమితి ఆధ్వర్యంలో భగత్ సింగ్ 95 వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 23 అతి చిన్న వయసులోనే ఉరికంభాన్ని ముద్దాడిన స్వతంత్ర సమర యోధులు భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్ లు అని కొనియాడారు.భగత్ సింగ్ ఉరికంబాన్ని కూడా లెక్క చేయకుండా దేశం కోసం ప్రాణాలు అర్పించిన మహనీయుడు అన్నారు. భారతమాతకు దాస్య విముక్తి కలిగించే పోరాటంలో తెల్ల వాడి గుండెలను చీల్చి చెండాడిన వీరుడన్నారు. స్వతంత్రం కోసం పార్లమెంట్ లో పొగ బాంబు వేసి ఇంక్విలాబ్ జిందాబాద్ అని నినాదించారుని గుర్తుచేశారు. ప్రస్తుతం యువత మాదక ద్రవ్యాలకు బానిసై జీవితాలను చిన్నాభిన్నం చేసుకుంటున్నారని, దేశం కోసం ప్రాణాలను తృణప్రాయంగా విడిచిన సమరయోధులను యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. మంచి మార్గంలో నడిచి, యువత మేధాశక్తి సమాజానికి ఉపయోగపడేలా ఉండాలన్నారు.ఈ కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శి షేక్ జమాలుల్లా, సీపీఐ పట్టణ కన్వీనర్ సునీల్, చిల్లకూరు మండల కార్యదర్శి రమేష్, ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి కే. నారాయణ, ప్రజా నాట్యమండలి నాయకులు బి.గోపాల్, వెంకటేశ్వర్లు, వెంకటయ్య, రిజ్వాన్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు ఎమ్మెల్యే సునీల్ కుమార్

**గూడూరు, మార్చి 23, వుదయం ప్రతినిధి:**
,ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో మొదటి నారా లోకేష్ విద్యార్థిని విద్యార్థులకు అనేక సౌకర్యాలు కల్పిస్తున్నారని మధ్యాహ్నం కూడా ఎంతో రుచికరంగా ఉందని గూడూరు నియోజకవర్గ ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ వెల్లడించారు...గూడూరు గాంధీనగర్ లోని ఎంపీపీ స్కూల్లో మధ్యాహ్న భోజనాన్ని ఎమ్మెల్యే సునిల్ కుమార్ తనిఖీ చేశారు. పిల్లలతో కలిసి భోజనాన్ని స్వీకరించారు. అనంతరం క్లాస్ రూమ్ లో పరిసర ప్రాంతాలను పరిశీలించారు ఎమ్మెల్యే సునీల్ కుమార్ మాట్లాడుతూ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ప్రభుత్వ పాఠశాలలో అనేక మౌలికవస్తులు కల్పిస్తున్నారని మధ్యాహ్నం భోజనం కూడా ఎంతో నాణ్యతగా ఉందని తెలిపారు పేద బిడ్డలు కూడా చదువుకోవాలని ఉద్దేశంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పిల్లలను పాఠశాలలకు పంపించిన తల్లులకు సంవత్సరానికి 15000 రూపాయలు నగదు జమ చేస్తున్నారని యూనిఫార్మ్స్ పుస్తకాలు ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ఉచితంగా అందిస్తున్నారని గుర్తు కావాలని తెలిపారని వెంటనే వాటిని ఏర్పాటు చేస్తామని అన్నారు ఈ కార్యక్రమంలో ఎంఈఓ మరియు నాయకులు పాల్గొన్నరు

## రాజుపేట పంచాయితీ అధికారులు స్పందించాలి

**విఆర్ పురం మార్చి 23, వుదయం ప్రతినిధి:**
వి ఆర్ పురం మండలం రాజుపేట పంచాయతీ లో మొద్దులు గూడెం గ్రామంనుండి శ్రీరామగిరి గ్రామం వరకు అధ్వనంగా ఉన్న మెన్ రాహదారి.ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఇంకా శ్రీరామ నవమి నాలుగు రోజులే ఉన్నది ఈ నేపథ్యంలో ముద్దులగూడెం క్రాస్ రోడ్డు నుండి సీతంపేట గ్రామం అడుగడుగునా గోతులు ప్రయాణం అధ్వానీయంగా మారింది రాజపేట గ్రామపంచాయతీ అధికారులు వెంటనే స్పందించి ఈ రహదారిలో ఉన్న టువంటి గోతులు మయంగా ఉన్న రహదారి మరమ్మత్తులు చేయండి అదే విధంగా రోడ్డు రెండు వైపుల మూసుకు పోయిన పొదలు తొలగించండిఅని భక్తులు ఆయా గ్రామాల ప్రజలు డిమాండు చేస్తున్నారు.

# జాతీయం-అంతర్జాతీయం

## ఇరాన్‌కు రష్యా సాయం

### ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీ సంచలన వ్యాఖ్యలు



**వుదయం డెస్క్, మార్చి 24:**
పశ్చిమాసియాలో యుద్ధానికి రష్యా ఆజ్యం పోస్తోందనడానికి ఉక్రెయిన్ సైనిక నిఘా వద్ద తిరుగులేని ఆధారాలు ఉన్నాయని ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలోడమిర్ జెలెన్స్కీ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ కారణంగా మధ్య ప్రాచ్యంలో యుద్ధం ఇప్పుడే ముగిసే అవకాశం లేదని ఆయన అన్నారు.

రష్యా తన సొంత సిగ్నల్స్ ఇంటెలిజెన్స్, ఎలక్ట్రానిక్ ఇంటెలిజెన్స్ సామర్థ్యాలను, అలాగే మధ్యప్రాచ్యంలోని భాగస్వాములతో సహకారం ద్వారా పొందిన డేటాలో కొంత భాగాన్ని ఉపయోగిస్తోంది, అని సైనిక గూఢచార అధిపతితో సమావేశమైన తర్వాత ఆయన ఎక్స్‌పై పేర్కొన్నారు.

ఇరాన్ ప్రభుత్వానికి రష్యా ఇంటెలిజెన్స్ మద్దతు అందిస్తోంది. ఇందుకు తమ వద్ద కచ్చితమైన ఆధారాలు ఉన్నాయి. ఇది విధ్వంసకర చర్య. దీన్ని వెంటనే ఆపాలి. లేదంటే పరిస్థితి మరింత దిగజారుతుంది అని జెలెన్స్కీ ఆందోళన వ్యక్తంచేశారు. అనేక దేశాలు సంక్షోభాన్ని నివారించే ప్రయత్నాలు చేస్తున్నాయన్నారు. యుద్ధం నేపథ్యంలో మార్కెట్లు ప్రతికూలంగా ఉన్నాయని, పలు దేశాల్లో ఇంధన సరఫరాపై గందరగోళం నెలకొందన్నారు. ఇరాన్ పాలన నిలదొక్కుకోవడానికి.. అమెరికా, ఇజ్రాయెల్ లక్ష్యాలపై ఆ దేశం కచ్చితమైన దాడులు చేయడానికి రష్యా సాయపడటాన్ని తప్పుబట్టారు. దీని కారణంగా యుద్ధం మరిన్ని రోజులు కొనసాగే అవకాశం ఉందన్నారు. దీనిపై వెంటనే ప్రతిస్పందించాల్సిన అవసరం ఉందన్నారు.

కాగా, రష్యా ఉపగ్రహ చిత్రాలను, మెరుగైన డ్రోన్ సాంకేతికతను ఇరాన్‌కు అందిస్తోందంటూ వాల్ స్ట్రీట్ జర్నల్‌లో గత వారం వచ్చిన వార్తలను అబద్ధపు వార్తలంటూ గత వారం క్రెమ్లిన్ ఖండించింది. ఇరాన్‌కు రష్యా వ్యూహాత్మక మద్దతు ఇస్తోందని యుద్ధం ప్రారంభంలో పలు మీడియాల్లో వార్తలు వచ్చాయి. మాస్కో సాయంతోనే అమెరికా యుద్ధ విమానాలు, యుద్ధ నౌకలు, సైనిక స్థావరాలపై ఇరాన్ లక్షిత దాడులు చేయగలుగుతుందనేది అవి పేర్కొన్నాయి. ఇప్పుడు జెలెన్స్కీ కూడా ఇదే విషయాన్ని వెల్లడించారు. అయితే, దీనిపై రష్యా, ఇరాన్ అధికారులు ఇంతవరకు స్పందించలేదు. ఇక, ప్రస్తుత ఉద్రిక్త పరిస్థితులపై రష్యా విదేశాంగ మంత్రి లావ్రోవ్, ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చి చర్చలు జరిపారు. ఈ సందర్భంగా ఇరాన్‌లోని బుషెహర్ అణుకేంద్రంతో సహా ఆ దేశ మౌలిక సదుపాయాలపై అమెరికా-ఇజ్రాయెల్ దాడులు ఆమోదయోగ్యం కావని లావ్రోవ్ అన్నారు.

దేశంలో తొలి కారుణ్య మరణం

## హరీష్ తుదిశ్వాస



**న్యూఢిల్లీ, మార్చి 24 (వుదయం) :**
భారతదేశంలో కారుణ్య మరణానికి అనుమతి పొందిన తొలి వ్యక్తి అయిన హరీష్ రాణా మంగళవారం ఢిల్లీ ఎయిమ్స్ లో తుది శ్వాస విడిచినట్టు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. ప్రమాదవశాత్తు గాయపడి 13 ఏళ్ల పాటు కోమాలో ఉన్న అతడికి సుప్రీం కోర్టు కారుణ్య మరణాన్ని అనుమతించడంతో ఎయిమ్స్ వైద్యులు వైద్యం నిలిపివేశారు. పంజాబ్ యూనివర్సిటీలో బిటెక్ విద్యార్థి అయిన హరీష్ 2013లో నాలుగవ అంతస్తు నుంచి పడిపోవడంతో తలకు తీవ్రమైన దెబ్బలు తగిలాయి. అప్పటి నుంచీ అతడు కోమాలో ఉన్నాడు. ప్రముఖ ఆసుపత్రుల్లో చికిత్స అందించినా, అతని ఆరోగ్యంలో ఎలాంటి పురోగతి కనిపించలేదు. అప్పటినుంచి అతడు కోమాలోనే ఉండిపోయాడు. కుమారుడి చికిత్స కోసం ఆర్థికంగా, మానసికంగా చితికిపోయిన ఆ తల్లిదండ్రులు అతడి కారుణ్య మరణానికి అనుమతించాలంటూ అత్యున్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. వైద్య నివేదికలు పరిశీలించిన అనంతరం రాణాకు చికిత్స నిలిపివేయొచ్చని న్యాయస్థానం తీర్పు ఇచ్చింది. సర్వోన్నత న్యాయస్థానం ఈ తరహా తీర్పు వెలువరించడం ఇదే మొట్టమొదటిసారి. ఈ తీర్పు అనంతరం మార్చి 14న రాణాను గాజియాబాద్‌లోని ఇంటి నుంచి ఢిల్లీలోని ఎయిమ్స్‌కు తరలించారు. అప్పటి నుంచి అందిస్తోన్న చికిత్సను దశలవారీగా తగ్గించారు. ఈ క్రమంలోనే అతడు తుదిశ్వాస విడిచాడు. కృత్రిమ ప్రాణ రక్షణను తొలగించడం వల్ల తమ కుటుంబానికి వ్యక్తిగతంగా ఎలాంటి ప్రయోజనం చేకూరదని, అయితే విస్తృత ప్రజా ప్రయోజనాల దృష్ట్యా, ఇలాంటి పరిస్థితులను ఎదుర్కొంటున్న ఇతరులకు ఈ నిర్ణయం సహాయపడగలదని సుప్రీం కోర్టు తీర్పు తర్వాత హరీష్ కుటుంబం పేర్కొంది. సంవత్సరాల తరబడి కోలుకోలేని బాధ తర్వాత, కారుణ్య మరణం హరీష్ గౌరవాన్ని పునరుద్ధరిస్తుందని అతని తండ్రి అన్నారు. సుప్రీం కోర్టు తీర్పును వైద్య నిపుణులు ఆహ్వానించారు. ఒక ప్రత్యేక ప్రణాళికతో లైఫ్ సపోర్ట్‌ను ఉపసంహరించుకోవాలని ఎయిమ్స్‌ఢిల్లీని సుప్రీంకోర్టు ఆదేశించింది. భారతదేశంలోనే తొలిసారిగా ఈ ప్రక్రియను అమలు చేయడానికి, అనస్థీషియా, పాలియేటివ్ మెడిసిన్ విభాగాధిపతి, ప్రొఫెసర్ అయిన డాక్టర్ సీమా మిశ్రా నేతృత్వంలో ఒక ప్రత్యేక వైద్య బృందాన్ని ఏర్పాటు చేశారు.

## ప్రధానిపై రాహుల్ విమర్శలు



**న్యూఢిల్లీ, మార్చి 24 (వుదయం) :**
పశ్చిమాసియా సంక్షోభం నేపథ్యంలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ మంగళవారం ప్రధాని నరేంద్ర మోడీని లక్ష్యంగా చేసుకొని విమర్శల వర్షం కురిపించారు. భారత విదేశాంగ విధానం ఆయన వ్యక్తిగత విదేశాంగ విధానంగానూ, ఒక సార్వత్రిక హాస్యాస్పద విషయంగానూ మారిపోయిందని ఆరోపించారు. అమెరికా-ఇజ్రాయెల్, ఇరాన్‌ల మధ్య పాకిస్థాన్ ఒక మధ్యవర్తిగా వ్యవహరిస్తోందన్న వార్తలు, పశ్చిమ ఆసియా సంక్షోభంపై భారతదేశ వైఖరి గురించి ఆయనను ప్రశ్నించినప్పుడు, మన విదేశాంగ విధానమే ప్రధాని మోడీ వ్యక్తిగత విదేశాంగ విధానం. దీని ఫలితాన్ని మీరు చూడవచ్చు. ఇది ఒక సార్వత్రిక హాస్యాస్పద విషయంగా మారింది. ప్రతి ఒక్కరూ దీనిని ఒక సార్వత్రిక జోక్‌గానే భావిస్తారు. మోడీ ఏమి చేయగలరో, ఏమి చేయలేరో డొనాల్డ్ ట్రంప్‌కు కచ్చితంగా తెలుసు. కాబట్టి, ప్రధాని రాజీపడితే, మన విదేశాంగ విధానం కూడా రాజీపడినట్లే అంటూ లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు స్పందించారు.

లోక్‌సభలో కోవిడ్ లాంటి సంక్షోభం అంటూ ప్రధాని హెచ్చరించిన ప్రసంగాన్ని ప్రస్తావిస్తూ, మహమ్మారి సమయంలో ఎంత మంది చనిపోయారో, జరిగిన విషాదాల తీవ్రతను ఆయన (మోడీ) మర్చిపోయారని రాహుల్ అన్నారు. ఇలాంటి విషయాలపై ప్రభుత్వానికి అవగాహన లేదని ఆయన ఆరోపించారు.

నిన్న (లోక్‌సభలో) ఆయన అప్రస్తుత ప్రసంగం చేశారు. ఆయన భారతదేశ ప్రధానమంత్రి; ఆయన ప్రవర్తన చూస్తే ఆయన నిజంగానే భారతదేశ ప్రధాని అనిపించాలి. కానీ ఆయనలో ఆ స్థాయి, హోదా ఏమాత్రం కనిపించడం లేదు. ప్రజలు ఇబ్బందులకు గురికావడం విచారకరం; ఇది ఇప్పుడే మొదలైంది. ఎల్.పి.జి., పెట్రోల్, ఎరువులు——ఇలా ప్రతి విషయానికి సంబంధించి మనం సమస్యలను ఎదుర్కోక తప్పదు... పరిస్థితి మళ్ళీ కోవిడ్ సమయంలా మారుతుందని ఆయన చెబుతున్నారు, కానీ కోవిడ్ సమయంలో ఎంతమంది ప్రాణాలు కోల్పోయారో, ఎటువంటి విషాదాలు చోటుచేసుకున్నాయో ఆయన మర్చిపోయినట్లున్నారు, అని గాంధీ వ్యాఖ్యానించారు.

పశ్చిమాసియా అంశంపై బుధవారం జరగనున్న అఖిలపక్ష సమావేశంలో తాను పాల్గొనలేనని, కేరళలో తాను హాజరుకావాల్సిన ఒక కార్యక్రమం ఉన్నందున ఇది సాధ్యపడదని రాహుల్ తెలిపారు. భారతదేశ ప్రయోజనాలకంటే, అమెరికా, ఇజ్రాయెల్ ఆదేశాల మేరకే ప్రభుత్వం వ్యవహరిస్తోందని ఆయన ఆరోపించారు.

అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేశారు, అక్కడ చర్చ జరగాలి. కానీ మీరు ఒక వ్యవస్థాగత తప్పిదం చేశారు. మీరు ఆ వ్యవస్థాగత చట్రం మొత్తాన్ని పూర్తిగా ధ్వంసం చేశారు. ఇకపై దీనిని సరిదిద్దడం సాధ్యం కాదు, ప్రధాని మోడీ దీనిని సాధించలేరని నేను మీకు లిఖితపూర్వకంగా ఇవ్వగలను, అని గాంధీ అన్నారు.

ప్రధాని మోడీ అమెరికా, ఇజ్రాయెల్ చెప్పిందే చేస్తారు. ఆయన భారతదేశ ప్రయోజనాల కోసం గానీ, రైతుల ప్రయోజనాల కోసం గానీ పనిచేయరు; దానికి బదులుగా, అమెరికా, ఇజ్రాయెల్ చెప్పిన ప్రకారమే వ్యవహరిస్తారు, అని ఆయన అన్నారు.

సోమవారం అంతకుముందు లోక్‌సభలో ప్రసంగిస్తూ, మోడీ పశ్చిమాసియా సంఘర్షణను ఆందోళనకరమైనదిగా అభివర్ణించారు. ఇది భారతదేశానికి ఆర్థిక, జాతీయ భద్రతకు సంబంధించినవే కాకుండా మానవతాపరమైన సవాళ్లను సృష్టించిందని ఆయన అన్నారు. ఈ సంక్షోభంపై భారత పార్లమెంటు నుంచి ప్రపంచానికి ఒక ఏకగ్రీవ స్వరం వినిపించాలని ఆయన అన్నారు.

మంగళవారం రాజ్యసభలో ప్రసంగిస్తూ, పశ్చిమ ఆసియా సంక్షోభం ఎక్కువకాలం కొనసాగితే తీవ్ర పరిణామాలు తప్పవని ప్రధానమంత్రి హెచ్చరించారు.

## లారిజానీ స్థానంలో జోల్కాద్ర్

### ఇరాన్ భద్రతామండలి నూతన అధిపతి





**వుదయం డెస్క్, మార్చి 24 :**
గత వారం జరిగిన ఒక దాడిలో ఇరాన్ అత్యున్నత భద్రతా నిర్ణయాధికార సంస్థ అయిన సుప్రీం నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ (ఎస్ ఎన్ ఎస్‌సి) అధిపతిగా ఉన్న అలీ లారిజాని మరణించిన నేపథ్యంలో, ఆయన స్థానంలో కొత్త కార్యదర్శిగా మహమ్మద్ బాకర్ జోల్కాద్ర్ నియమితులయ్యారు.

దేశ భద్రతా వ్యవస్థకు కీలకమైన సమయంలో వేగవంతమైన నాయకత్వ మార్పును ధృవీకరిస్తూ, ఇరాన్ అధ్యక్షుడి కమ్యూనికేషన్ల డిప్యూటీ మంగళవారంఎక్స్‌పై ఒక పోస్ట్ ద్వారా ఈ ప్రకటన చేశారు.

ప్రాంతంలో ఉద్రిక్తతలను మరింత పెంచిన ఒక దాడిలో ప్రముఖ సంప్రదాయవాద రాజకీయ నాయకుడు, మాజీ పార్లమెంట్ స్పీకర్ అయిన అలీ లారిజానీ మరణించారు. ఆయన మరణం ఇరాన్ నాయకత్వానికి తీరని లోటు, ఇది వేగవంతమైన చర్యలకు దారితీసింది.

ప్రత్యక్ష సైనిక చర్యకు అతీతంగా, దాని పర్యవసానాలు మరింత స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఇంధన మార్కెట్లు అస్థిరంగా ఉన్నాయి, ప్రపంచ చమురు ధరలు హెచ్చుతగ్గులకు లోనవుతున్నాయి, హొర్ముజ్ జలసంధి వంటి కీలక మార్గాల ద్వారా అంతరాయం కలుగుతుందనే భయాలు ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక నిర్ణయాలను ప్రభావితం చేస్తూనే ఉన్నాయి. అదే సమయంలో, భద్రతా కూటములు పరీక్షకు గురవుతున్నాయి. ప్రాంతీయ దేశాలు తమ రక్షణ చర్యలను ముమ్మరం చేస్తుండగా, పరిస్థితి మరింత తీవ్రమయ్యే సంకేతాల కోసం ప్రపంచ దేశాలు నిశితంగా గమనిస్తున్నాయి. మానవతాపరమైన ఆందోళనలు కూడా తీవ్రమవుతున్నాయి. సంఘర్షణ ప్రభావిత ప్రాంతాలలో, ముఖ్యంగా లెబనాన్, ఇరాన్‌లోని కొన్ని భాగాలలో, పెద్ద ఎత్తున ప్రజలు నిరాశ్రయులవ్వడం అనేది ఇప్పటికే ఒత్తిడికి గురైన వ్యవస్థలపై అదనపు భారాన్ని మోపుతోంది. విద్యుత్ నెట్‌వర్క్‌లు, పట్టణ ప్రాంతాలతో సహా మౌలిక సదుపాయాలపై దాడులు పౌర జీవితాన్ని మరింత ప్రత్యక్షంగా ప్రభావితం చేయడం ప్రారంభించాయి.

కశ్మీరీ వేర్పాటువాది

## ఆసియా అంద్రబీకి యావజ్జీవం



**న్యూఢిల్లీ, మార్చి 24 (వుదయం) :**
ఉగ్రవాద కార్యకలాపాలకు పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న కాశ్మీరీ వేర్పాటువాది ఆసియా అంద్రబీకి, చట్టవిరుద్ధ కార్యకలాపాల నిరోధక చట్టం (యుఎపిఎ) కింద ఢిల్లీలోని ఒక కోర్టు యావజ్జీవ కారాగార శిక్ష విధించింది. దుఖతరన్‌ఎమిల్లత్ అధిపతి అయిన ఆమెపై దేశానికి వ్యతిరేకంగా యుద్ధం చేయడం, కుట్ర పన్నడం వంటి అభియోగాలు మోపారు.

**ఉగ్రవాద కార్యకలాపాలకు పాల్పడినట్టు నిర్ధారించిన కోర్టు**

ఆమె సహచరులైన సోఫీ ఫెహ్మీదా, నహిదా నస్రీన్‌లకు చెరో 30 ఏళ్ల జైలు శిక్ష విధించింది. అంతకుముందు, దుఖతరన్‌ఎమిల్లత్ కు సంబంధించిన కార్యకలాపాలలో పాల్గొన్నందుకు ఈ ముగ్గురినీ దోషులుగా నిర్ధారించారు. ఇది భారతదేశం నుండి జమ్మూ కాశ్మీర్‌ను వేరు చేయాలని కోరిన ఒక నిషేధిత సంస్థ. కుట్రకు సంబంధించిన సెక్షన్ 18, ఉగ్రవాద సంస్థలో సభ్యత్వానికి సంబంధించిన సెక్షన్ 38తో సహా పలు యుఎపిఎ నిబంధనల కింద కోర్టు వారిని దోషులుగా నిర్ధారించింది. అలాగే, నేరపూరిత కుట్ర, దేశానికి వ్యతిరేకంగా యుద్ధం చేయడం వంటి భారత శిక్షా స్మృతి (ఐపిసి) నిబంధనల కింద కూడా కోర్టు వారిని దోషులుగా నిర్ధారించింది.

### ఏమిటీ దుఖతరన్-ఎ-మిల్లత్?

దుఖతరన్‌ఎమిల్లత్ అనేది పూర్తిగా మహిళా సంస్థ. ఇది కాశ్మీర్‌లో ఇస్లామిక్ చట్టాన్ని స్థాపించడానికి, భారతదేశం నుండి జమ్మూ, కాశ్మీర్‌ను విడదీసి, పాకిస్తాన్‌లో విలీనం కావడానికి జిహాద్‌ను సమర్థించింది. ఇది హిజ్బుల్ ముజాహిదీన్ అనే జిహాదీ ఉగ్రవాద సంస్థకు చెందిన ఒక అనుబంధ సంస్థ. 1987లో ఏర్పడిన ఈ సంస్థకు ఆసియా అంద్రాబీ నాయకత్వం వహించారు. 1990ల ప్రారంభంలో కాశ్మీర్ ఉగ్రవాదం సమయంలో, ఈ సంస్థ ముఖానికి ముసుగు, బురఖా ధరించని మహిళలను బెదిరించింది, వారిలో కొందరు యాసిడ్ దాడులకు గురయ్యారు. ఈ బృందం ప్రధానంగా ఇంటర్నెట్ వేదికల ద్వారా ప్రచారం చేసింది. నివేదికల ప్రకారం నేరుగా ఆయుధాలు చేపట్టలేదు. 2018లో, ఆసియా ఆంద్రాబి, ఆమె కార్యదర్శిని ఉగ్రవాద కార్యకలాపాలను ప్రోత్సహిస్తున్నారనే ఆరోపణలపై ఎన్‌ఐఏ అరెస్టు చేసింది. ఆమె అరెస్టుతో ఆ బృందం నిష్క్రియమైంది. ఇక ఇప్పుడు దాన్ని రద్దైనదానిగా పరిగణిస్తారు.

## యుద్ధంలోకి సౌదీ, యూఏఈ?



**న్యూఢిల్లీ, మార్చి 24 (వుదయం) :**
ఇరాన్ విద్యుత్ కేంద్రాలపై దాడులను వాయిదా వేస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటన వేళ వాల్‌స్ట్రీట్ జర్నల్ ప్రచురించిన కథనం సంచలనంగా మారింది. టెహ్రాన్‌పై అగ్రరాజ్యం సాగిస్తోన్న యుద్ధంలో సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ పాల్గొనేందుకు సిద్ధమైనట్లు ఆ కథనం పేర్కొంది. గతంలో తమ వైమానిక స్థావరాలను అమెరికా సైన్యం ఉపయోగించుకొనేందుకు అనుమతించని సౌదీ అరేబియా.. ప్రస్తుతం అందుకు అంగీకరించినట్లు ఆ కథనం తెలిపింది. మరోవైపు, యూఏఈ ఇరాన్‌కు చెందిన ఓ ఆసుపత్రిని, క్లబ్‌ను మూసివేసింది. ఈ పరిణామాలు చూస్తుంటే.. యుద్ధం విషయంలో అమెరికాకు సౌదీ, యూఏఈ ప్రత్యక్షంగా సాయం చేసే అవకాశాలు కన్పిస్తున్నట్లు తెలుస్తోంది.


ఇటీవల ఇరాన్ పైకి దూసుకెళ్లిన కొన్ని క్షిపణులు బహ్రెయిన్ నుంచే ప్రయోగించినట్లు వీడియోలు బయటికొచ్చాయి. పశ్చిమాసియాలో సుదీర్ఘంగా జరుగుతున్న దాడుల వల్ల తమ ఆర్థికవ్యవస్థలు దెబ్బతినే ప్రమాదం ఉందని గల్ఫ్ దేశాలు భావిస్తున్నాయి. దీనికితోడు హర్మూజ్ జలసంధిని ఇరాన్ నియంత్రించడంపైనా ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఈ క్రమంలోనే పర్షియన్ గల్ఫ్‌లోని అమెరికా మిత్ర దేశాలు.. యుద్ధంలో అగ్రరాజ్యానికి మద్దతు ఇవ్వాలని నిర్ణయించుకున్నట్లు సదరు కథనం పేర్కొంది. అయితే, ఈ వార్తలపై అమెరికా ఇంకా స్పందించలేదు.

## రూ.181 కోట్లు, మద్యం, డ్రగ్స్ స్వాధీనం

**వుదయం డెస్క్, మార్చి 24 :**
294 మంది సభ్యులున్న పశ్చిమ బెంగాల్ అసెంబ్లీకి ఎన్నికలు రెండు దశల్లో ఏప్రిల్ 23, ఏప్రిల్ 29 తేదీలలో జరగనున్నాయి. మే 4న ఓట్ల లెక్కింపు జరుగుతుంది. ఈ నేపథ్యంలో బెంగాల్‌లో ఎన్నికల నియమావళి అమల్లోకి వచ్చాయి. అప్పటి నుంచి డబ్బు, మద్యం, డ్రగ్స్, ఉచిత సామగ్రి సహా రూ.181 కోట్లకు పైగా విలువైన సొత్తును అధికారులు స్వాధీనం చేసుకున్నారు. మార్చి 15వ తేదీన ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన నాటి నుంచి మొత్తం 294 నియోజకవర్గాల పరిధిలో ఎంసీసీ (మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్) అమల్లోకి రావడం తెల్సిందే. అప్పట్నుంచి, విస్తృతంగా సోదాలు చేపట్టినట్లు చీఫ్ ఎలక్టోరల్ అధికారి (సీఈవో) కార్యాలయం తెలిపింది.

జిల్లాలవారీగా 3,58,986 కేసులు నమోదు చేయగా, మొత్తం 3,11,829 ప్రభుత్వ ఆస్తుల విధ్వంసాలను, 19,901 ప్రైవేట్ ఆస్తుల విధ్వంసాలను తొలగించినట్లు అధికారులు వెల్లడించారు. ఫిర్యాదులకు స్పందించడానికి, నగదు, ఇతర వస్తువుల అక్రమ రవాణాను తనిఖీ చేయడానికి 1,800కు పైగా ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్స్, 2,200కు పైగా స్టాటిక్ సర్వైలెన్స్ టీమ్స్ ను మోహరించినట్లు అధికారులు తెలిపారు.

## లెబనాన్‌పై దాడులు తీవ్రం



**వుదయం డెస్క్, మార్చి 24 :**
మధ్యప్రాచ్యంలో ఇరాన్ యుద్ధం అనేక ఫ్రంట్‌లలో తీవ్రతరమవుతోంది. కొనసాగుతున్న దాడులు, పెరుగుతున్న ప్రాణనష్టం, ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై పడుతున్న ప్రభావం వంటివన్నీ పరిస్థితిని అస్థిరంగా, అత్యంత అనిశ్చితంగా ఉంచుతున్నాయి. వాషింగ్టన్, టెహ్రాన్ నుండి వస్తున్న పరస్పర విరుద్ధమైన ప్రకటనలు గందరగోళాన్ని మరింత పెంచాయి. చర్చల అవకాశాలపై ఇరు పక్షాల నుంచి పూర్తిగా భిన్నమైన వాదనలను వినిపిస్తున్నాయి. అమెరికా దౌత్యపరమైన అవకాశాలకు సంకేతాలు ఇస్తుండగా, ఇరాన్ అటువంటి వాదనలను తోసిపుచ్చింది. ఇది ప్రస్తుత తరుణంలో నెలకొన్న తీవ్ర అపనమ్మకాన్ని మరింత బలపరుస్తోంది.

ఇలా ఉండగా, లెబనాన్‌పై ఇజ్రాయెల్ తన దాడులను కొనసాగిస్తోంది. దక్షిణ లెబనాన్ నుంచి లిటానీ నది వరకూ ఉన్న భద్రతా జోన్‌ను స్వాధీనం చేసుకుంటామని ఇజ్రాయెల్ ప్రతినబూనింది. ఇజ్రాయెల్ సైన్యం దక్షిణ లెబనాన్ నుంచి లిటానీ నది వరకు గల ప్రాంతాన్ని నియంత్రణలోకి తీసుకుంటుందంటూ ఇజ్రాయెల్ రక్షణ మంత్రి ఇజ్రాయెల్ కట్జ్ పేర్కొన్నారు. తన ఉత్తర సరిహద్దు వెంట ఇజ్రాయెలీ భద్రతా స్థితిలో గణనీయమైన ఉద్రిక్తత ఉంటుందని సంకేతాలు ఇచ్చారు.

ఒక సైనిక కమాండ్ సెంటర్‌ను సందర్శించిన సందర్భంగా కట్జ్ మాట్లాడుతూ, ఉగ్రవాదుల, ఆయుధాల రవాణా కోసం హిజ్బుల్లా ఉపయోగించిన లిటానీ నదిపై ఉన్న ఐదు వంతెనలన్నింటినీ పేల్చివేశాం. మిగిలిన వంతెనలు, లిటానీ వరకు ఉన్న భద్రతా మండలాన్ని ఐడిఎఫ్ (ఇజ్రాయెల్ సైన్యం) నియంత్రిస్తుంది అని పేర్కొన్నారు. ఇజ్రాయెల్ ఉత్తర ప్రాంత నివాసులకు భద్రతకు హామీ ఇచ్చే వరకు కొనసాగుతున్న మధ్యప్రాచ్య సంఘర్షణ కారణంగా నిరాశ్రయులైన లక్షలాది మంది దక్షిణ లెబనాన్ నివాసులు, లిటానీ నదికి దక్షిణంగా తిరిగి రారు అని ఆయన ఇంకా తెలిపారు.

**ఇరాన్ రాయబారి బహిష్కారం**

ఈ నేపథ్యంలోనే దౌత్య నిబంధనల ఉల్లంఘనను కారణంగా చూపుతూ, ఇరాన్ రాయబారిని లెబనాన్ బహిష్కరించింది . ఇరాన్ రాయబారి అక్రిడిటేషన్‌ను ఉపసంహరించుకుని, అతడిని అవాంఛనీయ వ్యక్తిగా ప్రకటించి, ఆదివారం లోగా దేశం విడిచి వెళ్ళిపోవాలని ఆదేశించినట్లు లెబనాన్ విదేశాంగ మంత్రిత్వ శాఖ తెలిపింది. స్థిరపడిన దౌత్య నియమాలను, పద్ధతులను టెహ్రాన్ ఉల్లంఘిస్తోందని బీరూట్ ఆరోపిస్తున్న నేపథ్యంలో, ఈ చర్య దౌత్యపరమైన ఉద్రిక్తతలు తీవ్రంగా పెరగడానికి సంకేతంగా ఉంది. ఇరు దేశాల మధ్య వివాదం తీవ్రతను నొక్కి చెబుతూ, మంత్రిత్వ శాఖ ఇరాన్‌లోని లెబనాన్ రాయబారిని సంప్రదింపుల కోసం పిలిపించింది.

**ఇస్ఫహాన్‌పై భారీ స్థాయిలో ఇజ్రాయెలీ దాడులు**

ఇరాన్‌లోని కేంద్ర నగరమైన ఇస్ఫహాన్‌తో సహా పలు ప్రాంతాల్లో, తాము భారీ ఎత్తున వైమానిక దాడులు నిర్వహించినట్లు ఇజ్రాయెల్ సైన్యం తెలిపింది. ఐడిఎఫ్ ఇస్ఫహాన్‌లో భారీ స్థాయి దాడులను పూర్తి చేసింది అని ఒక ప్రకటనలో పేర్కొంటూ, ఇరాన్‌లోని అనేక ప్రాంతాల్లో తాము విస్తృత స్థాయి దాడుల పరంపరను ప్రారంభించినట్లు జోడించింది.

## పర్షియన్ గల్ఫ్ లో సిద్ధంగా 6 ఎల్పీజీ ట్యాంకర్లు

**వుదయం డెస్క్, మార్చి 24 :**
పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తీవ్రస్థాయిలో ఉండటంతో.. ఎల్పీజీ కొరత రాకుండా చూసుకునేందుకు భారత్ తీవ్రంగా ప్రయత్నిస్తోంది. పర్షియన్ గల్ఫ్‌లో నిలిచిన మరికొన్ని ట్యాంకర్లను హర్మూజ్ జలసంధి దాటించేందుకు ఇరాన్ అధికారులతో కేంద్రం చర్చలు జరుపుతోంది. అవి ఓకే అయితే ఆరు ట్యాంకర్లు భారత్‌కు చేరుకుంటాయి. 3,00,000 టన్నుల ఎల్పీజీ అందుబాటులోకి వస్తుందని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి.

భారత్ నౌకలకు దీర్ఘకాలిక గ్యారెంటీ లేకపోవడంతో.. ఎప్పటికప్పుడు ఇరాన్‌తో చర్చల పైనే ఆధారపడాల్సిన పరిస్థితి నెలకొంది. అయితే అంతర్గత పరిస్థితుల దృష్ట్యా నౌకల అనుమతుల విషయంలో ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కోర్ (ఐఆర్‌జీసీ) నిర్ణయం తీసుకోవడం ఆలస్యమవుతోంది. ఇదిలా ఉంటే.. ఎల్పీజీని మోసుకొస్తోన్న జగ్ వాసంత్, పైన్ గ్యాస్ ట్యాంకర్లు హర్మూజ్‌ను దాటి, ఇప్పటికే అంతర్జాతీయ జలాల్లోకి ప్రవేశించాయని కేంద్ర ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. అవి కొన్నిరోజుల్లో భారత్‌కు చేరుకోనున్నాయి. కాగా, తమ అధికారులతో సమన్వయం చేసుకొంటూ తటస్థ దేశాల నౌకలు హర్మూజ్ మీదుగా వెళ్లొచ్చని ఇరానియన్ డిఫెన్స్ కౌన్సిల్ ప్రకటించిన సంగతి తెలిసిందే. ఇరాన్ అధికారులు సహకార వైఖరిని అవలంబిస్తున్నారని భారత ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. ఈ వ్యాఖ్యల నేపథ్యంలో హర్మూజ్ నుంచి నౌకల రాకపోకల విషయంలో కాస్త సానుకూలత కనిపిస్తోంది.








"* కాలుష్య కారక పరిశ్రమలను ఓఆర్ఆర్ అవతలి వైపునకు తరలించి, ఇక్కడి పారిశ్రామిక జోన్‌లో ఉన్న భూములను మల్టీయూజ్ జోన్‌లోకి మార్చుతున్నామే, తప్ప యాజమాన్యపు హక్కులు మారవు. మల్టీయూజ్ జోన్‌లోకి మార్చడం వల్ల మధ్య తరగతి నివాస ప్రాంతాలుగా మారుతాయి. పరిశ్రమలను తరలించడం ద్వారా నగరం కాలుష్య రహిత ప్రాంతంగా ఉంటుందన్నది మొట్టమొదటి ప్రణాళిక. 20 టీఎంసీ గోదావరి నీటిని తరలించి అందులో 17 టీఎంసీ జంటనగరాల తాగునీటి కోసం, మిగిలిన నీటిని మూసీలో నిరంతరం నీరు ప్రవహించేలా వినియోగిస్తాం. రాష్ట్ర భవిష్యత్ అభివృద్ధి కోసం సమగ్రమైన ఒక రోడ్ మ్యాప్‌ను తయారు చేసుకున్నాం. మూసీ నది ప్రక్షాళన ప్రాజెక్టును ఆపాలని కాకుండా ముందుకు తీసుకెళ్లడానికి సలహాలివ్వండి. మూసీ పరీవాహక ప్రాంతంలో నివసిస్తున్న వారిని ఎవరినీ నిరాశ్రయులను చేయం. వారికి మరిన్ని మెరుగైన వసతులతో పునరావాసం కల్పిస్తాం. ఏ ఒక్కరికీ నష్టం చేయం."

* శాసన మండలిలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

## వే'మన'పద్యం

మేడిపండు చూడ మేలిమై యుండును
పొట్టవిప్పి చూడ పురుగులుండు
పిరికివాని మదిని బింకమీలాగురా
విశ్వదాభిరామ! వినురవేమ



## సంపాదకీయం

# యుద్ధ విరామం

యుద్ధ పర్యవసానాలతో ప్రపంచం అతలా కుతలమైపోయి దేశదేశాల ఆర్థిక వ్యవస్థలు దెబ్బతినిపోతున్నాయి. ఈ దశలో అమెరికా అధ్యక్షుడు సోమవారం నాడు చేసిన ఒక ప్రకటన ఊరటనిస్తున్నది. ఇంతకుముందు తాము చెప్పినట్టు ఇరాన్ విద్యుత్ కేంద్రాలపై దాడులు చేయబోవడం లేదని ట్రంప్ ప్రకటించారు. ఐదు రోజులపాటు దాడులను ఆపుతున్నట్టు వెల్లడించారు.. ఇరాన్ తో చర్చలు ఫలప్రదమయ్యే దిశగా సాగుతున్నందున ఈ విరామాన్ని ప్రకటిస్తున్నట్టు ఆయన వివరించారు.అయితే ఇరాన్ ఈ విషయాన్ని ధ్రువపరచలేదు.అమెరికాతో తాము ఎటువంటి చర్చలు జరపడం లేదని అది ప్రకటించింది. తమ హెచ్చరికలకు భయపడి అమెరికాయే దిగివచ్చిందని, ట్రంప్ ఇలా చేయడం ఇది రెండోసారి అని ఇరాన్ తెలిపింది.ప్రస్తుతానికి అస్పష్టత, గందరగోళం ఉన్నప్పటికీ అమెరికా వ్యూహంలో మార్పు కనిపిస్తున్నది. ట్రంప్ యుద్ధ విరామ ప్రకటనతో అంతర్జాతీయ మార్కెట్లో క్రూడాయిల్ ధర తగ్గింది.ట్రంప్ ప్రకటన ఏకపక్షమైనదే అని ప్రస్తుతానికి అనుకోకతప్పడం లేదు. ఆ మేరకు యుద్ధవిరామాన్ని అమెరికా ఒక్కటే పాటించినా మేలే జరుగుతుంది.కాని ట్రంప్ ను నమ్మగలమా?ఈ యుద్ధం ప్రారంభంలోనూ ఇరాన్ తో చర్చలు జరుపుతూనే అర్ధంతరంగా దాని మీదకు దాడికి వెళ్లారు. ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీని కుటుంబంతో సహా హతమార్చారు. 165 మంది బడి బాలికలను బలి తీసుకున్నారు.ఇప్పుడు సైతం ట్రంప్ అటువంటి మోసకారి మార్గాన్నే ఎంచుకుని ఉంటాడా?విరామం మాటున మళ్లీ కూడగట్టుకొని తిరిగి దాడులకు సమకడతాడా ? విశ్వసనీయత కోల్పోయిన నాయకుల మాటలకు విలువ ఉండదు. అదేమైనప్పటికీ యుద్ధం నెల రోజులపాటు జరిగిన తర్వాత తామే ఖచ్చితమైన విజేతలమని చెప్పుకునే స్థితిలో రెండు పక్షాలు కూడా లేవు. ఇరాన్ ను సైనికంగా అణచివేసి దాని నోరు మూయించడం, అక్కడ మత ప్రభుత్వాన్ని కూలదోసి తమ కీలుబొమ్మ పాలనను నెలకొల్పి దాని వనరులను కాజేయడం తాము అనుకున్నంత సునా యాసం కాదని అమెరి కా, ఇజ్రాయెల్ లకు తెలిసి వచ్చి ఉండాలి.యుద్ధంలో ఇరానే ఎక్కువగా నష్టపోయింది. కాని అమెరికాను,ఇజ్రాయెల్ ను అదేమీ తక్కువ దెబ్బ తీయలేదు. అతి చౌకగా తయారు చేసిన శక్తిమంతమైన డ్రోన్ ల తో అమెరికా, ఇజ్రాయెల్ లను ఇరుగు, పొరుగు గల్ఫ్ దేశాలను గడగడలాడించింది.హోర్ముజ్ జలసంధిని ఇరాన్ అత్యంత ప్రభావవంతంగా వాడుకున్నది. గల్ఫ్లో గల అమెరికా స్థావరాలను లక్ష్యంగా చేసుకొని దాడులు జరపడం ఇరాన్ కు కలిసివచ్చింది.యుద్ధం కొనసాగడం ఇరాన్ కు లాభించింది. గల్ఫ్ దేశాలకు అమెరికా సమకూర్చిన ఆయుధ నిల్వలు అడుగంటిపోయాయి. అత్యంత ఖరీదైన ఆయుధాలు వృధా కావడం అమెరికా ఖజానాను దెబ్బతీసింది. యుద్ధానికి ఇతోధిక ఆర్థిక సాయాన్ని ట్రంప్ కోరవలసి వచ్చింది. యుద్ధ విరామం విషయంలో అమెరి కాతో ఇజ్రాయెల్ విభేధించినట్టు వార్తలు చెబుతున్నా యి. యుద్ధం కొనసాగించేలా అమెరికా పై ఒత్తిడి ఇస్తానని ఇజ్రాయెల్ ప్రకంచినట్టు వార్తలు చెబుతున్నాయి. సముద్రంలో గల ఇరాన్ నౌకల్లోని చమురుపై ట్రంప్ ఆంక్షలు తొలగించినప్పుడే ఆయన యుద్ధ విరమణవైపు అడుగులు వేస్తున్నట్టు సూచనలు వెలువడ్డాయి. ఇప్పటికైతే స్పష్టత కొరవడినప్పటికీ త్వరలోనే యుద్ధం ముగింపుకి రాగలదనే ఆశలు కలుగుతున్నాయి. ఇజ్రాయెల్ మాట విని ఎంతటి అపరాధానికి పాల్పడ్డాడో ట్రంప్ తెలుసుకుంటే మంచిది.

## రచనలు పంపండి

వుదయం సాహిత్య పేజీ 'ఉష' కు సాహిత్య వ్యాసాలు, కవితలు, విమర్శలు పంపించాలని రచయితలకు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేస్తున్నాం. అలాగే సంపాదకీయం పుటకు రాజకీయ ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక తదితర రంగాలపై వ్యాసాలను, సంపాదక లేఖలను పంపించవలసిందిగా కోరుతున్నాం. వాటిని ఈ కింది ఈమెయిల్ కు పంపించాలని మనవి.

voodayam2007@gmail.com
website : www.voodayam.com
Editor : 9247698676
1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020

# భగత్ సింగ్ ఆలోచన స్వేచ్ఛ

ఆయన పేరు పలికితేనే రోమాలు నిక్కబొడుస్తాయి... ఆ త్యాగగాథ తలచుకుంటే రక్తం రగిలిపోతుంది. తెల్లదొరల పాలనను అంతం చేయడానికి అగ్నిజ్వాలలా మారిన వ్యక్తి అతడు. "స్వాతంత్ర్యం నా జన్మహక్కు" అని నినదించిన వ్యక్తి అతడు. బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి ఎదిరించి నిలిచిన యోధుడు అతడు. భవిష్యత్కు బలమైన బీజం వేయాలని తపనతో పార్లమెంటుపై బాంబు విసిరిన విప్లవ వీరుడు అతడు. విప్లవం ద్వారానే విజయం సాధ్యమని నమ్మిన మహోన్నత ఘనుడు అతడు — ఆయనే భగత్ సింగ్. ఇది కేవలం ఓ వ్యక్తి కాదు; దేశ చైతన్యాన్ని మేల్కొలిపే

*భగత్ సింగ్ కలలుగన్నది కేవలం రాజకీయ స్వాతంత్ర్యం కాదు; లౌకికత, సమానత్వం, సోషలిజం ఆధారంగా సమసమాజ నిర్మాణం. సామ్రాజ్యవాదం, పెట్టుబడిదారీ వ్యవస్థ, భూస్వామ్య కట్టుబాట్లు, కుల–మత వివక్షలపై ఆయన పోరాటం నేటికీ స్ఫూర్తిదాయకం. ఆయన పేరు ప్రజల మనసుల్లో శాశ్వతంగా నిలిచి, అన్యాయానికి వ్యతిరేకంగా పోరాటాలకు ప్రేరణగా నిలుస్తోంది. నేటి పరిస్థితుల్లో సమాజం కొత్త సవాళ్లను ఎదుర్కొంటోంది. మతం, కులం పేరుతో విభజనలు పెరుగుతున్నాయి. మతోన్మాదాన్ని రెచ్చగొట్టే శక్తులు బలపడుతున్నాయి. విద్య, వైద్య రంగాలు పేదలకు అందని ద్రాక్షగా మారుతున్నాయి. నిరుద్యోగం పెరుగుతోంది. ప్రపంచ రాజకీయ పరిణామాలు, యుద్ధాలు సాధారణ ప్రజల జీవితాలను ప్రభావితం చేస్తున్నాయి.*

మహత్తర శక్తి, శాశ్వత స్ఫూర్తి. "నేను ప్రేమించినా.. పెళ్లాడినా అది నా మాతృభూమినే! నా ధ్యాస, నా శ్వాస, నా సర్వస్వం నా దేశం. ఈ గడ్డపై పుట్టినా,ఈ మట్టిలో కలిసిపోయినా అది నా దేశ విముక్తి కోసమే కావాలి."“నన్ను చంపగలరు, నా ఆశయాలను కాదు” అన్న ఆయన ఉక్కు నినాదం, ఉరికొయ్యపై చిరునవ్వుతో నిలిచిన అతని అపార ధైర్యం.. ఇవి చరిత్ర పుటల్లో నిలిచిన శాశ్వత జ్యోతులు. దేశం కోసం ప్రాణాలు అర్పించిన వారు ఎల్లకాలం జీవిస్తారనే సత్యానికి భగత్ సింగ్ చిరస్మరణీయ నిదర్శనం. "నన్ను మీరు చంపగలరేమో కానీ.. నా ఆశయాన్ని చంపలేరు. నా దేహం నుంచి చిందే ప్రతి రక్తపు చుక్క ఏరులై ప్రవహించి, ఈ దేశ మట్టిని తడపాలి. ఆ రక్తపు వాసన ప్రతి భారతీయుడిలో స్వదేశీ చైతన్యమై వికసించాలి. ఆ చైతన్యం తెల్లదొరల పాలనకు చరమగీతం పాడాలి. 1907 సెప్టెంబర్ 28న నేటి పాకిస్తాన్‌లోని లాయల్పూర్ జిల్లా బంగాలో కిషన్ సింగ్, విద్యావతి దంపతులకు భగత్ సింగ్ జన్మించాడు. చిన్ననాటి నుంచే దేశభక్తి అతని నరనరాల్లో నింపుకుంది. 12 ఏళ్ల వయసులోనే జలియన్‌వాలాబాగ్ దారుణాలను చూసి రగిలిపోయాడు. 14 ఏళ్లకే స్వాతంత్ర్యోద్యమంలో అడుగుపెట్టాడు. మహాత్మా గాంధీ పిలుపుతో సహాయ నిరాకరణ ఉద్యమంలో పాల్గొన్నప్పటికీ, ఆ ఉద్యమాన్ని నిలిపివేయడాన్ని సమర్థించలేదు. స్వాతంత్ర్యం యాచిస్తే రాదని, పోరాడితేనే సాధ్యమని గ్రహించాడు. కుటుంబ సభ్యులు పెళ్లి చేసేందుకు ప్రయత్నించగా, “నా జీవితాన్ని మాతృదేశ విముక్తి అనే ఉన్నతాశయానికి అంకితం చేశాను. కుటుంబ సుఖాల పట్ల నాకు మోజు లేదు” అంటూ తండ్రికి ఉత్తరం రాసి ఇంటిని విడిచాడు. అనంతరం నవజవాన్ భారత్ సభలో చేరి యువతను చైతన్యపరిచాడు. తర్వాత హిందుస్థాన్ సోషలిస్ట్ రిపబ్లికన్ అసోసియేషన్‌లో చేరి సుఖ్‌దేవ్, రాజ్‌గురులతో కలిసి విప్లవ కార్యకలాపాలను కొనసాగించాడు. నేను తుపాకి మొక్కలు నాటుతున్నాను నాన్నా! ఇవి పెరిగి పెద్దవై వేల తుపాకులుగా వికసించాలి. ఆ ఆయుధాలను నా దేశ ప్రజలకు పంచి, ఈ తెల్లదొరల గుండెల్లో నిద్రపోతా.



సమాజ నిర్మాణం కోసం పోరాడాలి. ప్రజా సమస్యలపై చైతన్యంతో నిలబడి ఉద్యమాలను బలోపేతం చేయాలి. భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ కలలు కన్న సమాజం కోసం పోరాడినప్పుడే వారికి నిజమైన నివాళి అర్పించిన వారమవుతాం. వారి త్యాగం చరిత్రలో మాత్రమే కాకుండా, మన ఆచరణలోనూ ప్రతిఫలించాలి. వ్యక్తులను చంపడం సులభం, కానీ గొప్ప ఆశయాలను చంపలేరు. సామ్రాజ్యాలు కుప్పకూలవచ్చు కానీ భావాలు అమరంగా మిగిలిపోతాయి. ఇది భగత్ సింగ్ వదిలిన సందేశం. ఆ సందేశాన్ని గుండెల్లో నింపుకుని నవ భారతాన్ని నిర్మిద్దాం. ప్రతి ఏటా జయంతి, వర్ధంతి... చిత్రపటాలకు పూలమాలలు... రెండు నినాదాలు... మౌనం...ఇదేనా భగత్ సింగ్ త్యాగానికి మనం ఇచ్చే ప్రతిఫలం? ఖచ్చితంగా కాదు! అన్యాయం రాజ్యమేలుతున్నప్పుడు మౌనం కాదు.. ప్రశ్నించడమే విప్లవం. విద్య, ఉపాధి, స్త్రీ స్వేచ్ఛ, కార్మిక హక్కుల కోసం పోరాటమే నిజమైన నివాళి. కులమత గోడలు కూలాలి... మతోన్మాదం చెదరాలి... సమాన సమాజం నిర్మించాలి. విగ్రహాలకు పూలమాలలు కాదు... ఆశయాలకు ఆచరణే గౌరవం.అదే భగత్ సింగ్‌కు మనం అర్పించే నిజమైన అక్షర నీరాజనం!



గడగోజు రవీంద్రాచారి
జర్నలిస్టు
9848772232

# ప్రియాంకకు అగ్నిపరీక్ష అస్సాం

ఎవ్వరూ ఊహించని విధంగా వ్యవహరిస్తూ ఉండటం, పార్టీ సీనియర్ నేతలకు సహితం అందుబాటులో ఉండకపోవడంతో లోక్ సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ పట్ల కాంగ్రెస్ పార్టీలో ఓ విధమైన అసంతృప్తి పెరుగుతుంది. కీలక సమయాలలో ఆయన కన్పించక పోవడం పట్ల అసహనం వ్యక్తం అవుతుంది. ఆయన 'అసమర్థత' కారణంగానే ప్రధాని నరేంద్ర మోదీ తిరుగులేని నాయకుడిగా దేశ రాజకీయాలపై ఆధిపత్యం వహిస్తున్నారని పలువురు బహిరంగంగానే వాఖ్యానాలు చేస్తున్నారు. ఈ సందర్భంగా అందరి దృష్టి ప్రియాంక గాంధీపై పడుతుంది. ఆమెను ప్రధాన మంత్రి అభ్యర్థిగా ప్రకటిస్తే భవిష్యత్ కాంగ్రెస్ పార్టీదే అన్నట్లు పలువురు బహిరంగంగానే వ్యాఖ్యలు చేస్తున్నారు. అయితే, ఇప్పటివరకు ఆమె తన రాజకీయ సామర్థ్యాన్ని ఎక్కడా నిరుపిందుకోలేక పోయారు. ఆమెకు పార్టీ అప్పచెప్పిన ఏ పనిలో కూడా విజయం సాధించలేకపోయారు. ఒక విధంగా 'సూట్ బూట్ కి సర్కార్', 'గబ్బర్ సింగ్ టాక్స్' వంటి పదజాలం నుండి తాజాగా అమెరికాకు ప్రధాని మోదీ లో లొంగిపోయారనే వరకు మోదీ ప్రభుత్వానికి నిత్యం 'గుదిబండ'గా మారారు. మరే ఇతర ప్రతిపక్ష నేత కూడా రాహుల్ గాంధీ మాదిరిగా రఫెల్ ఒప్పందం నుండి అమెరికాతో వాణిజ్య ఒప్పందం, చైనా సరిహద్దుల నుండి పాకిస్థాన్ తో కాల్పుల విరమణ వరకు ప్రభుత్వాన్ని ఆత్మరక్షణలో పడవేయలేదని చెప్పవచ్చు. తాజాగా అస్సాం అసెంబ్లీ ఎన్నికల ఇన్ ఛార్జ్ గా బాధ్యతలు చేపట్టిన ప్రియాంక గాంధీ ఏమిచేస్తారనే ఆసక్తి అందరిలో నెలకొంది. ఒక నెల వ్యవధిలోనే అస్సాం కాంగ్రెస్‌కు చెందిన ఇద్దరు సీనియర్ నాయకులు – లోక్‌సభ ఎంపీ ప్రద్యుత్ బోర్డోలోయ్, రాష్ట్ర పార్టీ మాజీ అధ్యక్షుడు భూపేన్ బోరా బీజేపీలో చేరడం, ఏప్రిల్‌లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల కోసం పార్టీ చేస్తున్న ప్రచారాన్ని దెబ్బతీయడమే కాకుండా, ప్రియాంక గాంధీ వాద్రా నాయకత్వాన్ని సహితం సవాల్ చేస్తున్నది. ప్రద్యుత్ బోర్డోలోయ్ బీజేపీలో చేసిన మరుసటి రోజు ఆయన కుమారుడు ప్రతీక్, మార్గెరిటా నియోజకవర్గం నుండి తన అభ్యర్థిత్వాన్ని ఉపసంహరించుకుంటున్నట్లు కాంగ్రెస్ అధ్యక్షుడికి లేఖ రాశారు. బిజెపి ప్రకటించిన అభ్యర్థుల జాబితాలో ఆయన దిస్పూర్ అభ్యర్థి. అస్సాం కాంగ్రెస్ మాజీ ఉపాధ్యక్షుడు దివ్యజ్యోతి తాలూక్దార్ కూడా పార్టీకి రాజీనామా చేశారు. అస్సాంలో పార్టీ వ్యవహారాల్లో ప్రియాంక కీలక పాత్ర పోషిస్తున్నారు. ఎన్నికల కోసం అభ్యర్థుల ఎంపికను పర్యవేక్షిస్తున్నారు. గత ఏడాది మే నెలలో లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీకి అత్యంత సన్నిహితుడైన లోక్‌సభ ఎంపీ గౌరవ్ గోగోయ్‌ను అస్సాం ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా నియమించడం, అసెంబ్లీ ఎన్నికలలో ప్రియాంకకు కీలక పాత్ర కల్పించడం వంటి చర్యలను, దశాబ్ద కాలంగా అధికారంలో ఉన్న బీజేపీ నుండి రాష్ట్రాన్ని తిరిగి చేజిక్కించుకోవడానికి కాంగ్రెస్ తీవ్ర ప్రయత్నాలు చేస్తోందనడానికి సంకేతాలుగా చెప్పవచ్చు. అయితే, గోగోయ్ నియామకం కాంగ్రెస్ శ్రేణులలో అసంతృప్తికి కారణమవుతోంది. 2015లో పార్టీని వీడిన మాజీ కాంగ్రెస్ నాయకుడు, అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ ఈ ఫిరాయింపుల వెనుక సూత్రధారి అన్నది బహిరంగ రహస్యమే అయినప్పటికీ, రాష్ట్ర విభాగంలో కుళ్లు చాలా లోతుగా పాతుకుపోయిందని పార్టీ నాయకులు అంగీకరిస్తున్నారు. అభ్యర్థుల ఎంపిక, ప్రచార నిర్వహణ రెండింటిలోనూ గోగోయ్ 'ఏకపక్షంగా' వ్యవహరిస్తున్నారని చాలా మంది నాయకులు ఆరోపిస్తున్నారు. “అతను (గౌరవ్) ఎవరినీ నమ్మడు. ప్రతి ఒక్కరూ హిమంత ఏజెంట్లే అని భావిస్తున్నట్లు కనిపిస్తుంది. అభ్యర్థుల ఎంపిక కోసం సర్వేలు



నిర్వహించే బాధ్యతను పార్టీ (రాజకీయ వ్యూహకర్త) సునీల్ కనుగోలుకు అప్పగించినప్పటికీ, గౌరవ్ తన సొంత సర్వే కోసం మరో ఏజెన్సీని రంగంలోకి దించినట్లు మాకు తెలిసింది. అంతేకాక, అభ్యర్థుల ఎంపిక కోసం డబ్బు చేతులు మారిందనే నిరాధారమైన వదంతులు కూడా ఉన్నాయి,” అని ఒక ఏఐసీసీ నాయకుడు తెలిపారు."వేచి చూడండి, త్వరలోనే అసోం కాంగ్రెస్‌లో ఒక్క హిందూ నాయకుడు కూడా మిగలడు; ఎందుకంటే ఆ పార్టీ అనుసరిస్తున్న 'సంతుష్టీకరణ' విధానం పట్ల వారు విసిగిపోయారు. అంతేకాక ఈ విధానం అసోం జనాభా స్వరూపంపై చూపే ప్రభావం గురించి వారు ఆందోళన చెందుతున్నారు" అంటూ ముఖ్యమంత్రి శర్మ నేరుగా గాంధీ కుటుంబాన్నే సవాల్ చేసేవిధంగా మాట్లాడుతున్నారు. కాంగ్రెస్ నుండి జరిగిన ఉన్నత స్థాయి ఫిరాయింపులు, ఉత్తర ప్రదేశ్ వెలుపల మరో రాష్ట్రంలో ఎన్నికలను నిర్వహించడానికి ప్రియాంక చేసిన తొలి ప్రయత్నంపై నీలినీడలు కమ్మేలా చేశాయి. కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ (సిపిపి) చైర్‌పర్సన్ సోనియా గాంధీ, రాహుల్‌ల వెనుక సంవత్సరాల తరబడి నిశ్శబ్ద తెరవెనుక శక్తిగా పనిచేసిన తర్వాత, 2019 లోక్‌సభ ఎన్నికలకు తూర్పు ఉత్తరప్రదేశ్‌కు ఇన్‌చార్జి జనరల్ సెక్రటరీగా ఆమె ప్రత్యక్ష ఎన్నికల నిర్వహణలో చేసిన మొదటి ప్రయత్నం ఘోరంగా విఫలమైంది. యూపీలోని 80 స్థానాలకు గాను కాంగ్రెస్ కేవలం ఒక్క స్థానాన్ని మాత్రమే గెలుచుకోగలిగింది. అది కూడా రాయ్‌బరేలీలో సోనియా. అలాగే, తమ కుటుంబ కంచుకోట అయిన అమేథీలో రాహుల్ కూడా ఓడిపోయారు. మూడేళ్ల తర్వాత యూపీ అసెంబ్లీ ఎన్నికలలో పూర్తిస్థాయి ఎన్నికల నిర్వాహకురాలిగా, ప్రచారకర్తగా ప్రియాంక చేసిన మొదటి ప్రయత్నంలో కూడా విఫలమయ్యారు. “నేను అమ్మాయిని, పోరాడగలను” (లడ్కీ హూన్, లడ్ సక్తీ హూన్) అనే నినాదంతో మహిళా ప్రాధాన్య ప్రచారం చేసినప్పటికీ, రాష్ట్రంలోని 403 స్థానాలకు గాను పార్టీ కేవలం రెండింటిని మాత్రమే గెలుచుకోగలిగింది. ఇప్పుడు అస్సాంలో ఆమె ఒక పూర్తిస్థాయి సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నారు. బోర్డోలోయ్ విషయంలో జరగబోయేది స్పష్టంగా తెలిసినప్పటికీ, కాంగ్రెస్‌తో దశాబ్దాల అనుబంధం కారణంగా ఆయన పార్టీ మారరని ప్రియాంక, కాంగ్రెస్ పార్టీ ఆశించాయి. నాగావ్ నుంచి రెండుసార్లు ఎంపీగా ఎన్నికైన ఆయన, అస్సాంలో గతంలో తరుణ్ గోగోయ్ నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వాలలో మూడుసార్లు మంత్రిగా పని చేశారు. కానీ, పరిస్థితులు అంతకంటే చాలా క్లిష్టంగా ఉన్నాయని పార్టీ వర్గాలు తెలిపాయి. రెండు నెలల క్రితం అస్సాం కాంగ్రెస్ రాజకీయ వ్యవహారాల కమిటీ (పిఏసి) సమావేశంలో, గౌరవ్ గోగోయ్ ఖచ్చితంగా ముఖ్యమంత్రి అవుతారని, తాను, ఇతర సీనియర్ నాయకులు ఆయన కింద పనిచేయడానికి సిద్ధంగా ఉన్నామని బోర్డోలోయ్ చెప్పి ఏఐసీసీ, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులను ఆశ్చర్యపరిచారు. కానీ, గోగోయ్ పనితీరు పట్ల బోరా, బోర్డోలోయ్ ఇద్దరూ అసంతృప్తిగా ఉన్నారు. “బోర్డోలోయ్ ఏపీసీసీ అధ్యక్ష, ముఖ్యమంత్రి పదవుల రేసులో లేరని చెబుతున్నప్పటికీ, గోగోయ్‌ను వాస్తవంగా ముఖ్యమంత్రి అభ్యర్థిగా ప్రకటించాలన్న ఏఐసీసీ నిర్ణయం అసంతృప్తిని రేకెత్తించిందన్నది విస్మరించలేని వాస్తవం. తరుణ్ గోగోయ్‌కు 80 ఏళ్లు పైబడ్డాయి. గౌరవ్‌కు ఇంకా 40 ఏళ్లే. 50, 60 ఏళ్ల వయసులో ఉన్న నాయకుల తరం ఒకటి ఉంది, వారు నిరాశకు గురయ్యారు,” అని ఒక రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు పేర్కొన్నారు.

రాబోయే ఎన్నికల కోసం బోరా పార్టీ ప్రచార కమిటీకి అధిపతిగా, బోర్డోలోయ్ మేనిఫెస్టో ప్యానెల్‌కు నేతృత్వం వహించడం కాంగ్రెస్‌లో మరింత ఆందోళనను రేకెత్తించింది. “మేము మా మేనిఫెస్టోను ఏ ముఖంతో విడుదల చేస్తాం? మా ప్రచార కమిటీ అధిపతి బీజేపీలో చేరిన నెల రోజులకే, మా మేనిఫెస్టో కమిటీ చైర్మన్ స్వయంగా అవతలి పక్షంలోకి వెళ్లిపోయారు,” అని ఒక కాంగ్రెస్ నాయకుడు ఆందోళన వ్యక్తం చేశారు. బోర్డోలోయ్ నిష్క్రమణకు తక్షణ కారణం, ఆయన నాగావ్ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోకి వచ్చే లహరిఘాట్ స్థానంలో అభ్యర్థి ఎంపిక విషయంలో తలెత్తిన విషయమే. సిట్టింగ్ ఎమ్మెల్యే ఆసిఫ్ మహమ్మద్ నజర్‌ను మళ్లీ బరిలోకి దించడాన్ని ఆయన వ్యతిరేకించారు. ఏఐసీసీ అస్సాం వ్యవహారాల ఇన్‌చార్జ్ జితేంద్ర సింగ్‌కు రాసిన లేఖలో, అభ్యర్థుల ఎంపికకు సంబంధించి పార్టీ జరిపిన సంప్రదింపుల సమయంలో తాను “అవమానానికి గురయ్యానని” బోర్డోలోయ్ పేర్కొన్నారు. తనపై దాడి చేసినందుకు అరెస్టు అయిన ఒక వ్యక్తికి, నజర్ అనే నాయకుడు అండగా నిలుస్తున్నారన్న తన ఆందోళనలను పార్టీ సీరియస్‌గా తీసుకోలేదని కూడా ఆయన ఆరోపించారు. ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, 2022లో కాంగ్రెస్ అధ్యక్ష పదవి కోసం మల్లికార్జున ఖర్గేపై పోటీ చేసిన తన సహ లోక్‌సభ సభ్యుడు శశి థరూర్ అభ్యర్థిత్వానికి బోర్డోలోయ్ తన పూర్తి మద్దతును ప్రకటించారు. పార్టీలో విబేధాలు తలెత్తినప్పుడు సర్దుబాటు చేసే ప్రయత్నం చేయకుండా రాహుల్ గాంధీ తనకు సన్నిహితులైన వారిని వెనుకవేసుకు రావడం కారణంగా అనేకమంది ప్రముఖులను కోల్పోవాల్సి వచ్చింది. ప్రియాంక సహితం అందుకు భిన్నంగా వ్యవహరింపలేరని అస్సాంలోని పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి. ఈ ఎన్నికలలో ఆమె కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకు రాలేకపోయినా బిజెపి దూకుడును కట్టడి చేయలేని పక్షంలో రాజకీయంగా కాంగ్రెస్ పార్టీలో ఆమె ప్రాబల్యం మసకబారి అవకాశం ఉంది. చిరునవ్వులతో అందరితో మాట్లాడటం తప్ప రాజకీయంగా పార్టీని ముందుకు తీసుకు వెళ్లలేరనే అభిప్రాయం బలపడే అవకాశం ఉంది.



చలసాని నరేంద్ర
9849569050

# నీ విలువ నీకు తెలుసా?

మానవ జీవితం రంగుల మయం, విలువల సమాహారం. సమాజంలో ఒక వ్యక్తికి ఉండే హోదా, ఆస్తిపాస్తులు, అధికారం కంటే అత్యంత విలువైనది మరొకటి ఉంది. అదే స్వీయ గౌరవం లేదా ఆత్మగౌరవం . ఇది కేవలం ఒక పదం కాదు.మనిషి అంతరాత్మ పలికే ధైర్య వచనం. ఒక వ్యక్తి తన గురించి తాను ఏమనుకుంటున్నాడు? తన సామర్థ్యాల మీద తనకెంత నమ్మకం ఉంది? అనే అంశాలే అతని జీవిత గమనాన్ని నిర్దేశిస్తాయి. ఈ స్వీయ గౌరవం కోల్పోతే, ఆ వ్యక్తి ఒక దీపం లేని గదిలా చీకటిలో ఉండిపోతాడు. చాలామంది స్వీయ గౌరవాన్ని అహంకారం (Ego) తో పొరబడుతుంటారు. కానీ ఈ రెండింటికీ ఆకాశానికి, భూమికి ఉన్నంత తేడా ఉంది. అహంకారం అంటే నేనే అందరికంటే గొప్పవాడిని అనుకోవడం. స్వీయ గౌరవం అంటే నేను కూడా అందరిలాగే విలువైన వాడిని, నాకంటూ కొన్ని ప్రత్యేకతలు ఉన్నాయి అని నమ్మడం. ఇది పుట్టుకతోనే ఎవరికీ రాదు. ఒక శిశువు పెరుగుతున్న క్రమంలో, చుట్టూ ఉన్న పరిసరాలు, తల్లిదండ్రుల మాటలు, ఉపాధ్యాయుల ప్రోత్సాహం ద్వారా ఇది రూపుదిద్దుకుంటుంది. చిన్నప్పుడు ఒక చిన్న బొమ్మ గీసినప్పుడు చాలా బాగుంది అని మెచ్చుకుంటే, ఆ బిడ్డలో తనపై తనకి నమ్మకం పెరుగుతుంది. అదే నీకు చేతకాదు అని విమర్శిస్తే, అక్కడ ఆత్మగౌరవ క్షీణత మొదలవుతుంది.మనం నివసించే సమాజం ఒక్కోసారి చాలా కఠినంగా ఉంటుంది. వ్యక్తిలో ఆత్మగౌరవం తగ్గడానికి ప్రధానంగా ఈ అంశాలు కారణమవుతాయి,ఇంట్లో కానీ, ఆఫీసులో కానీ చేసే పనిని ఎప్పుడూ తక్కువ చేసి చూడటం వల్ల వ్యక్తి మానసికంగా కుంగిపోతాడు. వాడిని చూడు ఎంత బాగా చదువుతున్నాడో, నువ్వు ఎందుకు పనికిరావు అనే పోలికలు మనిషిలో ఉన్న సహజ సిద్ధమైన ప్రతిభను చంపేస్తాయి.ఒకసారి ఓడిపోగానే జీవితం అయిపోయిందనుకోవడం. ఆ ఓటమికి సమాజం ఇచ్చే వింత తీర్పులు వ్యక్తిని తనను తాను నిందించుకునేలా చేస్తాయి.బహిరంగంగా అందరి ముందు అవమానానికి గురైనప్పుడు, ఆ గాయం మనిషి మనసుపై చెరగని ముద్ర



వేస్తుంది.స్వీయ గౌరవం కోల్పోయిన వ్యక్తి నిరంతరం తనలో తాను ఒక యుద్ధం చేస్తూ ఉంటాడు. దీని ప్రభావం మానసిక ఆరోగ్యంపై తీవ్రంగా ఉంటుంది.నేను దేనికీ పనికిరాను అనే భావన మెదడులో పాతుకుపోయినప్పుడు అది డిప్రెషన్‌కు దారి తీస్తుంది. రేపటి గురించి భయం, నిరంతర ఆందోళన (Anxiety) వారిని వెంటాడుతుంటాయి.మనతో మనం మాట్లాడుకునే మాటలు చాలా శక్తివంతమైనవి. ఆత్మగౌరవం లేని వారు ఎప్పుడూ నావల్ల కాదు,నేను అదృష్టవంతుడిని కాను అని ప్రతికూలంగా మాట్లాడుకుంటారు. ఇది వారి చుట్టూ ఒక ప్రతికూల వలయాన్ని సృష్టిస్తుంది.మనిషి ఒంటరిగా బతకలేడు. కానీ స్వీయ గౌరవం లేకపోతే ఇతరులతో బంధాలను పంచుకోవడం ఒక భారంలా మారుతుంది.భార్యాభర్తల మధ్య గౌరవం సమానంగా ఉండాలి. ఒక భాగస్వామి తనను తాను తక్కువగా భావిస్తే, వారు ఎప్పుడూ ఎదుటివారి ఆమోదం (Validation) కోసం పాకులాడుతుంటారు. నన్ను ప్రేమిస్తున్నావా?,నేను బాగున్నానా? అని పదే పదే అడగడం వెనుక ఉన్నది ప్రేమ కాదు, అభద్రతా భావం. దీనివల్ల బంధంలో అసంతృప్తి పెరుగుతుంది. కొందరు తమ గౌరవాన్ని తాకట్టు పెట్టి కూడా వేధింపులను భరిస్తుంటారు, ఎందుకంటే వారికి నేను ఒంటరిగా బతకలేను లేదా నాకు ఇంతకంటే మంచి జీవితం దొరకదు అనే భయం ఉంటుంది.

నిజమైన స్నేహితుడు మనల్ని మనలాగే ప్రేమిస్తాడు. కానీ ఆత్మగౌరవం లేని వారు తప్పుడు స్నేహాల వలలో చిక్కుకుంటారు. తమను వాడుకునే వారిని కూడా స్నేహితులు అనుకుని పొరబడతారు. ఎవరైనా చిన్న జోక్ వేసినా, అది తనను ఉద్దేశించి చేసిన అవమానంగా భావించి కుంచించుకుపోతారు.నేటి పోటీ ప్రపంచంలో ఆత్మవిశ్వాసమే ఆయుధం. ఆత్మగౌరవం లేని ఉద్యోగి ఎంత ప్రతిభ ఉన్నా వెనుకబడిపోతాడు. ఈ ప్రాజెక్ట్ నేను చేయగలనా? ఒకవేళ ఫెయిల్ అయితే అందరూ నవ్వుతారు అనే భయంతో కొత్త బాధ్యతలను తీసుకోరు.పని పట్ల భయం వల్ల దానిని వాయిదా వేస్తుంటారు. ఇది వారి కెరీర్ గ్రాఫ్ పడిపోవడానికి కారణమవుతుంది.ఏదైనా విజయం సాధించినా, అది తన కష్టం వల్ల కాకుండా లక్ వల్ల వచ్చిందని నమ్ముతారు. దీనిని సైకాలజీలో ఇంపోస్టర్ సిండ్రోమ్ అంటారు.మనస్సు శరీరానికి ప్రతిబింబం. మనసులో ఒత్తిడి ఉంటే అది శరీరంపై రకరకాలుగా కనిపిస్తుంది. ఆలోచనల సుడిగుండంలో పడి రాత్రంతా నిద్ర పట్టకపోవడం.ఒత్తిడి వల్ల కొందరు అతిగా తింటారు (Binge eating), మరికొందరు అసలు తినరు. ఇది స్థూలకాయం లేదా నీరసానికి దారితీస్తుంది. మనసులో ఉన్న వెలితిని పూడ్చుకోవడానికి, బాధను మర్చిపోవడానికి మద్యం, ధూమపానం లేదా మాదక ద్రవ్యాలకు బానిసలయ్యే ప్రమాదం ఉంది. తన శరీరాన్ని తను గౌరవించుకోని వ్యక్తి, దాని ఆరోగ్యం గురించి పట్టించుకోడు.

స్వీయ గౌరవం లేని వ్యక్తులు సామాజికంగా ఒంటరి అయిపోతుంటారు. పదిమంది ఉన్న చోటికి వెళ్లడానికి వారు జంకుతారు. నేను మాట్లాడితే ఎవరైనా ఏమైనా అనుకుంటారేమో,నా బట్టలు బాగున్నాయా లేదా? అనే చిన్న చిన్న విషయాలే వారిని ఇబ్బంది పెడతాయి. ఈ ఒంటరితనం వారిని సమాజానికి దూరం చేసి, మరింత మానసిక కుంగుబాటుకు గురి చేస్తుంది.మనం మన పిల్లలకు ఇచ్చే అతిపెద్ద ఆస్తి డబ్బు కాదు, ఆత్మగౌరవం. తల్లిదండ్రులు తమను తాము తక్కువ చేసుకుని మాట్లాడుకుంటే, పిల్లలు కూడా అదే నేర్చుకుంటారు. పిల్లల చిన్న చిన్న విజయాలను అభినందించడం, వారు తప్పు చేసినప్పుడు మనిషిని కాకుండా ఆ తప్పును మాత్రమే విమర్శించడం నేర్చుకోవాలి. నువ్వు దేనికీ పనికిరావు అనే ఒక్క మాట ఆ బిడ్డ భవిష్యత్తును నాశనం చేయగలదు కోల్పోయిన ఆత్మగౌరవాన్ని తిరిగి సంపాదించుకోవడం అసాధ్యం కాదు. ఇది ఒక ప్రయాణం. మీలో ఉన్న ప్లస్ పాయింట్స్ ఏమిటో ఒక పేపర్ మీద రాయండి. మీరు ఇతరులకు చేసిన చిన్న సహాయం కూడా మీ గొప్పతనమే.మిమ్మల్ని తక్కువ చేసే హక్కు ఎవరికీ లేదు. అవసరమైనప్పుడు వద్దు లేదా లేదు అని చెప్పడం నేర్చుకోండి. ఇది ఆత్మగౌరవానికి మొదటి మెట్టు.ఒకేసారి హిమాలయాలు ఎక్కలేం. చిన్న చిన్న పనులు పూర్తి చేస్తూ, మిమ్మల్ని మీరు మెచ్చుకోండి. మిమ్మల్ని ఉత్సాహపరిచే వ్యక్తులతో స్నేహం చేయండి. విషపూరితమైన బంధాల (Toxic Relationships) నుండి బయటకు రండి. అవసరమైతే థెరపిస్ట్ లేదా కౌన్సిలర్ సహాయం తీసుకోండి. మనసు గాయపడినప్పుడు వైద్యం చేయించుకోవడం తప్పు కాదు.జీవితం ఒక అద్భుతమైన అవకాశం. ఇందులో ఆటుపోట్లు సహజం. కానీ, మనల్ని మనం గౌరవించుకోవడం మానేసిన రోజున, ప్రపంచం కూడా మనల్ని గౌరవించడం ఆపేస్తుంది. నన్ను నేను ప్రేమిస్తున్నాను, గౌరవిస్తున్నాను అని గట్టిగా చెప్పగలిగే ధైర్యం ప్రతి ఒక్కరిలో ఉండాలి. గుర్తుంచుకోండి, సూర్యుడు అందరికీ సమానంగా వెలుగునిస్తాడు. మీరు ఏ పరిస్థితుల్లో ఉన్నా, మీకంటూ ఒక ప్రత్యేకత ఉంది. ఆత్మగౌరవం అనేది మనం ఇతరుల నుండి ఆశించేది కాదు, మనకు మనం ఇచ్చుకునే బహుమతి. మీ విలువను గుర్తించండి, తలెత్తుకుని జీవించండి.



డా .సూర్యదేవర రామకృష్ణ
9490754169

# అత్యంత వైభవంగా నాగులమ్మ జాతర మహోత్సవం...

**- నాగులమ్మను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన జువ్వాడి కృష్ణారావు**



కోరుట్ల మార్చి 23 (వుదయం ప్రతినిధి) కోరుట్ల మండలం నాగుల పేట గ్రామంలో సోమవారం నిర్వహించిన నాగులమ్మ జాతర మహోత్సవంలో పాల్గొని నాగులమ్మ తల్లి ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ రాష్ట్ర నాయకులు జువ్వాడి కృష్ణారావు ఈ సందర్భంగా విచ్చేసిన జువ్వాడి కృష్ణారావు కు అర్చకులు బ్రహ్మన్నగారి శంకర్ శర్మ బ్రహ్మన్నగారి కిషన్ శర్మ లు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాన్ని అందజేశారు అనంతరం భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించి అన్న ప్రసాద వితరణ చేపట్టారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆ నాగులమ్మ తల్లి కృపాకటాక్షాలతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని వేడుకున్నట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో జువ్వాడి కృష్ణారావు తో పాటు కోరుట్ల మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు కొంతం రాజు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పెరుమాండ్ల సత్యనారాయణ కోరుట్ల నియోజకవర్గ యువజన కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు ఏలేటి మహిపాల్ నాయకులు మంతెన గంగనర్సయ్య నవీన్ రెడ్డి స్వామి వెంకటి జలీ వెంకటేష్ గౌడ్ శంకర్ గౌడ్ కాంగ్రెస్ పార్టీ వివిధ హోదాల నాయకులు కార్యకర్తలు భక్తులు మహిళలు యువకులు తదితరులు పాల్గొన్నారు.

# ౨౦ లక్షల నిధులతో మహిళా సంఘాల భవన నిర్మాణానికి శంకుస్థాపన...

**- ఎమ్మెల్యే డాక్టర్ యం సంజయ్ కుమార్**

జగిత్యాల మార్చి 23 (వుదయం ప్రతినిధి) జగిత్యాల అర్బన్ మండలం అంబారిపేట మోతె గ్రామాల్లో ఒక్కో మహిళా సంఘానికి 10 లక్షల రూపాయల చొప్పున రూరల్ మండలం తిమ్మాపూర్ లో 20 లక్షలతో రెండు పోరండ్ల గ్రామంలో 20 లక్షలతో రెండు సోమనపల్లి గ్రామంలో 10 లక్షలతో ఒకటి తాటిపల్లి గ్రామంలో 20 లక్షలతో రెండు మహిళా సంఘాల నూతన భవనాల నిర్మాణానికి శంకుస్థాపనలు చేసిన జగిత్యాల నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ యం సంజయ్ కుమార్ అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ జగిత్యాల పట్టణానికి రైల్వే స్టేషన్ కు అతి దగ్గరగా ఉన్న అంబారీపేట గ్రామ అటవీ ప్రాంతంలో అర్బన్ పార్క్ ఏర్పాటు చేయడం జరిగిందని పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చెందుతుందన్నారు కేంద్ర ప్రభుత్వం మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకం పేరు మార్చి కఠిన నిబంధనలు పెట్టడం వల్ల ఉపాధి హామీ కూలీలకు గ్రామాల అభివృద్ధికి ఆటంకంగా మారిందన్నారు రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు అండగా అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తుందన్నారు జగిత్యాల దగ్గరలో ఏటీసీ కేంద్రం ఏర్పాటు చేయడం ద్వారా వృత్తి విద్య కోర్సులో నైపుణ్యం సాధించడం ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు పేదల సొంతింటి కల సాకారం కోసం ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేసిందని జగిత్యాల నియోజకవర్గానికి 3500 ఇండ్లు మంజూరు అయ్యాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం పేదల పక్షపాతి రైతు పక్షపాతి ప్రభుత్వం అన్నారు ప్రజా పాలన ప్రజా ప్రభుత్వంలో అన్ని వర్గాలకు సమ న్యాయం జరుగుతుందన్నారు ముఖ్యమంత్రి తో కలిసి పని చేసి జగిత్యాల నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు రాజకీయాలు ఎన్నికల వరకే పరిమితం అని అభివృద్ధి నిరంతర ప్రక్రియ అన్నారు మహిళలకు మహిళా సంఘాల భవనాలతో పాటు 30 లక్షలతో గోదాం నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తాం మని అవసరమైనపుడు శుభ కార్యక్రమాలు నిర్వహించే విధంగా ఆరు కిటికీలతో ప్లాన్ రూపొందించడం



జరిగిందని జగిత్యాల మండలానికి 35 మహిళా సంఘ భవనాలు మంజూరు ఆనందదాయకం అన్నారు తెలంగాణ రాష్ట్రం జీఎస్టి రూపంలో కేంద్రానికి చెల్లించే పన్నుల్లో 41 శాతం రాష్ట్రానికి హక్కుగా రావాల్సిన వాటా మాత్రమే కేంద్రం నుండి మంజూరు చేస్తుందని తాటిపల్లి గ్రామంలో మహిళా సంఘాల అభ్యున్నతికి సోలార్ యూనిట్ మంజూరు చేయడం జరిగిందని తద్వారా మహిళలు ఆర్థికంగా బలోపేతం కావడానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు గత ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేస్తూనే నూతన సంక్షేమ పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో అమలు చేస్తుందన్నారు ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రమాదేవి ఎంపీఓ వాసవి సర్పంచులు గంగాధర్ మహేష్ నక్క హరీష్ చెవుల గంగన్న బొలిశెట్టి గంగారెడ్డి ఏఈ లు రాజమల్లయ్య విజయ్ ఆర్ఐ లు నరేందర్ భూమయ్య, నాయకులు దామోదర్ రావు ఎల్లారెడ్డి నక్కల రవీందర్ రెడ్డి బాల ముకుందం రౌతు గంగాధర్ సందీప్ రావు ములసపు మహేష్ ఉప సర్పంచులు వార్డు సభ్యులు మహిళ సంఘాల సభ్యులు అధికారులు ఏపిఎం తదితరులు పాల్గొన్నారు.

# కోరుట్ల మున్సిపల్ చైర్ పర్సన్ తిరుమల వసంత గంగాధర్‌లను సన్మానించిన యూత్ కాంగ్రెస్ నాయకులు



కోరుట్ల మార్చి 23 (వుదయం ప్రతినిధి) కోరుట్ల పట్టణ మున్సిపల్ చైర్ పర్సన్ గా జువ్వాడి సోదరుల ఆశీస్సులతో బాధ్యతలు చేపట్టిన తిరుమల వసంత గంగాధర్ లను కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా టీం యూత్ కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి పూలమాల వేసి శాలువాతో సన్మానించి స్వీట్లు పంపిణీ చేశారు కోరుట్ల పట్టణంలో కాంగ్రెస్ పార్టీకి మంచి మెజారిటీతో సీట్లు కట్టబెట్టిన కోరుట్ల పట్టణ ప్రజానీకానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు ప్రజా ప్రభుత్వం మద్దతుతో జువ్వాడి సోదరుల నాయకత్వంలో కోరుట్ల మున్సిపల్ చైర్మన్ నూతన పాలకవర్గం ఆధ్వర్యంలో కోరుట్ల పట్టణం అన్ని రంగాల్లో సర్వతో ముఖాభివృద్ధి చెందడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా ఇంచార్జి ఎడ్ల నవీన్ యూత్ కాంగ్రెస్ నాయకులు కోరుట్ల మండలం వెంకటాపూర్ గ్రామానికి చెందిన ముహమ్మద్ నసీర్ మెట్‌పల్లి మండల కాంగ్రెస్ సోషల్ మీడియా కో ఆర్డినేటర్ మిట్టపల్లి భూమేష్ మల్లాపూర్ మండల ఉప సర్పంచుల ఫోరం ప్రధాన కార్యదర్శి బానావత్ శ్రీనివాస్ నాయక్ శ్రీ వెంకటేశ్వర దేవాలయ డైరెక్టర్ చిలువేరి విజయ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజానేత కీ"శే" పులకుర్తి తిరుమల్ రెడ్డి చిత్రపటానికి ఘన నివాళులు అర్పించిన

**- మున్సిపాలిటీ చైర్మన్ సీఎం సురేష్**

**- వైస్ చైర్మన్ మాల నర్సింహులు**

అలంపూర్ మార్చి 23 (వుదయం ప్రతినిధి): అలంపూర్ నియోజకవర్గం అయిజ పట్టణ కేంద్రంలో జోల్లబ్బాయి కీర్తి షాపింగ్ మాల్ ఎదుట ఏర్పాటు చేసిన ప్రజా నేత, రాజకీయ గురువు కీర్తిశేషులు పులకుర్తి తిరుమల్ రెడ్డి 4వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి మున్సిపాలిటీ చైర్మన్ సి.ఎమ్.సురేష్, వైస్ చైర్మన్ మాల నర్సింలు ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ సీఎం సురేష్ మాట్లాడుతూ మా రాజకీయ గురువు కీర్తిశేషులు పులకుర్తి తిరుమల్ రెడ్డి భౌతికంగా మన మధ్య లేకపోయినా నేర్పిన విలువలు, ప్రజా సేవ నిరంతరం మా వెంటనే ఉంటాయని, ఆయన లేని లోటు



ఎప్పటికీ పూడ్చలేనిదని, ఆయన ఆశయాలను లక్ష్యాలను తూచ తప్పకుండా పాటిస్తూ ప్రజల కోసం పనిచేస్తామని, ఆయన ఆశయాలే మాకు ఆదర్శవంతమని, మా గురువు ఆశయాలను పాటించి ముందుకు తీసుకెళ్తామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు నరసింహారెడ్డి, మల్లికార్జున్ రెడ్డి, వేమారెడ్డి, నాగర్ దొడ్డి వెంకట రాములు, ఉండే కారి మల్లయ్య, భద్రయ్య, నాగన్న గౌడ్, జొల్లబ్బాయి, ప్రతాపరెడ్డి, పట్టణ అధ్యక్షుడు మధు మాస్టర్, జిల్లా కో- ఆర్డినేటర్ కురవపల్లయ్య, దేవర జయన్న, తూపత్రాల బుడ్డన్న, యోబు, అంజి, కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# బిజెపి నేత సురభి నవీన్ కుమార్ జన్మదిన వేడుకలు...



కోరుట్ల మార్చి 23 (వుదయం ప్రతినిధి) భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోరుట్ల నియోజకవర్గ నాయకులు సురభి నవీన్ కుమార్ జన్మదిన వేడుకలను కేక్ కట్ చేసి పట్టణ నడిబొడ్డున గల నాగేశ్వర స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేసిన భారతీయ జనతా పార్టీ వివిధ హోదాల నాయకులు కార్యకర్తలు ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ సురభి నవీన్ కుమార్ ఇలాంటి జన్మదిన వేడుకలను మరెన్నో జరుపుకోవాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు తెలిపారు ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ వివిధ హోదాల నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు...

**- బిజెపి బుగ్గారం మండల అధ్యక్షులు మెడవేణి శ్రీధర్**



జగిత్యాల మార్చి 23 (వుదయం ప్రతినిధి) రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న అవినీతి ప్రజా వ్యతిరేక విధానాలపై గళమెత్తే వారిని అక్రమ అరెస్టులతో అణచి వేయలేరని భారతీయ జనతా పార్టీ బుగ్గారం మండల అధ్యక్షులు మెడవేణి శ్రీధర్ మండిపడ్డారు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుల పిలుపు మేరకు చేపట్టిన అసెంబ్లీ ముట్టడి కార్యక్రమాన్ని భగ్నం చేసేందుకు ప్రభుత్వం పోలీసులను ప్రయోగించడం ప్రజాస్వామ్య విరుద్ధమని ఆయన విమర్శించారు సోమవారం ఉదయం మండల కమిటీ సభ్యులతో కలిసి అసెంబ్లీ ముట్టడికి బయలుదేరుతుండగా పోలీసులు వారిని అడ్డుకుని ముందస్తు అరెస్టు చేశారు ఈ సందర్భంగా మెడవేణి శ్రీధర్ మాట్లాడుతూ ప్రజా సమస్యలపై పోరాడుతున్న ప్రతిపక్ష నాయకులను అరెస్టులతో భయపెట్టాలని చూడటం సిగ్గుచేటన్నారు కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అవినీతిని అక్రమాలను ప్రజల ముందు ఎండగట్టే వరకు బీజేపీ విశ్రమించదన్నారు పోలీసు బలగాలతో ఉద్యమాలను ఆపాలని భావించడం ప్రభుత్వ అవివేకమేనని ఎద్దేవా చేశారు అరెస్టు చేసిన బిజెపి ఉపాధ్యక్షులు మందపల్లి శ్రీనివాస్ కప్పల నరేష్ కప్పల మల్లేష్ ఇలాసాగరం పోచరాజు పలువురు బిజెపి ముఖ్య కార్యకర్తలను పోలీస్ స్టేషన్ కు తరలించారు.

# మృతుల కుటుంబాలను పరామర్శించిన జువ్వాడి కృష్ణారావు



కోరుట్ల మార్చి 23 (వుదయం ప్రతినిధి) కోరుట్ల మండలం మాదాపూర్ గ్రామానికి చెందిన బొమ్మల మధు ఇటీవల గల్ఫ్ దేశం ఖతర్ లో మృతి చెందగా ఆయన మృతదేహం సోమవారం మాదాపూర్ గ్రామానికి విచ్చేసిన సందర్భంగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ రాష్ట్ర నాయకులు జువ్వాడి కృష్ణారావు మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి గల్ఫ్ ఎన్ఆర్ఐ పాలసీ ద్వారా మృతుని కుటుంబానికి అందాల్సిన ప్రభుత్వ సహాయాన్ని తక్షణం అందే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు ఈ మేరకు ఉన్నతాధికారులతో టెలిఫోన్ ద్వారా మాట్లాడారు అనంతరం ఇటీవల మరణించిన యూట్యూబర్ వైష్ణవి కుటుంబ సభ్యులను పరామర్శించారు ఇట్టి పరామర్శలో జువ్వాడి కృష్ణారావు తో పాటు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొంతం రాజం కోరుట్ల నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు ఏలేటి మహిపాల్ రెడ్డి స్థానిక మాజీ ఎంపీటీసీ సభ్యుడు చేపూరి కృష్ణారెడ్డి పడాల లచ్చన్న గణేష్ మాజీ సర్పంచ్ గడ్డం మల్లారెడ్డి ఇమ్మడి మహేష్ గంగ మల్లయ్య మల్లేశం మారంపల్లి భూమయ్య కాంగ్రెస్ పార్టీ వివిధ హోదాల నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# గ్రంథాలయ పన్ను బకాయిలను సకాలంలో చెల్లించాలి...

**- జిల్లా అదన కలెక్టర్ (లోకల్ బాడీ) బి రాజా గౌడ్**

జగిత్యాల మార్చి 23 (వుదయం ప్రతినిధి) జిల్లా అదనపు కలెక్టర్ (లోకల్ బాడీ) బి రాజా గౌడ్ అధ్యక్షతన జిల్లా కలెక్టరేట్లోని జిల్లా గ్రంథాలయ సంస్థ సమావేశం నిర్వహించారు ఇట్టి సమావేశానికి సంబంధిత జిల్లా అధికారులు గ్రంథాలయ సంస్థ అధికారులు మున్సిపల్ కమిషనర్లు హాజరయ్యారు అనంతరం అదనపు కలెక్టర్ (లోకల్ బాడీ) బి రాజా గౌడ్ మాట్లాడుతూ 2025-2026 సంవత్సరానికి సంబంధించి గ్రామపంచాయతీలు



మున్సిపాలిటీలలో నిబంధనల ప్రకారం చెల్లించవలసిన ఎనిమిది శాతం గ్రంథాలయ పన్ను బకాయిలను గ్రంథాలయ సంస్థకు సకాలంలో పూర్తిగా చెల్లించుటకు తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ అధికారులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు ఈ సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఏ సరిత జిల్లా స్థాయి అధికారులు మున్సిపల్ కమిషనర్లు జిల్లా గ్రంథాలయ సంస్థ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు...

**- భారతీయ జనతా పార్టీ కథలాపూర్ మండల అధ్యక్షులు మల్యాల మారుతి**




కోరుట్ల మార్చి 23 (వుదయం ప్రతినిధి) భారతీయ జనతా పార్టీ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో అసెంబ్లీ ముట్టడి కార్యక్రమాన్ని భగ్నం చేసేందుకు అసెంబ్లీ ముట్టడికి వెళ్లకుండా కథలాపూర్ మండల భారతీయ జనతా పార్టీ నాయకులను ముందస్తు అరెస్టు చేయడం సిగ్గుచేటని కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం గత అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన 6 గ్యారంటీలను వెంటనే అమలు చేయాలని లేని పక్షంలో భారతీయ జనతా పార్టీ ఈ ఉద్యమాన్ని ఉధృతం చేస్తుందని తెలియజేస్తున్నామన్నారు ప్రజా సమస్యలపై పోరాడుతున్న ప్రతిపక్ష నాయకులను అరెస్టులతో భయపెట్టాలని చూడడం సిగ్గుచేటు అన్నారు కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం చేపడుతున్న అవినీతి అక్రమాలను ప్రజల ముందుకు తీసుకెళ్లి ప్రజల సమస్యల పరిష్కారం అయ్యేంతవరకు భారతీయ జనతా పార్టీ విస్మరించబోతున్నారు పోలీసులు తో ఉద్యమాలను ఆపాలని చూడడం ప్రభుత్వ అవివేకానికి నిదర్శనం అన్నారు ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ కథలాపూర్ మండల అధ్యక్షులు మల్యాల మారుతి భారతీయ జనతా పార్టీ వివిధ హోదాల నాయకులు కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

# రైస్ బ్యాగ్ ఛాలెంజ్ పోస్టర్ ఆవిష్కరణ...



కోరుట్ల మార్చి 23 (వుదయం ప్రతినిధి) దేశం కోసం దేశా స్వాతంత్రం కోసం బలిదానం చేసిన భగత్ సింగ్ సుఖ్ దేవ్ రాజ్ గురు ప్రాణత్యాగానికి గుర్తుగా వారిని స్మరిస్తూ సోమవారం బలిదాన్ దివాస్ సందర్భంగా మన ప్రాంతంలోని ఎవరు ఆకలితో బాధపడకుండా ప్రతి ఒక్కరికి ప్రతి రోజు అన్నాన్ని (అన్నదానం) అందించాలనే ఉద్దేశ్యంతో మెట్పల్లి రెవెన్యూ డివిజన్ అధికారి నరసింహ రావు చేతుల మీదుగా రైస్ బ్యాగ్ ఛాలెంజ్ పోస్టర్ ను అమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు నిరుపేదలకు రోజు కూలీలకు హాస్పిటల్ కు వచ్చే పేషెంట్ లకు ప్రతి ఒక్కరికి ప్రతిరోజు అన్నదానాన్ని ఏర్పాటు చేసి ప్రతి ఒక్కరికి కడుపునిండా భోజనం పెట్టాలనే ఉద్దేశ్యంతో రైస్ బ్యాగ్ ఛాలెంజ్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు అమ్మా చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు పుల్ల శ్రీనివాస్ తెలిపారు ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు పుల్ల జగన్ బండారి శివ పొన్నం శ్రీనివాస్ పారిపెల్లి హరీష్ వేముల శివ ఉదయ్ కుమార్ తోట అజయ్ తదితరులు పాల్గొన్నారు.

# రామకృష్ణ కళాశాలలో భగత్ సింగ్ వర్ధంతి వేడుకలు...



కోరుట్ల మార్చి 23 (వుదయం ప్రతినిధి) మేరా యువ భారత్ నెహ్రూ యువ కేంద్రం జగిత్యాల జిల్లా శాఖ ఆధ్వర్యంలో భగత్ సింగ్ వర్ధంతి సాహితీ దివాస్ సందర్భంగా రామకృష్ణ డిగ్రీ పీజీ కళాశాలలో విద్యార్థులకు వ్యాస రచన పోటీలు ఉపన్యాస పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు ఈ కార్యక్రమంలో వక్తలు భగత్ సింగ్ చేసిన పోరాటాన్ని కొనియాడారు స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించి విద్యార్థులతో కలిసి స్వచ్ఛ భారత్ ర్యాలీ నిర్వహించారు ఈ కార్యక్రమంలో నెహ్రూ యువ కేంద్రం జగిత్యాల జిల్లా నిర్వహకులు భూమేష్ గణేష్ రామక్రిష్ణ డిగ్రీ కళాశాల డైరెక్టర్ హరిప్రియ అంజయ్య గౌడ్ వైస్ ప్రిన్సిపల్ రాజ్ కుమార్ అధ్యాపక బృందం విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# తుపత్రాల గ్రామంలో ముమ్మరంగా పారిశుధ్య పనులు



అలంపూర్ మార్చి 23 (వుదయం ప్రతినిధి): అలంపూర్ నియోజక వర్గం ఐజ మున్సిపాలిటీ చైర్మన్ సి.ఎమ్. సురేష్ ఆదేశానుసారం, 6వ వార్డు కౌన్సిలర్ మహేశ్వరి ఆధ్వర్యంలో నేడు తుపత్రాల గ్రామంలో పారిశుధ్య కార్యక్రమం నిర్వహించబడింది. 99 రోజుల ప్రణాళికలో బాగంగా గ్రామంలోని పురవీధుల్లో పేరుకుపోయిన ముళ్లపొదలను తొలగించి, డోజర్ సహాయంతో గుంతలను పూడ్చివేయడం జరిగింది. ప్రజలకు పారిశుధ్యం యొక్క ఆవశ్యకతను వివరిస్తూ, గ్రామాన్ని శుభ్రంగా ఉంచుకోవాలని కౌన్సిలర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కుమ్మరి సుంకన్న, కుమ్మరి సంటెన్న, కుర్వ శ్రీనివాసులు, వడ్డే వెంకటేష్, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

# చలివేంద్రం ఏర్పాటు



గద్వాల మార్చి 23 (వుదయం ప్రతినిధి): గద్వాల నియోజకవర్గంలోని కెటి దొడ్డి మండలం ప్రజల సౌకర్యార్థం స్థానిక తహసీల్దార్ కెటి దొడ్డి ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేయబడింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు ఎండాకాలంలో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యగా ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో, డిప్యూటీ తహసీల్దార్, ఎంఆర్ఓ కార్యాలయ సిబ్బంది, జీపీఓలు, మీ సేవా సిబ్బంది,

# జిల్లాలో మూడవరోజు ప్రశాంతంగా ముగిసిన పదవ తరగతి పరీక్షలు...

జగిత్యాల మార్చి 23 (వుదయం ప్రతినిధి) జగిత్యాల జిల్లాలో జరుగుతున్న పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు మార్చి 2026 లో భాగంగా తేదీ 23 3 2026 సోమవారం మూడవరోజు ఇంగ్లీష్ పేపర్ 68 పరీక్షా కేంద్రాలలో పరీక్షలు నిర్వహించగా మొత్తం 12689 మంది విద్యార్థులకు గాను 12677 మంది విద్యార్థులు హాజరయ్యారు 12 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు విద్యార్థుల హాజరు 99.91 శాతం నమోదయింది జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ రెండు పరీక్ష కేంద్రాలు జిల్లా అదన కలెక్టర్ రెవెన్యూ బిఎస్ లత 2 పరీక్షా కేంద్రాలు జిల్లా విద్యాశాఖ అధికారి ఆరు పరీక్షా కేంద్రాలను ప్రభుత్వ పరీక్షల జిల్లా సహాయక పరిశీలన అధికారి 3 పరీక్షా కేంద్రాలను ఫ్లైయింగ్ స్క్వాడ్స్ 42 కేంద్రాలను సందర్శించారు జిల్లాలో మొత్తంగా సోమవారం ఇంగ్లీష్ పేపర్ పరీక్ష ప్రశాంతంగా నిర్వహించడమైనది.

# ప్రజా సమస్యల పరిష్కారానికి తొలి ప్రాధాన్యం

**త్వరితగతిన పరిష్కరించాలని అధికారులకు జిల్లా కలెక్టర్ ఆదేశం**

**జనగాం, మార్చి 23 (వుదయం ప్రతినిధి) :**

ప్రజల నుండి అందే వినతులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, వారి సమస్యల పరిష్కారానికి అధికారులు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని జనగాం జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన 'ప్రజావాణి' కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని, జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి నేరుగా వినతులను స్వీకరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ఎంతో ఆశతో కలెక్టరేట్‌కు వస్తారని, వారి అర్జీలను క్షేత్రస్థాయిలో పరిశీలించి సాధ్యమైనంత త్వరగా పరిష్కారం చూపాలన్నారు. పరిష్కరించిన సమస్యల వివరాలను సదరు అర్జీదారులకు ఎప్పటికప్పుడు తెలియజేయాలని అధికారులను సూచించారు.

**ప్రజావాణిలో వెల్లువెత్తిన వినతులు**

నేటి కార్యక్రమంలో మొత్తం 207 వినతులు నమోదయ్యాయి. వీటిలో ప్రధానంగా రెవెన్యూ, పింఛన్లు మరియు ఇందిరమ్మ ఇళ్ల మంజూరుకు సంబంధించిన విన్నపాలు ఎక్కువగా ఉన్నాయి. కొడకండ్ల మండలానికి చెందిన బంగారు మల్లిఖార్జున్ తనకు ఇప్పటి వరకు ఎటువంటి ప్రభుత్వ పథకాలు అందలేదని, వృద్ధాప్య పింఛన్‌తో పాటు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కలెక్టర్‌కు విన్నవించుకున్నారు.వితంతు పింఛన్ మంజూరు కొరకు బచ్చన్నపేట గ్రామానికి చెందిన బేతి మాధవి, తన భర్త మరణించారని, నిరుపేదరాలైన తనకు జీవనాధారం కోసం వితంతు పింఛన్ మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బెన్ షాలోమ్, వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సెక్షన్ సూపరింటెండెంట్లు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు




# దరఖాస్తుల పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలి

**జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ**

**జయశంకర్ భూపాలపల్లి మార్చి 23:**

**(వుదయం జిల్లా ప్రతినిధి):**

ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తుల పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశించారు. సోమవారం ఐడిఓసి కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుండి మొత్తం 55 దరఖాస్తులు స్వీకరించినట్లు తెలిపారు. అందిన ప్రతి దరఖాస్తును సంబంధిత శాఖల అధికారులకు వెంటనే ఎండార్స్ చేసి, వాటిని ఆలస్యం చేయకుండా పరిష్కరించాలని స్పష్టం చేశారు.ప్రజావాణిలో అందిన అన్ని దరఖాస్తులు వచ్చే సోమవారం నిర్వహించనున్న ప్రజావాణి నాటికి పూర్తిగా పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం సుదూర ప్రాంతాల నుంచి కార్యాలయానికి వస్తున్నారని, వారి ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని అధికారులు ప్రాధాన్యతతో స్పందించాలని సూచించారు.దరఖాస్తుల పరిష్కారంలో ఎటువంటి పర్యవేక్షణ లోపం ఉన్నా కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా అటవీశాఖ అధికారి నవీన్ రెడ్డి, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, ఆర్డీఓ హరికృష్ణ, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి

**స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు**

**యాదాద్రి భువనగిరి / మార్చి**

**వుదయం జిల్లా ప్రతినిధి ):**

ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను పెండింగ్ లేకుండా సత్వరమే పరిష్కరించాలని స్థానిక సంస్థ ల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు అన్నారు. సోమవారం రోజు కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు, రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డి తో కలిసి వివిధ ప్రాంతాల ప్రజల నుండి వచ్చిన 52 అర్జీలను స్వీకరించారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సంబంధిత అధికారులు పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలన్నారు.

అందులో రెవిన్యూ శాఖ 39, డివిజనల్ పంచాయతీ 5 జిల్లా మేనేజర్ సివిల్ సప్లై, జిల్లా గ్రామీణ అభివృద్ధి, ఎంప్లాయిమెంట్, సివిల్ కోర్టు, లీగల్ సర్వీస్ అథారిటీ, జిల్లా మార్కెటింగ్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ యూనిట్ వన్,ఈ ఈ పంచాయతీ రాజ్ శాఖలకు ఒక్కొకటి చొప్పున వచ్చాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి జయమ్మ, జెడ్పీ సి.ఈ.ఓ శోభ రాణి, జిల్లా నాగిరెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి విష్ణువర్ధన్ రెడ్డి వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



# ప్రజల సమస్యల చట్టపర పరిష్కారానికి తక్షణ కృషి

**జిల్లా ఎస్పీ కె. నరసింహ**

**సూర్యాపేట మార్చి 23(వుదయం):**

సూర్యాపేట జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన పోలీస్ ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా జిల్లా ఎస్పీ కె. నరసింహ ఐపీఎస్ పిర్యాదుదారులతో ప్రత్యక్షంగా మాట్లాడారు. జిల్లా నలుమూలల నుండి వచ్చిన ప్రజల నుండి పలు ఫిర్యాదులు స్వీకరించారు.

ఈ సందర్భంగా ప్రజల సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులకు ఫోన్ ద్వారా తక్షణ ఆదేశాలు, సూచనలు ఇచ్చి సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు అవసరమైన దిశా నిర్దేశం చేశారు. ప్రజల సమస్యలపై చట్టపరమైన చర్యలు వేగంగా తీసుకుని బాధితులకు భరోసా కల్పించాలని అధికారులను ఆదేశించారు.ప్రజలకు ఎలాంటి సమస్యలు ఉన్నా పైరవీలు లేకుండా, మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా నేరుగా పోలీసులను సంప్రదించాలని సూచించారు. చట్టబద్ధమైన విధానంలోనే ప్రజలకు న్యాయం జరుగుతుందని, శాంతి భద్రతలను కాపాడుతూ ప్రజలకు మరింత చేరువగా ఉండడమే పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని జిల్లా ఎస్పీ తెలిపారు.



# రాజీయే రాజమార్గం : పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్

**ఈ నెల 28న జాతీయ మెగా లోక్ అదాలత్**

**వరంగల్ క్రైం, మార్చి 23 (వుదయం ప్రతినిధి) :**

చిన్న చిన్న తగాదాలతో కోర్టుల చుట్టూ తిరుగుతూ సమయాన్ని, డబ్బును వృథా చేసుకోవద్దని, రాజీ మార్గంలో సమస్యలను పరిష్కరించుకోవాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ పిలుపునిచ్చారు. ఈ నెల 28వ తేదీ (శనివారం) నిర్వహించనున్న జాతీయ మెగా లోక్ అదాలత్ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

రాజీ పడదగిన కేసులు ఇవే లోక్ అదాలత్ ద్వారా క్రిమినల్ కంపౌండబుల్, సివిల్ తగాదాలు. ఆస్తి పంపకాలు, కుటుంబ, వైవాహిక సమస్యలు.చెక్ బౌన్స్, బ్యాంకు రికవరీ, విద్యుత్ చౌర్యం కేసులు. లోక్ అదాలత్ ద్వారా బాధితులకు తక్కువ సమయంలోనే శాశ్వత పరిష్కారం లభిస్తుంది.పోలీసుల సహకారంతో రాజీ పడదగిన కేసులను గుర్తించి, ఇరువర్గాలకు కౌన్సిలింగ్ నిర్వహించాలని జిల్లా పోలీసు అధికారులను సీపీ ఆదేశించారు. కేసుల రాజీ కోసం ఆసక్తి ఉన్నవారు వెంటనే సంబంధిత పోలీస్ అధికారులను సంప్రదించి ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన సూచించారు.




# బాల్య వివాహం - సామాజిక నేరం

**– జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్**

**జిల్లా కలెక్టరేట్‌లో గోడపత్రికల ఆవిష్కరణ**

**హనుమకొండ, మార్చి 23**

**(వుదయం జిల్లా ప్రతినిధి) :**

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, వీటిని నిర్మూలించడం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ పిలుపునిచ్చారు. సోమవారం రోజున జిల్లా కలెక్టరేట్‌లో మహిళా, శిశు, దివ్యాంగుల మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన 'బాల్య వివాహాల నిరోధక చట్టం2006' గోడపత్రికలను ఆమె ఆవిష్కరించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక' 99 రోజుల కార్యాచరణలో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

బేటీ బచావో - బేటీ పఢావో: మిషన్ శక్తి జిల్లా మహిళా సాధికారత కేంద్రం ద్వారా బాలికల రక్షణ, విద్యపై అవగాహన కల్పించడమే లక్ష్యంగా ఈ పోస్టర్లను విడుదల చేశారు. బాల్య వివాహాల నిరోధక అధికారులుగా (CMPO) గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు ప్రభుత్వం బాధ్యతలను కేటాయించిందని కలెక్టర్ గుర్తుచేశారు."బాల్య వివాహాల వల్ల ఆడపిల్లల భవిష్యత్తు అంధకారమవుతుంది. క్షేత్రస్థాయిలో అధికారులు సమన్వయంతో పనిచేసి జిల్లాను బాల్య వివాహ రహిత జిల్లాగా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్, తెలిపారు.ఈ సందర్భంగా కలెక్టర్ చట్టం అమలులో భాగస్వాములయ్యే అధికారుల వివరాలను వెల్లడించారు.జిల్లా స్థాయి జిల్లా కలెక్టర్, డివిజన్ స్థాయి ఆర్‌డీఓ / సబ్ కలెక్టర్, ప్రాజెక్టు స్థాయి సీడీపీవో (CDPO), మండల స్థాయి తహశీల్దార్, సెక్టార్ స్థాయి ఐసీడీఎస్ సూపర్వైజర్, గ్రామ స్థాయి పంచాయతీ కార్యదర్శి ఉంటారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రవి, జిల్లా రెవెన్యూ అధికారి సత్యపాల్ రెడ్డి, డీఆర్‌డీఓ శ్రీను, పరకాల మరియు హనుమకొండ ఆర్‌డీఓలు డాక్టర్ కన్నం నారాయణ, రాథోడ్ రమేష్, డీఎంహెచ్వో డాక్టర్ అప్పయ్య, డీడబ్ల్యూఓ విశ్వజ, మిషన్ కోఆర్డినేటర్లు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.



# ఇంపాక్ట్ మోటివేషనల్ స్పీకర్ గా...చింత నరేందర్



**తుంగతుర్తి , వుదయం ప్రతినిధి,మార్చి 23:**

తుంగతుర్తి నియోజకవర్గం, శాలిగౌరారం మండల పరిధిలోని పెర్కకొండారం గ్రామానికి చెందిన చింత నరేందర్ (అడ్లూరు గ్రామ పంచాయతీ కార్యదర్శి)మోటివేషనల్ స్పీకర్గా ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో శిక్షణ పొందారు.నల్గొండలో జరిగిన కార్యక్రమంలో నేషనల్ హెడ్ బోర్డ్ మెంబర్ "నూనె సుదర్శన్ "చేతుల మీదుగా మోటివేషనల్ స్పీకర్గా సర్టిఫికెట్ పొందడం జరిగింది.

ఈ సందర్భంగా చింత నరేందర్ మాట్లాడుతూ...విద్యార్థులు, యువతకి ప్రేరణ కలిగించి వారి లక్ష్యాలు సాధించే విధంగా జ్ఞాన నైపుణ్యాలు అందించడం, సమాజ సేవతో దేశాభివృద్ధిలో పాల్గొనడం తన కర్తవ్యమని తెలియజేశారు.ఈ సందర్భంగా శిక్షణ పొందిన 30 ట్రైనర్లు ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ వ్యవస్థాపకులు "గురూజీ గంపా నాగేశ్వరరావుకి" ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. అంతేకాకుండా నాకు ఈ అవకాశాన్ని కల్పించిన రీజియన్ 2 ప్రెసిడెంట్ కోట్ల సాయికిరణ్,మెంటర్ కాసర్ల మహేందర్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో కోటా సరిత, నారాయణ కవిత,గూడూరు అంజిరెడ్డి,హర్షిత,శ్రీలత,రవీంద్ర చారి,బాలు,సరిత మొదలగు ట్రైనర్లు పాల్గొన్నారు.

# పెండింగ్ ఫైళ్ళను తక్షణమే పరిష్కరించాలి

**జిల్లా కలెక్టర్ స్నేహ.శబరిష్**

**మహబూబాబాద్ జిల్లా మార్చి 23**

**(వుదయం జిల్లా ప్రతినిధి):**

కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్లు (స్థానిక సంస్థలు) లెనిన్ వత్సల్ టోప్పో, (రెవెన్యూ) కె.అనిల్ కుమార్* అన్ని విభాగాల జిల్లా అధికారులు, తొర్రూరు, మహబూబాబాద్ రెవెన్యూ డివిజనల్ అధికారులు గణేష్, క్రిష్ణవేణి లతో కలిసి జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ స్నేహ శబరీష్ స్వయంగా గూగుల్ మీట్ * ద్వారా సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా వివిధ సమస్యల పరిష్కారం నిమిత్తం వచ్చిన దరఖాస్తుదారులతో కలెక్టర్ స్వయంగా ఫిర్యాదులు తీసుకొని వారి యొక్క వినతులను సవివరంగా విని సంబంధిత విభాగాల అధికారులకు వెంటనే పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేశారు.

ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో పెండింగ్ ఫైళ్లను, ప్రజావాణి దరఖాస్తులను పరిశీలించి తక్షణమే క్లియర్ చేయాలని, కార్యాలయాలను నిత్యం పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ప్రజలకు జవాబుదారీ తరంగా ఉంటూ సేవలు అందించాలని కలెక్టర్ సూచించారు.

ప్రత్యేక అధికారులు వారికి కేటాయించిన వసతి గృహాలలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి పిల్లలతో కలిసి బ్రేక్ ఫాస్ట్ ,భోజనం, డిన్నర్ చేయాలని, ఏమైనా సమస్యలు ఉంటే అక్కడికక్కడే వెంటనే పరిష్కరించాలని తెలిపారు.ప్రత్యేక అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, తహసిల్దారులు, కచ్చితంగా వసతి గృహాలను తనిఖీ చేసి, కామన్ డైట్ మెనూ, త్రాగునీరు, దుస్తులు, తదితర సౌకర్యాలను కచ్చితంగా తనిఖీ చేయాలని, వసతి గృహాలలో కంప్లైంట్ బాక్స్ ఏర్పాటు చేసి అందుకు సంబంధించిన "కీ "సంబంధిత అధికారి వద్ద ఉంచుకోవాలని సూచించారు,

ప్రతి మెనూ గూగుల్ ఫోటో, జియో ట్యాగింగ్, తెప్పించుకోవాలని, షెడ్యూల్ ప్రకారం ఆర్బిఎస్కే, వైద్య క్యాంపుల ద్వారా పిల్లలకు భోజనం సిద్ధం చేసే సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహించాలని, ఎట్టి పరిస్థితుల్లో ఫుడ్ పాయిజన్ కాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటూ నాణ్యమైన ఆహార పదార్థాలను అందించాలన్నారు.ఇనుగుర్తి మండల కేంద్రానికి చెందిన ఆవుల పద్మ తమకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు అయినదని అధికారులు తెలియజేయగానే తమకు ఉన్న పాత ఇల్లును కూల్చివేశామని కానీ ఇప్పుడు అది వేరే స్టేజీ లో ఉందని మంజూరు చేయలేదు తమకు పూర్వం ఎటువంటి ఇందిరమ్మ ఇల్లు మంజూరు కాలేదని తమ సమస్య పరిశీలించి న్యాయం చేయాలని కోరారు.

గార్ల మండల కేంద్రానికి చెందిన సుందర్ తాను పుట్టుకతోనే వికాలాంగుడినని తాను చిన్నపాటి ఉద్యోగంతో కుటుంబ పోషణ ఇబ్బందిగా ఉన్నదని తనకు గార్ల మండల కేంద్రంలో సి.ఎస్.సి కేంద్రానికి అనుమతించి తన కుటుంబం ఆర్థికంగా తోడ్పాటు అందించాలని కోరారు.ఈ రోజు నిర్వహించిన ప్రజావాణి లో వచ్చిన ( 146) దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులకు సత్వర పరిష్కారానికి ఆదేశించారు.

ఈ ప్రజావాణి కార్యక్రమంలో డిఆర్డిఓ ప్రాజెక్ట్ డైరెక్టర్ మధుసూదన రాజు, జడ్పీ సీఈవో పురుషోత్తం, అన్ని విభాగాల జిల్లా అధికారులు, కలెక్టరేట్ పరిపాలన అధికారి పవన్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.



# ప్రజా వినతులను సత్వరమే పరిష్కరించాలి

**అర్జీలు స్వీకరించిన అదనపు కలెక్టర్**

**ఖమ్మంవుదయం బ్యూరో, మార్చి -23:**

ప్రజా వినతులను సత్వరమే పరిష్కరించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ జిల్లా అధికారులను ఆదేశించారు.కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రజల అర్జీలను స్వీకరించారు.సత్తుపల్లి మండలం కాకర్లపల్లి గ్రామానికి చెందిన నడ్డి చందు తనకు లంగ్ క్యాన్సర్ వచ్చిందని, వైద్య చికిత్స నిమిత్తం సిఎంఆర్ఎఫ్ నుంచి నిధులు మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, డిఎంహెచ్ఓ కు రాస్తూ తగుచర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ తెలిపారు. కామేపల్లి మండలం సాతానిగూడెం గ్రామానికి చెందిన డి. చిన్న వెంకయ్య సర్వే నెంబర్ 175/ఘు లో వారసత్వ భూమి 17 ఎకరాల 30 గుంటల భూమి ఉందని, అందులో 7 ఎకరాల 3 గుంటల భూమి కొందరు ఆక్రమించుకున్నారని, దీనిని విచారించి, వారసత్వ హక్కులను పరిశీలించి తమ భూమిని ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, తగుచర్యలు తీసుకోవాలని కామేపల్లి తహసీల్దార్ ను ఆదేశించారు. తిరుమలాయపాలెం మండలం గోపయిగూడెం గ్రామానికి చెందిన షేక్ పెంటు సాహెబ్ తనకు వికలాంగుల ఫించన్ మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, పీడీ డీఆర్డిఓ కు రాస్తూ తగుచర్యలు తీసుకోవాలని అన్నారు.ఖమ్మం నగరానికి చెందిన సామాజిక కార్యకర్త కే. వెంకన్న కొత్త బస్టాండ్ బైపాస్ రోడ్డులో ప్రభుత్వ స్థలంలో అక్రమంగా తాత్కాలిక నిర్మాణాలు చేపట్టారని వీటిని తొలగించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, మున్సిపల్ కమీషనర్ కు రాస్తూ తగుచర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో డిఆర్ఓ ఏ. పద్మశ్రీ, జెడ్పీ సీఈఓ దీక్ష రైనా, జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏఓ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.



# గిరివాణికి ఫిర్యాదుల వెల్లువ!

**అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలి**

**భూ వివాదాల పరిష్కారం కోసం వారానికి 4 రోజులు ఎస్‌డిసి కోర్టు నిర్వహణ**

**- జిల్లా కలెక్టర్, ఐటీడీఏ ఇంచార్జ్ పి.ఓ దివాకర టి.ఎస్.**

**ఏటూరునాగారం, మార్చి 23 (వుదయం ప్రతినిధి) :**

గిరిజనుల సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న 'గిరివాణి' (గిరిజన దర్బార్) కార్యక్రమానికి ప్రజల నుండి భారీగా స్పందన లభించింది.సోమవారం ఐటీడీఏ ఏటూరునాగారం కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ మరియు ఐటీడీఏ ఇంచార్జ్ ప్రాజెక్ట్ ఆఫీసర్ దివాకర టి.ఎస్. స్వయంగా ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా గిరివాణికి 130, ప్రజావాణికి 52 చొప్పున మొత్తం 182 ఫిర్యాదులు అందాయి. ప్రజలు సమర్పించిన అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా, క్షేత్రస్థాయిలో పరిశీలించి తక్షణమే పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.ఎస్‌డిసి (SDC) కోర్టు పటిష్ఠం: భూ వివాదాలు మరియు ఎల్టీఆర్ (LTR) కేసుల పరిష్కారం కోసం వారానికి నాలుగు రోజులు (మంగళ, బుధ, గురు, శుక్రవారాలు) ఉదయం 11:00 నుండి మధ్యాహ్నం 2:00 గంటల వరకు ఎస్‌డిసి కోర్టు నిర్వహించనున్నట్లు కలెక్టర్ వెల్లడించారు.మౌలిక సదుపాయాల కల్పన: గిరిజన గ్రామాల్లో రోడ్ల నిర్మాణం, బోర్ వెల్స్ ఏర్పాటు, తాగునీరు వంటి సమస్యలను ఉపాధి హామీ మరియు ఇతర ప్రభుత్వ నిధులతో ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేస్తామని భరోసా ఇచ్చారు.ప్రముఖ ఫిర్యాదులు కొన్ని సమావేశంలో ములుగు జిల్లాలోని వివిధ మండలాల నుండి వచ్చిన ప్రజలు పలు సమస్యలను కలెక్టర్ దృష్టికి తెచ్చారు. డబుల్ బెడ్ రూమ్ ఇళ్లకు విద్యుత్ లైన్ సౌకర్యం, ROFR పట్టా భూముల సాగు విషయంలో అటవీ అధికారుల జోక్యంపై ఫిర్యాదు,మేడారం గ్రామంలో అక్రమ వలసదారులను అరికట్టాలని వినతి, ఇందిరమ్మ ఇళ్లు, గృహ జ్యోతి పథకం, గిరి వికాస బోర్లు, పట్టా పాస్ బుక్కుల సవరణ, వైద్య భవనాల మంజూరుకై దరఖాస్తులు అందాయి.ఈ కార్యక్రమంలో డి.ఎఫ్.ఓ రాహూల్ కిషన్ జాదవ్, అదనపు కలెక్టర్ సంపత్ రావు, ఏపిఓ వసంత రావు, ఆర్డీఓ వెంకటేష్, ఎస్.డి.సి ప్రతాప్, వివిధ శాఖల జిల్లా అధికారులు, తహసీల్దార్లు పాల్గొన్నారు.



# ఘనంగా 'ప్రపంచ అరణ్య దినోత్సవం'

**పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత**

**జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద**

**వరంగల్, మార్చి 23 (వుదయం ప్రతినిధి) :**

ప్రపంచ అరణ్య దినోత్సవం సందర్భంగా సోమవారం వరంగల్ జిల్లా కలెక్టరేట్‌లో పర్యావరణ చైతన్య కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని వివిధ ప్రభుత్వ, సంక్షేమ రెసిడెన్షియల్ పాఠశాలల విద్యార్థులకు "పర్యావరణ పరిరక్షణ" అనే అంశంపై చిత్రలేఖన పోటీలు నిర్వహించగా, వారు రూపొందించిన కళాఖండాలను కలెక్టరేట్‌లో ప్రదర్శించారు. చిన్నారుల చిత్రాల్లో ప్రకృతి ప్రేమ, పచ్చదనం పట్ల వారికున్న తపన ప్రతిబింబించాయి. ముఖ్యంగా జీహెచ్ఎస్ కరీమాబాద్ విద్యార్థుల చిత్రాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, అటవీ అధికారి అనుజ్ అగర్వాల్, అదనపు కలెక్టర్ సంధ్యారాణి తదితరులు ప్రదర్శనను సందర్శించి విద్యార్థుల సృజనాత్మకతను అభినందించారు. ప్రతి పౌరుడు పుట్టినరోజు వంటి వేడుకల సందర్భంగా కనీసం ఒక మొక్క నాటాలని జిల్లా అటవీ అధికారి పిలుపునిచ్చారు.

కార్యక్రమం చివరలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు కలెక్టర్ చేతుల మీదుగా బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ వేడుక విద్యార్థులతో పాటు ప్రజల్లో పర్యావరణంపై కొత్త ఆశలను, అవగాహనను నింపింది.



# పదవ తరగతి పరీక్షా కేంద్రాలపై ఆకస్మిక తనిఖీలు

**జిల్లా కలెక్టర్ అంకిత్**

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మార్చి 23**

**(వుదయం ప్రతినిధి)**

కొత్తగూడెం పట్టణంలో సోమవారం జిల్లా కలెక్టర్ అంకిత్ పదవ తరగతి వార్షిక పరీక్షలు జరుగుతున్న పలు కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సింగరేణి కాలరీస్ హై స్కూల్, సెయింట్ మేరీస్ హై స్కూల్, బాబు క్యాంపు పీఎం శ్రీ ఉన్నత పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలను సందర్శించి పరీక్షల నిర్వహణపై సమగ్రంగా పరిశీలించారు. పరీక్షలు ప్రశాంత వాతావరణంలో, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా సజావుగా జరుగుతున్నాయా అనే అంశంపై ప్రత్యేక దృష్టి సారించారు.పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలపై కలెక్టర్ ప్రత్యేకంగా ఆరా తీశారు. త్రాగునీరు, విద్యుత్, సరైన కూర్చునే ఏర్పాట్లు, గదుల పరిశుభ్రత, ప్రశాంత వాతావరణం వంటి అంశాలను పరిశీలించి, అవసరమైన చోట్ల తక్షణమే మెరుగులు చేర్చాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి లోను కాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయగల వాతావరణాన్ని కల్పించాలన్నారు.పరీక్షల నిర్వహణలో నిబంధనలు కచ్చితంగా పాటించాలని, ఎలాంటి అక్రమాలు, మాల్‌ప్రాక్టీస్‌కు అవకాశం ఇవ్వకూడదని కలెక్టర్ స్పష్టం చేశారు. పరీక్షా కేంద్రాల్లో నియమించిన ఇన్విజిలేటర్లు, సిబ్బంది తమ విధులను బాధ్యతగా నిర్వహించాలని సూచించారు. పరీక్షల పారదర్శకతను కాపాడడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు .పరీక్షా కేంద్రాల పరిసరాల్లో సెక్షన్ 163 బి అమలు, భద్రతా చర్యలు, పోలీసు బందోబస్తు వంటి అంశాలపై కూడా కలెక్టర్ సమీక్షించారు. పరీక్షా కేంద్రాల వద్ద అనవసరంగా గుంపులు గుమికూడకుండా చర్యలు తీసుకోవాలని, బయటి వ్యక్తుల ప్రవేశాన్ని నియంత్రించాలని అధికారులకు సూచించారు.ఈ తనిఖీలలో భాగంగా కలెక్టర్ విద్యార్థుల హాజరు శాతాన్ని అడిగి తెలుసుకున్నారు. సింగరేణి కాలరీస్ హై స్కూల్ సహా అన్ని పరీక్షా కేంద్రాల్లో 100 శాతం హాజరు నమోదైనట్లు సంబంధిత అధికారులు తెలిపారు. ఈ తనిఖీల్లో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



# ప్రాజెక్ట్ టెక్నికల్ సపోర్ట్ ఉద్యోగానికి దరఖాస్తుల ఆహ్వానం

**హన్మకొండ, మార్చి 23 (వుదయం ప్రతినిధి) :**

హన్మకొండలోని కాకతీయ మెడికల్ కాలేజ్ (KMC) పరిధిలో గల ఒక ముఖ్యమైన ప్రాజెక్టులో పనిచేయుటకు అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులు కోరుతున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఒక ప్రకటనలో తెలిపారు.

పోస్టు పేరు ప్రాజెక్ట్ టెక్నికల్ సపోర్ట్ III

**ఖాళీల సంఖ్య: 01**

ప్రాజెక్టు వివరాలు: ICMR ప్రాజెక్ట్ (సెంటినెల్ సర్వైలెన్స్ ఫర్ మెనింజైటిస్).పనిచేయాల్సిన చోటు ఎం.జి.ఎమ్ (MGM) పీడియాట్రిక్ వార్డ్, వరంగల్.నియామక విధానం ఇది పూర్తిగా తాత్కాలిక ప్రాతిపదికన ఒప్పంద (Contract) విధానంలో ఉంటుంది.

**దరఖాస్తు విధానం**

ఆసక్తి గల అభ్యర్థులు కళాశాల అధికారిక వెబ్‌సైట్ www.kmcwgl.com నుండి దరఖాస్తు ఫారాలను పొందవచ్చు. పూర్తి చేసిన దరఖాస్తులను సమర్పించడానికి మార్చి 30, 2026 చివరి తేదీగా నిర్ణయించారు. ఇతర పూర్తి వివరాల కోసం వెబ్‌సైట్‌ను సందర్శించాలని ప్రిన్సిపాల్ సూచించారు.

# వ్యవసాయ యాంత్రీకరణతో రైతుల ఆదాయం పెంపు

- ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా పురోగతి సాధించాలి
- జిల్లా కలెక్టర్ ప్రావీణ్య
- ఫార్మ్ మెకనైజేషన్, తేనెటీగల పెంపకం పథకాలపై కలెక్టర్ సమీక్ష



**సంగారెడ్డి జిల్లా ప్రతి నిధి, మార్చి 23, వుదయం :**

జిల్లాలో రైతుల ఆదాయం పెంపు, వ్యవసాయ ఉత్పాదకతలో గణనీయమైన వృద్ధి సాధించేందుకు ఫార్మ్ మెకనైజేషన్, వర్షాధార ప్రాంతాల అభివృద్ధి, తేనెటీగల పెంపకం పథకాలను సమర్థవంతంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ ఛాంబర్‌లో వ్యవసాయ, ఉద్యానవన, డీఆర్‌డీఏ శాఖల అధికారులతో జిల్లాలో అమలవుతున్న ఫార్మ్ మేకనైజేషన్, వర్షాదార ప్రాంతాల అభివృద్ధి, తేనెటీగల పెంపకం కార్యక్రమాల పురోగతిపై జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి కేటాయించిన ఫార్మ్ మెకనైజేషన్ లక్ష్యాలను వేగంగా సాధించాలని అధికారులకు సూచించారు. ఇప్పటివరకు సాధించిన పురోగతిని పరిశీలించి, యుటిలైజేషన్ సర్టిఫికెట్లు వెంటనే సమర్పించాలని ఆదేశించారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా పురోగతి సాధించాలని, రైతులను యాంత్రీకరణ వైపు మరింతగా ప్రోత్సహించాలని సూచించారు. ఉద్యాన యాంత్రీకరణ పథకం ద్వారా మినీ ట్రాక్టర్లు, పవర్ వీడర్స్, పవర్ టిల్లర్స్, బ్రష్ కట్టర్స్, పవర్ స్ప్రేయర్స్ వంటి యంత్రాల కొనుగోలుకు ఆర్థిక సహాయం అందిస్తున్నామని, జిల్లాలో ఇప్పటివరకు 97 యూనిట్లు మంజూరైనట్లు తెలిపారు. వర్షాధార ప్రాంతాల అభివృద్ధి పథకం ద్వారా రైతుల ఆదాయం పెంపు, ఆహార భద్రత, వ్యవసాయ ఉత్పాదకత మెరుగుదల లక్ష్యంగా సమగ్ర వ్యవసాయ విధానాలను ప్రోత్సహిస్తున్నామని, ఈ పథకాల అమలులో వ్యవసాయ, ఉద్యానవన, డీఆర్‌డీఏ శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు.తేనెటీగల పెంపకం కార్యక్రమాన్ని మరింత విస్తరించాలని, ఎక్కువ మంది రైతులకు బీహైవ్ యూనిట్లు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా, కమర్షియల్ స్థాయిలో తేనెటీగల పెంపకం యూనిట్లు ఏర్పాటు చేసేందుకు ఆసక్తి ఉన్న స్వయం సహాయక సంఘాల మహిళలను ఇందిరా మహిళా శక్తి పథకం కింద ప్రోత్సహించాలని డీఆర్‌డీఏ అధికారులకు సూచించారు. ఈ సమీక్ష సమావేశంలో డిఆర్డిఏ ఏపీడి సూర్యరావు, ఉద్యానవన శాఖ అధికారి సోమేశ్వరరావు, జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రామాచారి, తదితరులు పాల్గొన్నారు.

### ప్రజావాణిలో 49 దరఖాస్తులు స్వీకరణ

ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రజావాణిలో అందిన ప్రతి దరఖాస్తును పెండింగ్‌లో ఉంచకుండా వేగవంతంగా పరిష్కరించాల్సిందిగా జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పాండు, సబ్ కలెక్టర్ ఉమా హారతి కలిసి వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి వివిధ శాఖలకు సంబంధించిన 49 దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రతి వినతిని ప్రాధాన్యతతో పరిగణించి సంబంధిత శాఖ అధికారులు నిర్దిష్ట కాలపరిమితిలో పరిష్కారం చూపాలని ఆదేశించారు. ప్రజలకు పారదర్శకంగా, జవాబుదారీతనంతో సేవలు అందించడం ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. ప్రజలు తమ



సమస్యలను నేరుగా అధికారులకు వినిపించే ప్రజావాణి కార్యక్రమానికి విశేష స్పందన లభించినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# ప్రజావాణిలో ప్రజల సమస్యలకు ప్రాధాన్యం

## 18 ఫిర్యాదుల స్వీకరణ, తక్షణ చర్యలకు ఎస్పీ ఆదేశాలు

**గద్వాల మార్చి 23 (వుదయం ప్రతినిధి)** జిల్లా కేంద్రంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల సమస్యలకు ప్రాధాన్యత ఇస్తూ, జిల్లా ఎస్పీ టి. శ్రీనివాస రావు ప్రత్యక్షంగా ఫిర్యాదులను స్వీకరించారు. ఈ కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 18 మంది ఫిర్యాదుదారులు తమ సమస్యలను ఎస్పీకి వివరించారు. ప్రతి ఫిర్యాదును శ్రద్ధగా వినిపించిన ఎస్పీ, వాటిని స్వయంగా పరిశీలించి, సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులకు వెంటనే చర్యలు తీసుకోవాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. బాధితులకు తక్షణ న్యాయం అందేలా చర్యలు చేపట్టాలని ఆయన పేర్కొన్నారు. అంతేకాకుండా, అక్కడే ఉన్న డి.ఎస్పీ వై. మొగిలయ్య, గద్వాల, శాంతినగర్ సర్కిల్ అధికారులను పిలిపించి, తమ పరిధిలో వచ్చిన ఫిర్యాదులపై ఇప్పటికే తీసుకున్న చర్యల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పనితీరుపై సమీక్ష నిర్వహించడం ద్వారా బాధ్యతాయుత పోలీసింగ్‌కు నిదర్శనంగా నిలిచారు. ఫిర్యాదుల వివరాలు: భూ వివాదాలు 6, ప్లాట్ల సమస్యలు 2, వ్యక్తిగత గొడవలు 6, మసీదు సీసీ కెమెరాల ధ్వంసం 1, ఇతర సమస్యలు 3, ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన ప్రతి ఫిర్యాదును వెంటనే ఆన్లైన్‌లో నమోదు చేసి, నిరంతరం మానిటర్ చేస్తున్నామని తెలిపారు. ప్రతి ఫిర్యాదుదారుడికి న్యాయం జరిగేలా కట్టుబడి ఉన్నామని హామీ ఇచ్చారు. ప్రజావాణి కార్యక్రమంలో స్పందనతో కూడిన చర్యలు తీసుకోవడం పట్ల ఫిర్యాదుదారులు సంతృప్తి వ్యక్తం చేస్తూ, జిల్లా పోలీస్ వ్యవస్థపై విశ్వాసం వ్యక్తం చేశారు.

# భూసేకరణకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న సర్వే పనుల్ని త్వరగా పూర్తి చేయాలి



- జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి
- ఇరిగేషన్ మరియు రెవెన్యూ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం

**వనపర్తి మార్చ్ 23(వుదయం ప్రతినిధి )** జిల్లాలోని నీటిపారుదల ప్రాజెక్టులకు భూసేకరణకు సంబంధించి పెండింగ్లో ఉన్న సర్వే పనుల్ని వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా కలెక్టర్ ఇరిగేషన్ మరియు రెవెన్యూ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలో కొనసాగుతున్న పలు నీటిపారుదల ప్రాజెక్టుల భూ సేకరణకు సంబంధించిన పెండింగ్ అంశాలపై అధికారులతో చర్చించారు. కర్నె తాండ లిఫ్ట్ ఇరిగేషన్ కు సంబంధించి పెండింగ్ 34 ఎకరాల భూసేకరణకు పెగ్ మార్కింగ్ పూర్తి అయినప్పటికీ ఇంకా సర్వే పూర్తి చేయకపోవడంపై సర్వే అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మరో వారంలోపు ఈ 34 ఎకరాల సర్వే పూర్తి చేసి, మార్చి 31 నాటికి ప్రిలిమినరీ నోటిఫికేషన్ పబ్లిష్ చేసే విధంగా అడుగులు పడాలని ఆదేశించారు. జిల్లాలో గణపసముద్రం ప్రాజెక్టులో భాగంగా పెండింగ్లో ఉన్న 197 ఎకరాల భూసేకరణకు సర్వే పూర్తి అయిందని, ప్రిలిమినరీ నోటిఫికేషన్ మార్చి 31 లోపు పూర్తి చేయాలన్నారు. మహాత్మా గాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకం కింద డి 1, డి 5, డి 8, ప్యాకేజ్ 29 కు సంబంధించి 92 ఎకరాల భూసేకరణకు పెగ్ మార్కింగ్ 2 వారాలలోపు కంప్లీట్ చేయాలని, పెగ్ మార్కింగ్ తో పాటే సర్వే విభాగం అధికారులు ఎంజాయ్మెంట్ సర్వే కూడా పూర్తి చేయాలని ఆదేశించారు. ఖాన్ చెరువుకు సంబంధించి 18.82 ఎకరాల భూసేకరణకు పెగ్ మార్కింగ్, సర్వే ఏకకాలంలో పూర్తిచేయాలని ఆదేశించారు. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రజలకు తాగు నీటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. నీటి సరఫరా నిర్వహణకు సంబంధించి ఏమైనా ఇబ్బందులు ఉంటే ఇప్పుడే పరిష్కరించుకోవాలని సూచించారు. గతేడాది సమస్యలు తలెత్తిన ప్రాంతాలు, లైన్లను మరోసారి సరిచూసుకొని ఈ ఏడాది అటువంటి సమస్యలు తలెత్తకుండా తెలియజేశారు. సమావేశంలో ఆర్డీవో సుబ్రహ్మణ్యం, నీటిపారుదల శాఖ ఎస్ ఈ చంద్రశేఖర్, సర్వే ఏడి శ్రీనివాసులు, మిషన్ భగీరథ అధికారులు, ఇతర రెవెన్యూ అధికారులు, నీటిపారుదల శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# ప్రజావాణి ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

- ప్రజావాణికి 34 ఫిర్యాదులు,
- జిల్లా అదనపు కలెక్టర్లు, అమరేందర్, జి.వీ శ్యామ్ ప్రసాద్ లాల్

**నాగర్ కర్నూల్ మార్చి 23(వుదయం ప్రతినిధి)** సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో చంద్రశేఖర్ తో కలిసి అదనపు కలెక్టర్లు, అమరేందర్, జి.వీ శ్యామ్ ప్రసాద్ లాల్ , ,ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్లు, మాట్లాడుతూ.. ప్రజావాణి సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ, ఫిర్యాదుదారులకు తగిన సమాచారం అందించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ఈరోజు ప్రజావాణికి మొత్తం 34, ఫిర్యాదులు వచ్చాయని, ప్రజల ఫిర్యాదులు సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు అధికారులు కృషి చేయాలని అధికారులను సూచించారు. కార్యక్రమంలో కలెక్టరేట్ సూపరింటెండెంట్ లు, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అత్యాచార నిందితుడికి 10 ఏళ్ల జైలు శిక్ష

## జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా



**వికారాబాద్ జిల్లా మార్చి 23, పరిగి పట్టణం (వుదయం ప్రతినిధి )** 2016 సంవత్సరం లో పరిగి పోలీస్ స్టేషన్ పరిధి లోని కేసులో నిందితుడికి కోర్టు పదేళ్ల కారాగార శిక్ష , 12000 రూపాయల విధిస్తూ తీర్పునిచ్చిందని జిల్లా ఎస్పీ శ్రీమతి స్నేహ మెహ్రా, ఐపీఎస్ గారు ఈ రోజు ఒక ప్రకటనలో తెలిపారు. పరిగి మండలం, బర్కత్‌పల్లి గ్రామానికి చెందిన సుక్కాని అంజయ్య (37) అనే వ్యక్తిపై 2016లో అత్యాచారం మరియు బెదిరింపులకు (IPC సెక్షన్లు 376, 506) సంబంధించి కేసు (Cr No: 268/2016) నమోదైంది. ఈ కేసు విచారణ వికారాబాద్‌లోని మొదటి అదనపు జిల్లా మరియు సెషన్స్ కోర్టులో కొనసాగింది. పోలీసులు సమర్పించిన పక్కా సాక్ష్యాధారాలను పరిశీలించిన గౌరవనీయ న్యాయమూర్తి శ్రీ చౌదరి చంద్ర కిషోర్ గారు, నిందితుడు అంజయ్య దోషిగా నిర్ధారిస్తూ 10 సంవత్సరాల జైలు శిక్ష మరియు 12,000 రూపాయల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. ఈ కేసులో నిందితుడికి శిక్ష పడేలా చేయడంలో విశేష కృషి చేసిన అధికారులను ఎస్పీ గారు ప్రత్యేకంగా అభినందించారు. నాటి దర్యాప్తు అధికారులు వై. నాగేష్ (అప్పటి పరిగి SI), పి. ప్రసాద్ (అప్పటి పరిగి సిఐ ), ప్రస్తుత పరిగి సీఐ శ్రీనివాస్ రెడ్డి, ఎస్.హెచ్.ఓ మోహన్ కృష్ణలను , అలాగే కోర్టులో సమర్థవంతంగా వాదనలు వినిపించిన అడిషనల్ పి.పి. శ్రీమతి మెరాజ్ ఫిర్దౌస్, సి.డి.ఓ జగన్ మోహన్ రెడ్డి, మరియు కోర్టు లైజన్ ఆఫీసర్ ఎస్. నిరంజన్ గౌడ్ ల పనితీరును ఎస్పీ గారు ప్రశంసించారు. మహిళల భద్రత విషయంలో జిల్లా పోలీస్ శాఖ అత్యంత కఠినంగా వ్యవహరిస్తుందని, నేరస్థులు చట్టం నుండి తప్పించుకోలేరని ఈ సందర్భంగా ఎస్పీ హెచ్చరించారు.

# ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

## జిల్లా కలెక్టర్ దీపక్ తివారి



**వికారాబాద్: వుదయం ప్రతినిధి;** జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి సమస్యల పరిష్కారం కొరకు వచ్చిన వారి ఫిర్యాదులను పూర్తి స్థాయి లో పరిశీలించి పెండింగ్ ఉంచకుండా సత్వరమే పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి 135 పిర్యాదులు స్వీకరించారు. ప్రజావాణికి వచ్చే ఫిర్యాదులను పూర్తి స్థాయి లో పరిశీలించి పెండింగ్ ఉంచకుండా సత్వరమే పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి లో వచ్చిన దరఖాస్తులు పరిష్కరించడం అధికారుల బాధ్యత అని పేర్కొన్నారు.ప్రజావాణిలో వచ్చే ప్రతి దరఖాస్తును అధికారులు జాగ్రత్తగా చదివి, అందులో పేర్కొన్న సమస్యలను పూర్తిగా అర్థం చేసుకుని, అవసరమైన విచారణ జరిపి సరైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ప్రజావాణి ద్వారా వచ్చిన ఫిర్యాదులను పెండింగ్ ఉంచకుండా నిర్ణీత కాలంలో పరిష్కరించి స్పష్టమైన నివేదిక సమర్పించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా వివిధ శాఖల వారిగా డి పి ఓ ,పంచాయతీ రాజ్, గృహ నిర్మాణము డీఆర్‌డీఏ, ప్రణాళిక శాఖ, భూ సేకరణ విభాగాలకు చెందిన అధికారుల వద్ద పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులపై వివరణ ఇవ్వాలని కోరారు. వారంలోపు అన్ని పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించి, గత వారం అందిన దరఖాస్తుల సంఖ్య, పరిష్కరించినవి, ఇంకా పెండింగ్‌లో ఉన్నవి వంటి వివరాలతో కూడిన సమగ్ర నివేదికను స్పష్టమైన నమూనాలో సమర్పించాలని అధికారులకు ఆదేశించారు.

99 రోజుల ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక ప్రతి రోజూ చేపట్టిన కార్యక్రమాలకు సంబంధించిన ఫోటోలు , వివరాలను కార్యక్రమం అనంతరం జిల్లా అధికారుల వాట్సాప్ గ్రూపులో అప్లోడ్ చేయాలని, ఆదేశించారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్, అదనపు కలెక్టర్ రెవెన్యూ రాజేశ్వరి ,జడ్.పి సి ఇ ఓ సుధీర్, డి ఆర్ ఓ మంగీ లాల్ ,డి ఆర్ డి ఓ శ్రీనివాస్ ,ఆర్ డి ఓ వాసు చంద్ర,వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కలెక్టరేట్ భవన ఆవరణలో రోడ్ల నిర్మాణం చేపట్టాలి





## జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

**నారాయణపేట టౌన్ మార్చి 23( వుదయం ప్రతినిధి)** నూతన కలెక్టరేట్ భవన సముదాయం ఆవరణలో రోడ్ల నిర్మాణం వెంటనే చేపట్టాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ఆదేశించారు. సోమవారం సింగారం మలుపు దారి వద్ద నిర్మాణంలో ఉన్న నూతన కలెక్టరేట్ భవనాన్ని కలెక్టర్ పరిశీలించారు. భవనం ఆవరణ లో అంతర్గత రహదారుల నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలన్నారు. ప్రధాన రహదారికి కలెక్టరేట్ భవన సముదాయం వరకు సమాంతరంగా రోడ్డు వేయాలన్నారు. అలాగే భవన సముదాయానికి సమీపంలో ఉన్న విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ ను అక్కడి నుంచి తొలగించి కొద్ది దూరంలో ఏర్పాటు చేయాలని విద్యుత్ శాఖ అధికారులకు సూచించారు. భవనం చుట్టూ నాలుగు వైపులా మొక్కలు పెట్టి గ్రీనరీ ఏర్పాటు చేయాలని డీఆర్డీవో మొగులప్ప కు చెప్పారు. కలెక్టరేట్ సముదాయంతో పాటు బయట రోడ్లు, ఇతర పనుల్లో వేగం పెంచాలని ఆర్ అండ్ బీ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ బీ డీ.ఈ.ఈ రాములు, పంచాయతీ రాజ్ ఈ ఈ, విద్యుత్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

### పదో తరగతి పరీక్షా కేంద్రాన్ని తనిఖీ

**నారాయణపేట మార్చి 23( వుదయం ప్రతినిధి )** నారాయణపేట జిల్లా కేంద్రంలోని శ్రీ సాయి స్కూల్ పదో తరగతి పరీక్షా కేంద్రాన్ని సోమవారం జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేంద్రంలో కొనసాగుతున్న పరీక్షా సరళిని ఆయన పరిశీలించారు. పరీక్షలు ప్రశాంతంగా, సజావుగా జరిగేలా విద్యా శాఖ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. కేంద్రాల్లో విద్యార్థులకు అవసరమైన వసతి సదుపాయాలు కల్పించాలన్నారు. సోమవారం నాటి పరీక్షకు ఎంతమంది విద్యార్థులు హాజరయ్యారని ఆరా తీశారు.



# ప్రజావాణికి 37 ఫిర్యాదులు

- జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

**నారాయణపేట మార్చి 23( వుదయం ప్రతినిధి)** ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యత నిస్తూ ఫిర్యాదు లను సత్వరమే పరిష్కరిం చాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులకు సూచించారు. కలెక్టర్ సోమవారం ప్రజావాణి సమావేశ మంది రంలో నిర్వహించిన ప్రజా వాణి కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను విన్నవిస్తూ అర్జీలను కలెక్టర్ కు సమర్పించగా, ప్రజల ఫిర్యాదులను సమస్యలను సావధానంగా విన్న కలెక్టర్ సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం నాటి ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 37 ఫిర్యాదులు వచ్చాయి. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫణీంద్ర రెడ్డి, అదనపు కలెక్టర్ రెవెన్యూ శ్రీను,వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలి

## జిల్లా కలెక్టర్ కుష్బూ గుప్తా



**మహబూబ్ నగర్ మార్చి 23( వుదయం ప్రతినిధి )** జిల్లా ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రజావాణి లో అందిన ప్రతి ఫిర్యాదును నిర్లక్ష్యం చేయకుండా తక్షణమే పరిష్కరించే దిశగా అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా అన్నారు. జిల్లా కలెక్టర్ కార్యాలయం సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా పాల్గొని ప్రజల నుండి వచ్చిన వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా భూ సర్వే, రెవెన్యూ సంబంధిత సమస్యలు, గృహ నిర్మాణ పథకాలు, వృద్ధాప్య పెన్షన్లు, మున్సిపాలిటీ ,పంచాయతీ పరిపాలనకు సంబంధించిన అంశాలపై మొత్తం 90 దరఖాస్తులు స్వీకరించబడినట్లు అధికారులు తెలిపారు.ప్రతి ఒక్క ఫిర్యాదు దారిని యొక్క సమస్యను జిల్లా కలెక్టర్ శ్రద్ధగా విని, సమస్యల స్వభావాన్ని అర్థం చేసుకున్నారు. అనంతరం సంబంధిత శాఖల అధికారులకు స్పష్టమైన సూచనలు చేస్తూ, ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, అర్హులైన వారికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజావాణి ద్వారా వచ్చిన వినతులపై నిర్దిష్ట కాలపరిమితిలో స్పందిస్తూ, పరిష్కార ప్రక్రియను వేగవంతం చేయాలని, పెండింగ్‌లో ఉన్న ఫిర్యాదులను తగ్గించే దిశగా ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని జిల్లా కలెక్టర్ సూచించారు.ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ, జడ్.పి. సీఈఓ, ఇంచార్జ్ డిపిఓ వెంకట్ రెడ్డి, ఆర్.డి.ఓ ఇ. నవీన్‌తో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ప్రజావాణి ఫిర్యాదులపై అలసత్వం వహిస్తే కఠిన చర్యలు

- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్
- ఐడీఓసీ సమావేశపు మందిరంలో అదనపు కలెక్టర్లు, ఆర్డీవోతో కలిసి ప్రజల నుంచి ఆర్జీలు స్వీకరణ

**గద్వాల మార్చి 23 (వుదయం ప్రతినిధి)** ప్రజావాణికి ప్రతి వారం పెద్ద సంఖ్యలో ఫిర్యాదులు వస్తున్నాయని పరిష్కరించకుండా అలసత్వం వహిస్తే సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ హెచ్చరించారు. సోమవారం ప్రజావాణి సందర్భంగా ఐడిఓసీ సమావేశపు మందిరంలో అదనపు కలెక్టర్లు, ఆర్డీవోతో కలిసి జిల్లా కలెక్టర్ ప్రజల నుంచి ఆర్జీలను స్వీకరించారు. వివిధ శాఖలకు సంబంధించి ప్రజల నుంచి మొత్తం 56 ఆర్జీలు వచ్చాయన్నారు. ప్రజావాణి అనంతరం జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ జిల్లా అధికారులతో మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చిన ఆర్జీలను సకాలంలో పరిష్కరించకుండా పెండింగ్ లో ఎందుకు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కలెక్టరేట్లో జరిగిన ప్రజావాణికి సంబంధించి 435 దరఖాస్తులు పరిష్కరించాల్సి ఉందన్నారు. దరఖాస్తు దారులు అవసరమైన సందర్భాల్లో తమ ఆర్జీలకు సంబంధించిన రికార్డులు, ఇతర పత్రాలు తీసుకురాకుండా వస్తే ఆ సమస్యకు పరిష్కారం లభించదని పేర్కొన్నారు. ఆయా మండలాల్లోనూ వివిధ శాఖలకు సంబంధించి పెద్ద సంఖ్యలో దరఖాస్తులు అపరిష్కృతంగా ఉన్నాయని, ముఖ్యంగా రెవిన్యూ శాఖలో భూ సంబంధ సమస్యలపై వచ్చిన వందలాది ఆర్జీలను పరిష్కరించాల్సి ఉందన్నారు.

ప్రతి బుధవారం ఆయా శాఖల జిల్లా అధికారులు తమ కింది స్థాయి అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించి పెండింగ్ లో ఉన్న ఆర్జీలను పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. మండల స్థాయి అధికారులు సైతం తమ పరిధిలో ప్రజావాణి కార్యక్రమాన్ని సక్రమంగా నిర్వహించి వచ్చిన ఆర్జీలను పరిష్కరిస్తే చిన్న చిన్న సమస్యలకే ప్రజలు కలెక్టరేట్ వరకు రావాల్సిన అవసరం ఉండదన్నారు.

ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ కార్యాలయాల్లో పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహించాలని, పెండింగ్ ఫైల్స్ క్లియరెన్స్ పై స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినప్పటికీ చాలా శాఖల అధికారులు పూర్తిస్థాయిలో అమలు చేయలేదని, వారంలోగా షెడ్యూల్ ప్రకారం పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహించకుంటే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఆయా కార్యాలయాల గదుల్లో అనవసరమైన ఫర్నిచర్, ఫైల్స్ కనిపిస్తే సంబంధిత అధికారులపై వేటు తప్పదన్నారు. ప్రభుత్వ అధికారులు సమయపాలన పాటించాలని, ప్రతి కార్యాలయం వద్ద బయోమెట్రిక్ యంత్రాల ద్వారా హాజరు నమోదు చేయాలన్నారు. జోగులాంబ గద్వాల జిల్లా పలు రంగాల్లో వెనుకబడిందని, జిల్లా పరిపాలన యంత్రాంగం చిత్తశుద్ధితో పనిచేస్తేనే మన జిల్లా ఆయా రంగాల్లో రాష్ట్రంలో మొదటి స్థానంలో ఉంటుందన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, గురుకుల విద్యాలయాలు, వసతి గృహాలు, ఆసుపత్రులను తమ పరిధిలోని మండలాల ప్రత్యేక అధికారులు, తహసిల్దార్లు, ఎంపీడీవోలు తరచు సందర్శిస్తూ అక్కడి పనితీరు మెరుగుపడేందుకు సహకరించాలన్నారు. ఈ అధికారులు ప్రతి శుక్రవారం విద్యార్థులతోపాటు గురుకుల విద్యాలయాల్లో భోజనం చేయాలని, పంచాయతీ కార్యదర్శులు తమ పరిధిలోని పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం చేయాలని ఆదేశించారు. ప్రతి బుధవారం 11:00 గంటలకు పంచాయతీ కార్యదర్శులు వారి గ్రామాల్లోని అంగన్వాడీ కేంద్రాలను సందర్శించాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు లక్ష్మీ నారాయణ, నర్సింగరావు, ఆర్డీవో శ్రీనివాసరావు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.




### పదవ తరగతి పరీక్షా కేంద్రాన్ని తనిఖీ



**గద్వాల మార్చి 23 (వుదయం ప్రతినిధి)** పదవ తరగతి పరీక్షలను ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. సోమవారం గద్వాలలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల పదవ తరగతి పరీక్షా కేంద్రంను జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ పరీక్షల నిర్వహణ విధానం, విద్యార్థుల హాజరు, తదితర వివరాలను అక్కడి అధికారులను అడిగి తెలుసుకున్నారు. పరీక్ష కేంద్రం వద్ద వైద్య శిభిరం, మౌలిక వసతుల ఏర్పాట్లను పరిశీలించారు. ఓఆర్ఎస్ ద్రావణాన్ని సిద్ధంగా ఉంచి అవసరమైన విద్యార్థులకు అందజేయాలన్నారు. పరీక్షా కేంద్రాల్లోకి ఎలక్ట్రానిక్ పరికరాలు, సెల్‌ఫోన్లను ఎట్టి పరిస్థితుల్లో అనుమతించ రాదని పేర్కొన్నారు. ప్రశ్నాపత్రాలను పోలీస్ ఎస్కార్ట్‌తోనే కేంద్రాలకు తరలించి పరీక్ష అనంతరం పోస్టాఫీసులో డిపాజిట్ చేయాలన్నారు. అనంతరం పలు తరగతి గదుల్లో తిరిగి విద్యార్థులు పరీక్ష రాసే విధానాన్ని పరిశీలించారు. ఈ పర్యటనలో జిల్లా విద్యాశాఖ అధికారి విజయలక్ష్మి, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఒక్క మార్చిలోనే రూ. 93 వేల కోట్ల ఎఫ్‌పీఐలు వెనక్కి



భారతకరెన్సీ క్రమం తప్పకుండా రికార్డుస్థాయి కనిష్టాలకు బలహీనపడుతుండటం, పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతుండటంతో మన ఈక్విటీ మార్కెట్ల నుంచి విదేశీ ఇన్వెస్టర్లు భారీగా నిధులు వెనక్కి తీసుకెళ్తున్నారు.వీటితో పాటు పెరుగుతున్న ముడిచమురు ధరలు దేశ మౌలిక సదుపాయాలకు ముప్పుగా పరిణమించాయి. దీనితో స్టాక్ మార్కెట్‌లో విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు(ఎఫ్‌పీఐ)షేర్ల అమ్మకాలు ఈనెలలో రికార్డుస్థాయిలో నమోదవుతున్నాయి. ఎన్ఎస్‌డీఎల్,బీఎస్ఈ సంయుక్త డేటాప్రకారం, ఇప్పటివరకు విదేశీపోర్ట్‌ఫోలియోఇన్వెస్టర్లు కేవలం స్టాక్‌మార్కెట్ల నుంచే రూ.93,698కోట్లను ఉపసంహరించుకున్నారు.




## ప్రపంచ వ్యాప్త ద్రవ్యోల్బణ సెగలే..!




పశ్చిమాసియాలో నెలకొన్న యుద్ధంతో ప్రపంచ వ్యాప్తంగా ద్రవ్యోల్బణం ఎగిసే అవకాశం ఉందని ఎస్‌బిఐ రీసెర్చ్ తన నివేదికలో వెల్లడించింది. యుద్ధం ఇతర ప్రాంతాలకు వ్యాపిస్తే మరింత ద్రవ్యోల్బణ అలజడకి కారణం కావచ్చని హెచ్చరించింది. పెరుగుతున్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలతో ప్రపంచ ఇంధన రంగం, వాణిజ్యం, ఆర్థిక వ్యవస్థలపై తీవ్ర ప్రభావం చూపవచ్చని నివేదిక పేర్కొంది. అయితే పశ్చిమాసియా ఘర్షణలు భారత్‌పై పెద్ద ప్రభావం చూపకపోవచ్చని తప్పుడు తడకగా రిపోర్ట్ ఉండటం గమనార్హం. బ్యారెల్ చమురు ధర 110 డాలర్లు దాటడంతో భారత ఇంధనం, రవాణపై తీవ్ర ఒత్తిడి నెలకొంది. గ్యాస్ కొరతతో అనేక కంపెనీలు మూతపడుతున్నాయి. మరోవైపు యుద్ధం ప్రభావంతో డాలర్‌తో రూపాయి మారకం విలువ రికార్డ్ కనిష్టం 94 చేరువలో నమోదయ్యింది. ఎగుమతులు పడిపోతున్నాయి. అయినప్పటికీ యుద్ధ ప్రభావం అంతంతే అంటూ ఎస్‌బిఐ నివేదిక పేర్కొనడం సంస్థ విశ్వసనీయతను దెబ్బతీస్తోంది. భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు పెరిగితే ఇంధన మార్కెట్లు, అంతర్జాతీయ వాణిజ్యం, ఆర్థిక వ్యవస్థల్లో అస్థిరత ఏర్పడవచ్చని రిపోర్ట్ పేర్కొంది. ఒకవేళ ఈ సంఘర్షణ దీర్ఘకాలం కొనసాగితే.. ముడి చమురు ధర ప్రతీ 10 డాలర్లు పెరిగినప్పుడు.. భారత కరెంట్ అకౌంట్ లోటు (సిఏడి) 36 బేసిస్ పాయింట్లు, ద్రవ్యోల్బణం 35-40 బేసిస్ పాయింట్లు పెరిగే ప్రమాదం ఉందని నివేదిక అంచనా వేసింది.

## ఓఎఫ్ఎస్ మార్గంలో ఐడీబీఐ బ్యాంక్ వాటా విక్రయం!




ఎల్ఐసీ నియంత్రణలోని ఐడీబీఐ బ్యాంక్‌లో కొంత వాటాను ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్)లో విక్రయించడం ద్వారా పబ్లిక్ షేర్ హోల్డింగ్ పెంచాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం ఐడీబీఐ బ్యాంక్‌లో పబ్లిక్ వాటా 5.29 శాతం మాత్రమే ఉంది. మిగతా షేర్లలో ఎల్ఐసీ వద్ద 49.24 శాతం, ప్రభుత్వంవద్ద 45.48 శాతం వాటాలున్నాయి. ఈ నెల ప్రారంభంలో ప్రభుత్వం, ఎల్ఐసీ కలిసి తమ వద్ద ఉన్న వాటాల్లో 60.72 శాతాన్ని విక్రయించేందుకు ఆర్థిక బిడ్లను ఆహ్వానించాయి. అయితే ఇద్దరు కొనుగోలుదార్ల నుంచి వచ్చిన బిడ్లు రిజర్వ్ ధర కంటే తక్కువగా ఉండటంతో విక్రయ ప్రతిపాదనను రద్దు చేశాయి. ఫ్రీ-ఫ్లోట్ మార్కెట్ తక్కువగా ఉండటంతో బ్యాంక్ సరైన మార్కెట్ విలువ బయటకు రావడం లేదని, ప్రస్తుతం ఉన్న 5.29 శాతం పబ్లిక్ వాటాను 10 లేదా 15 శాతానికి పెంచడం ద్వారా కచ్చితమైన షేరు విలువను వెలికి తీయొచ్చని ప్రభుత్వం భావిస్తున్నట్లు సమాచారం. రద్దు చేసిన విక్రయ ప్రతిపాదన ప్రకారం.. ప్రభుత్వం, ఎల్ఐసీ తమ వద్ద ఉన్న 30.48 శాతం, 30.24 శాతం వాటాలను తగ్గించుకోవాలని భావించాయి. దీంతో ఓఎఫ్ఎస్ అవకాశాన్ని పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది.

## ఎయిర్‌లైన్స్‌కు లిక్విడిటీ మద్దతు ఇచ్చే అవకాశం



పశ్చిమాసియా ఉద్రిక్తతలు కొనసాగుతుండటం, పెరుగుతున్న ఇంధన ధరల వల్ల కార్యకలాపాల అంతరాయాలు విమానయాన రంగాన్ని ఒత్తిడికి గురిచేస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం విమానయాన సంస్థలకు లిక్విడిటీమద్దతు ఇవ్వాలని భావిస్తోందని సంబంధిత వర్గాలు తెలిపాయి. ప్రభుత్వం పన్ను ఉపశమన అవకాశాలను కూడా పరిశీలిస్తోందని, ఈ సమస్యపై చర్చించడానికి రాష్ట్రాలతో సంప్రదింపులు జరుపుతుందని వెల్లడించారు. ఫిబ్రవరి 28న ఇరాన్ యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి విమానయాన సంస్థలు తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి. పశ్చిమాసియా, పాకిస్తాన్ గగనతలాలు మూసివేత కారణంగా ఫ్లైట్ రూట్లు పెరిగాయి.

# తిరుగులేని శక్తిగా భారత్...
## అమెరికా మ్యాగజైన్ వెల్లడి

గత కొన్నేళ్లుగా భారత ఆర్థికవ్యవస్థ అత్యంత వేగవంతమైన వృద్ధిని సాధిస్తోంది. ముఖ్యంగా మన దేశ ఆర్థిక వృద్ధిని ప్రపంచమంతా ఆసక్తిగా చూస్తున్న పరిస్థితులు ఏర్పడ్డాయి. ఈ నేపథ్యంలో అమెరికాకు చెందిన మ్యాగజైన్ 'వాషింగ్టన్ ఎగ్జామినర్' భారత్‌కు సంపన్న దేశంగా ఎదిగే సామర్థ్యం అత్యధికంగా ఉందని అభిప్రాయపడింది. భారత ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యానికి అనుగుణంగా దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 100 ఏళ్లు పూర్తయ్యే 2047 నాటికి ఇది సాధ్యమని మ్యాగజైన్ తన నివేదికలో పేర్కొంది. ముఖ్యంగా ప్రపంచదేశాలు భారత్‌ను ఎదుగుతున్న ఆర్థిక శక్తిగా చూస్తున్నాయని వెల్లడించింది. వాషింగ్టన్ ఎగ్జామినర్ నివేదిక కీలక అంశాలను ప్రస్తావించింది. ప్రధానంగా గడిచిన రెండు దశాబ్దాలను పరిగణలోకి తీసుకుని, 2003 నుంచి దేశ ఆర్థికవ్యవస్థ సగటు వార్షిక వృద్ధి రేటు 7 శాతానికి పైగా ఉందని పేర్కొంది. రాబోయే మరో 20ఏళ్ల వరకు ఇదే వృద్ధి వేగాన్ని కొనసాగిస్తే దేశ తలసరి జీడీపీ 15,000 డాలర్లను దాటుతుంది. తద్వారా భారత్ అధిక-ఆదాయ పరిమితిని దాటేస్తుంది. దీనివల్ల భారత్ మిడిల్-ఇన్‌కమ్ ట్రాప్ నుంచి బయటపడుతుంది. ఈ స్థాయి వృద్ధితో మధ్య-ఆదాయ ట్రాప్‌లో చిక్కుకున్న బ్రెజిల్, దక్షిణాఫ్రికా, తుర్కియే వంటి ఆర్థిక వ్యవస్థలను భారత్ అధిగమించే అవకాశాలు ఉన్నాయి. భారతదేశ వృద్ధి అవకాశాలకు అనుకూలంగా అధిక జనాభా, పెరుగుతున్న సాంకేతికత వినియోగం, పాలసీలు వంటివి మద్దతునిస్తున్నాయని వాషింగ్టన్ ఎగ్జామినర్ తెలిపింది. ముఖ్యంగా యువత భారత్‌కు ఉన్న అతిపెద్ద బలం. అమెరికా, చైనాల కంటే భారత్‌లో ఎక్కువ యువత ఉంది. వచ్చే దశాబ్దాల్లో గణనీయమైన సంఖ్యలో యువత శ్రామిక శక్తిలో ప్రవేశించనుంది. దీనివల్ల ఉత్పాదకత పెరుగుతుంది. ఈ ధోరణి పటిష్టమైన దేశీయ మార్కెట్‌ను ఇస్తుంది. వృద్ధి కోసం ఎగుమతులపై ఆధారపడే పరిస్థితి ఉండదు. ఈ ప్రయోజనాలను పూర్తిగా ఉపయోగించుకోవడానికి, ప్రస్తుతం దేశంలో రోడ్లు, విమానాశ్రయాలు, ఓడరేవులు, లాజిస్టిక్స్ కారిడార్ల వంటి మౌలిక సదుపాయాలలో పెట్టుబడులు పెరుగుతున్నాయి. ఫలితంగా దేశంలో మరింత సమర్థవంతమైన రవాణా వ్యవస్థ సరఫరాను బలోపేతం చేస్తుందని నివేదిక వివరించింది.




## అమెరికాకు నిలిచిన మసాలా ఎగుమతులు




అమెరికా సామ్రాజ్యవాదంతో పశ్చిమాసియాలో నెలకొన్న యుద్ధోన్మాదం భారత ఎగుమతులను తీవ్ర ప్రభావితం చేస్తోంది. భారత సుగంధ ద్రవ్యాల ఎగుమతులు స్తంభించాయి. భారత్ నుండి ఏటా సుమారు 500 మిలియన్ డాలర్ల విలువైన మసాలా దినుసులు అమెరికాకు ఎగుమతి అవుతుండగా.. ప్రస్తుత అనిశ్చితి వల్ల అక్కడి కొనుగోలు దారులు కొత్త ఆర్డర్లు ఇచ్చేందుకు వెనుకాడుతున్నారు. సాధారణంగా ప్రతి ఏటా నవంబర్ నెలలో ఎగుమతి దారులు, కొనుగోలు దారులు ప్రాథమిక ఒప్పందాలు చేసుకున్నప్పటికీ, ప్రస్తుతం షిప్పింగ్ మార్గాల్లో అంతరాయం, పెరిగిన బీమా ప్రీమియంలు, యుద్ధ రిస్క్ సర్‌చార్జీల కారణంగా కొనుగోలు దారుల నుండి ఎటువంటి స్పందన రావడం లేదని ఎగుమతి దారులు వాపోతున్నారు. గత ఆర్థిక సంవత్సరంలో మసాలా దిగుమతుల సాగు విస్తీర్ణం 5.09 మిలియన్ హెక్టార్లకు లేదా 1.4 శాతం పెరిగి ఉత్పత్తి 12.99 మిలియన్ టన్నులకు చేరుకున్నప్పటికీ, ఎగుమతులు నిలిచిపోవడంతో దేశీయంగా మిగులు నిల్వలు పెరిగి ధరలు పడిపోయే ప్రమాదం ఉందని ఈ రంగం నిపుణులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా మిరియాలు, యాలకులు, మిరపకాయలు, ధనియాలు, కరివేపాకు పొడి వంటి ఉత్పత్తుల ఎగుమతులపై ఈ ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. యుద్ధం కారణంగా సముద్ర మార్గాల్లో రవాణా ఖర్చులు భారీగా పెరగడం మరియు కంటెనర్ల కొరత ఏర్పడటంతో ఎగుమతిదారులు ప్రత్యామ్నాయ మార్కెట్లను వెతుక్కోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. యుద్ధం ప్రారంభమైనప్పటి నుండి అమెరికా కొనుగోలుదారుల నుండి ఎటువంటి ఆర్డర్లు లేవు.

# 1,481 పాయింట్లు పతనమైన సెన్సెక్స్




భారతీయ స్టాక్ మార్కెట్లు సోమవారం ట్రేడింగ్ ప్రారంభంలోనే భారీ నష్టాలను చవిచూశాయి. అంతర్జాతీయ మార్కెట్ల లోని ప్రతికూల పవనాలకు తోడు దేశీయంగా నెలకొన్న ఆందోళనలతో ఇన్వెస్టర్లు అమ్మకాలకు మొగ్గు చూపారు. దీంతో సోమవారం ఉదయం బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ సెన్సెక్స్ 1,481.95 పాయింట్లు పతనమై 73,051.01 వద్ద ట్రేడవుతుండగా, నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ నిఫ్టీ 415.95 పాయింట్లు కోల్పోయి 22,698.55 వద్ద కొనసాగుతోంది. ఈ ఆకస్మిక పతనంతో ఇన్వెస్టర్ల సంపద లక్షల కోట్లలో ఆవిరైపోయింది. మార్కెట్ పతనానికి మధ్యప్రాచ్యంలో ముదురుతున్న యుద్ధ మేఘాలే ప్రధాన కారణంగా నిపుణులు అంచనా వేస్తున్నారు. ముఖ్యంగా అమెరికా, ఇజ్రాయెల్ లబ ఇరాన్ మధ్య ఘర్షణలు తీవ్ర రూపం దాల్చడంతో గ్లోబల్ మార్కెట్లు అతలాకుతలమయ్యాయి. ఇరాన్ తన ఇంధన వనరులపై దాడులు జరిగితే ప్రతిఘటిస్తామని హెచ్చరించడం, మరోవైపు అంతర్జాతీయంగా సరఫరా వ్యవస్థ దెబ్బతినే అవకాశం ఉండటంతో ముడిచమురు ధరలు మళ్ళీ బ్యారెల్‌కు వి112 దాటాయి. ఇది భారత్ వంటి దిగుమతులపై ఆధారపడే దేశాల్లో ద్రవ్యోల్బణ భయాలను పెంచింది. మరోవైపు, విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు (ఈఎఐ) భారత మార్కెట్ల నుంచి భారీగా నిధులను ఉపసంహరించుకోవడం మార్కెట్‌పై ఒత్తిడి పెంచింది. గ్లోబల్ రిస్క్ పెరగడంతో ఇన్వెస్టర్లు సురక్షితమైన బాండ్లు, బంగారం వైపు మళ్లుతున్నారు. దీనికి తోడు రూపాయి విలువ డాలర్‌తో పోలిస్తే 93.83 వద్ద ఆల్‌మ్ కనిష్టానికి పడిపోవడం కూడా మార్కెట్ కుప్పకూలడానికి ఒక ముఖ్య కారణమైంది.
బ్యాంకింగ్ మరియు ఐటీ రంగానికి చెందిన దిగ్గజ షేర్లు భారీగా నష్టపోవడంతో సూచీలు కోలుకోలేక పోయాయని నిపుణులు తెలుపుతున్నారు.




## మహిళల క్యాండిడేట్స్ టోర్నీ..వైదొలగిన హంపి



ఫిడే మహిళల క్యాండిడేట్స్ టోర్నమెంట్ నుంచి భారత గ్రాండ్‌మాస్టర్ కోనేరు హంపి వైదొలగింది. పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యంలో ఆమె ఈ నిర్ణయం తీసుకుంది. సైప్రస్‌లోని పఫోస్‌లో ఈ నెల 28న క్యాండిడేట్స్ టోర్నీ ఆరంభం కానుంది. వ్యక్తిగత భద్రతపై ఆందోళనకారణంగా హంపి ఈటోర్నీకి దూరమైంది. "బాగా ఆలోచించాక కఠిన నిర్ణయం తీసుకున్నా. ఫిడే మహిళల క్యాండిడేట్స్ టోర్నమెంట్ నుంచి ఉపసంహరించుకోవాలని నిర్ణయించుకున్నా. ఎంత ముఖ్యమైన ఈవెంటైనా వ్యక్తిగత భద్రత తర్వాతే. నిర్వాహకులు హా ఇచ్చినా.. ప్రస్తుత పరిస్థితుల్లో నాకు భద్రతాభావం కలగట్లేదు. ఇది బాధాకర నిర్ణయమే. కానీ తప్పట్లేదు'' అని హంపి ఎక్స్‌లో పేర్కొంది. క్యాండిడేట్స్ నుంచి వైదొలగాలని భావిస్తున్నట్లు హంపి ఇంతకుముందే చెప్పింది. పురుషుల, మహిళల క్యాండిడేట్స్ టోర్నీలు సైప్రస్‌లో ఒకేసారి జరగనున్నాయి.

## ఆకాష్ దీప్ స్థానంలో కేకేఆర్ జట్టులోకి సౌరభ్ దూబే



ఐపీఎల్ 2026 ప్రారంభానికి ముందే అనేక జట్లకు ఊహించని షాక్ తగులుతోంది. పలువురు ప్లేయర్లు గాయాల కారణంగా జట్టుకు దూరం అవుతుండగా పలువురు విదేశీ ప్లేయర్లు ఔఅ లభించకపోవడంతో ఈ సీజన్ కు అందుబాటులోకి రావడం ప్రశ్నార్థకంగా మారింది. ఈ క్రమంలో కోల్‌కతా నైట్ రైడర్స్ (ఐఐఖీ) జట్టుకు సైతం కీలక ప్లేయర్ దూరం అయ్యాడు. దీంతో ఐపీఎల్ 19వ సీజన్ ప్రారంభానికి ముందే ఐఐఖీ జట్టులో కీలక మార్పు చోటుచేసుకుంది. గాయం కారణంగా జట్టుకు దూరమైన టీమిండియా పేసర్ ఆకాష్ దీప్ స్థానంలో, విదర్భ కు చెందిన లెఫ్ట్ ఆర్మ్ పేసర్ సౌరభ్ దూబేను తీసుకోవాలని కేకేఆర్ యాజమాన్యం నిర్ణయించింది. 28 ఏళ్ల సౌరభ్ దూబే గతంలో సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టులో సభ్యుడిగా ఉన్నప్పటికీ, ఇప్పటివరకు ఐపీఎల్ లో అరంగేట్రం చేసే అవకాశం రాలేదు. ప్రస్తుతం కేకేఆర్ క్యాంప్‌లో చేరుతున్న ఆయనపై భారీ అంచనాలు ఉన్నాయి. అయితే, ఈమార్పుకు సంబంధించి కేకేఆర్ ఫ్రాంచైజీ నుంచి ఇంకా అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.

## ఖాళీ స్టేడియాల్లోనే పాకిస్థాన్ సూపర్ లీగ్ మ్యాచ్‌లు




అమెరికా, ఇజ్రాయెల్ లబ ఇరాన్ యుద్ధం కారణంగా మధ్యప్రాచ్యంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న సంగతి తెలిసిందే. ఈ కారణంగా పాకిస్థాన్‌లో తీవ్రమైన ఇంధన కొరత ఏర్పడటంతో ఆ ప్రభావం పాకిస్తాన్ సూపర్ లీగ్ 2026 తీవ్రంగా పడింది. దీంతో 2026 సీజన్‌పై పీసీబీ కీలక నిర్ణయం తీసుకుంది. దేశ వ్యాప్తంగా పొదుపు చర్యలు అమలులో ఉన్నందున, ప్రజల రాకపోకలను తగ్గించేందుకు ప్రారంభ మ్యాచ్‌లను ఖాళీ స్టేడియాల్లో నిర్వహించనున్నట్లు పీసీబీ ఛైర్మన్ మొహ్సిన్ నఖ్వీ ఆదివారం ప్రకటించారు. అంతేకాకుండా, గతంలో ఆరు నగరాల్లో నిర్వహించాలని ప్లాన్ చేసినప్పటికీ, వనరులను ఆదా చేసేందుకు ఇప్పుడు కేవలం లాహోర్, కరాచీ నగరాలకు మాత్రమే వేదికలను పరిమితం చేశారు. లాహోర్‌లో వైభవంగా జరగాల్సిన ప్రారంభ వేడుకను కూడా బోర్డు రద్దు చేసింది. మార్చి 26 నుంచి ప్రారంభం కానున్న ఈ టోర్నీలో, పరిస్థితులు మెరుగు పడే వరకు ప్రేక్షకులను అనుమతించబోమని నఖ్వీ స్పష్టం చేశారు. ఒకవైపు ప్రజలను ప్రయాణాలు తగ్గించుకోవాలని కోరుతూ, మరోవైపు స్టేడియాలకు వేల సంఖ్యలో రావాలని పిలవడం సరికాదని ఆయన అభిప్రాయపడ్డారు. ఇప్పటికే టికెట్లు కొనుగోలు చేసిన అభిమానులకు 72 గంటల్లోపు పూర్తి నగదును రీఫండ్ చేస్తామని, ఫ్రాంచైజీలకు జరిగే ఆదాయ నష్టాన్ని బోర్డు భరిస్తుందని హా ఇచ్చినట్లు తెలుస్తుంది. కాగా, ఇదే సమయంలో ఐపీఎల్ కోసం పిఎస్ఎల్ ఒప్పందాలను కాదనుకున్న విదేశీ ఆటగాళ్లపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పీసీబీ బోర్డు హెచ్చరించింది.

## దక్షిణాఫ్రికాపై న్యూజిలాండ్ గెలుపు

న్యూజిలాండ్ మహిళల జట్టు టి-20 సిరీస్‌ను కైవసం చేసుకుంది. వెల్లింగ్టన్ వేదికగా దక్షిణాఫ్రికాతో జరిగిన నాలుగో టి-20లో కివీస్ జట్టు 6 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. దీంతో ఓ మ్యాచ్ మిగిలి ఉండగానే సిరీస్ కైవసం చేసుకుంది. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన దక్షిణాఫ్రికా జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి159 పరుగులు చేసింది. సౌతాఫ్రికా ఆల్‌రౌండర్ అనేరీ డెర్క్సెన్ మెరుపు ఇన్నింగ్స్ ఆడింది. కేవలం 32 బంతుల్లో 8 ఫోర్లు, ఒక సిక్సర్‌తో 55 పరుగులు చేసి టాప్ స్కోరర్‌గా నిలిచింది. ఆమెతోపాటు లాస్ 30 పరుగులతో ఆకట్టుకుంది. ఇక కివీస్ బౌలర్లలో జెస్ కెర్ 3 వికెట్లతో అదరగొట్టింది. అనంతరం 160 పరుగుల లక్ష్యాన్ని న్యూజిలాండ్ జట్టు 18.3 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి ఛేదించింది. న్యూజిలాండ్ స్టార్ ఆల్‌రౌండర్ సోఫీ డివైన్ మరోసారి విధ్వంసకర ఇన్నింగ్స్ ఆడి ఆ జట్టు విజయంలో కీలక పాత్ర పోషించింది. కేవలం 34 బంతుల్లో 6 ఫోర్లు, 4 సిక్సర్లతో 64 పరుగులు చేసింది. డివైన్‌తో పాటు అలియా కేర్ 29 బంతుల్లో 31 పరుగులతో రాణించింది. సౌతాఫ్రికా బౌలర్లలో క్లో ట్రయాన్ 2 వికెట్లు సాధించింది. అన్నేరీ డెర్క్సెన్, మ్లబా చెరో వికెట్ పడగొట్టారు. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డును జెస్ కెర్ అందుకుంది. ఇక ఇరు జట్ల మధ్య నామమాత్రపు ఐదో టి-20 క్రైస్ట్‌చర్చ్ వేదికగా మార్చి 25న జరగనుంది.



## నేను 60 ఏండ్ల వరకు ఆడినా ఆశ్చర్యపోవద్దు




సీఎస్‌కే దిగ్గజ ఆటగాడు, మిస్టర్ కూల్ ఎంఎస్ ధోనీ తన రిటైర్మెంట్‌పై మరోసారి ఆసక్తికర వ్యాఖ్యలు చేసి అభిమానుల్లో ఉత్సాహం నింపారు. ఐపీఎల్‌లో 60 ఏళ్ల వయసు వచ్చినా ఆడుతూనే ఉంటానేమోనంటూ ఆయన చేసిన సరదా వ్యాఖ్యలు చెపాక్ స్టేడియాన్ని హోరెత్తించాయి. ప్రస్తుతం 44 ఏండ్ల వయసులో ఉన్న ధోనీ, తన భవిష్యత్తు ప్రణాళికలపై జరుగుతున్న ఊహాగానాలకు ఈ వ్యాఖ్యలతో మరింత ఆసక్తిని జోడించారు. చెపాక్‌లో నిన్న జరిగిన సీఎస్‌కే ఫ్యాన్ ఈవెంట్‌లో ఈ సరదా సంభాషణ చోటుచేసుకుంది. ఈ కార్యక్రమానికి హాజరైన నటుడు శివకార్తికేయన్, రిటైర్మెంట్ ఆలోచనలు పక్కనపెట్టి మరికొన్నేళ్లు సీఎస్‌కే పసుపు జెర్సీలో కొనసాగాలని ధోనీని కోరారు. దీనికి ధోనీ నవ్వుతూ బదులిస్తూ? ''ప్రస్తుతం 44 ఏళ్ల వయసులో ఫిట్‌నెస్ కాపాడుకోవడం చాలా కష్టంగా ఉంది. అయినా కంగారు పడకండి? నేను 60 ఏండ్ల వరకు ఆడినా ఆశ్చర్యపోవద్దు'' అని అన్నారు. ఈ మాటలకు స్టేడియంలోని అభిమానుల నుంచి భారీ స్పందన వచ్చింది. ఈ వీడియో సోషల్ డియాలో వైరల్‌గా మారింది.

## అతడు రాణిస్తే చూడాలని ఉంది.. కానీ..: రవిచంద్రన్ అశ్విన్



ఇండియన్ ప్రీమియర్ లీగ్ 19వ సీజన్ ప్రారంభం కావడానికి ఇంకా కొద్ది రోజులు మాత్రమే ఉంది. ఇప్పటికే అన్ని ఫ్రాంచైజీలు ఐపీఎల్ ట్రోఫీ సాధించేందుకు తమ తమ ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నాయి.ఈ నేపథ్యంలో రాజస్థాన్ రాయల్స్ జట్టు గురించి మాజీ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ కీలక వ్యాఖ్యలు చేశాడు. రాజస్థాన్ యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ ఈ సీజన్‌లో రాణిస్తే చూడాలని ఉందని అశ్విన్ అన్నాడు. వైభవ్ విజృంభిస్తే.. రాజస్థాన్‌ను ఎవరూ ఆపలేరని పేర్కొన్నాడు.'ఒకవేళ వైభవ్ సూర్యవంశీ ఈ సీజన్‌లో విజృంభిస్తే.. రాజస్థాన్‌ను ఆపడం ఎవరి తరం కాదు. అయితే అతడికిది కేవలం రెండో సీజన్ మాత్రమే. ఆ పిల్లవాడికి సరైన అనుభవమూ లేదు. కాబట్టి అతడి ద ఎక్కువ ఒత్తిడి పెట్టకూడదు'' అని అశ్విన్ అన్నాడు. అయితే వైభవ్‌ను అడ్డుకొనేందుకు అన్ని జట్లు ఇప్పటికే పక్కా ప్రణాళికను సిద్ధం చేసి బరిలోకి దిగుతాయని అశ్విన్ విశ్లేషించాడు. 'వైభవ్‌లో అద్భుతమైన ప్రతిభ ఉంది. అండర్ 19 ప్రపంచకప్, గత ఐపీఎల్ సీజన్‌లో ఆడినట్లే ఈ సీజన్‌లో కూడా అతడు రాణిస్తే చూడాలని ఉంది. మొదటి బంతి నుంచే అతడు విధ్వంసం సృష్టించాలని కోరుకుంటున్నాను. అయితే ఈ సీజన్‌లో అతడిని కట్టడి చేసేందుకు ఇతర జట్లు ఇప్పటికే ప్రణాళికలు సిద్ధం చేసుకుని ఉంటాయి' అని అశ్విన్ తెలిపాడు.

# వుదయం సినిమా

MOVIE TIME!


## దీవాన ఇది ప్రేమ సాంగ్ రిలీజ్

శుభం సినిమాతో మంచి విజయాన్ని అందుకున్న యంగ్ టాలెంటెడ్ యాక్టర్ హర్షిత్ రెడ్డి హీరోగా నటిస్తున్న కొత్త సినిమా "దీవాన". స్నేహ మణిమేగలై హీరోయిన్ గా తెలుగు ప్రేక్షకులకు పరిచయమవుతోంది. ఈ చిత్రాన్ని అర్హ మీడియా, వీ స్టూడియోస్ బ్యానర్ పై వాసుదేవ్ కొప్పినేని, శ్రీదేవి కార్యంపూడి నిర్మిస్తున్నారు. బ్యూటిఫుల్ లవ్ స్టోరీతో దర్శకుడు శ్రీకాంత్ సంగిశెట్టి రూపొందిస్తున్నారు. "దీవాన" సినిమా ఈ వేసవికి గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రాబోతోంది. ఈరోజు ఈ చిత్రం నుంచి ఇది ప్రేమ సాంగ్ ను స్టార్ హీరోయిన్ సమంత చేతుల మీదుగా సోషల్ మీడియా ద్వారా రిలీజ్ చేశారు. అనంతరం హైదరాబాద్ ప్రసాద్ ల్యాబ్స్ లో జరిగిన సాంగ్ లాంఛ్ ఈవెంట్ లో ప్రముఖ దర్శకులు వెంకీ అట్లూరి, రవికిరణ్ కోలా, నందినీరెడ్డి అతిథులుగా పాల్గొన్నారు.



## గరివిడి లక్ష్మి

### కోసింది కొయగూర సాంగ్ రిలీజ్



భారీ స్థాయి సినిమాలతో అలరించే పీపుల్ మీడియా ఫ్యాక్టరీ, ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌కి చెందిన లెజెండరీ జానపద గాయని గరివిడి లక్ష్మి కథని ప్రేక్షకులు ముందుకు తీసుకొస్తుంది. గరివిడి లక్ష్మి పాత్రలో ఆనంది మెరుస్తోంది. గౌరి నాయుడు జమ్ము ఈ సినిమాకి దర్శకత్వం వహిస్తున్నారు. బుర్రకథలు చెప్పడమే కాదు, ఓ ఉద్యమంగా మార్చిన లక్ష్మి జీవితాన్ని ఈ సినిమా ఆవిష్కరించనుంది. టీజీ విశ్వ ప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మిస్తున్న 'గరివిడి లక్ష్మి' ఓ పాటతో వేలాది హృదయాల్లో నిలిచిపోయిన లెజెండరీ జానపద గాయని జీవితాన్ని రిక్రియేట్ చేస్తోంది. ఇప్పటికే విడుదలైన ఈ సినిమా ప్రమోషనల్ కంటెంట్ కి మంచి రెస్పాన్స్ వచ్చింది. తాజాగా అద్భుతమైన జానపదం కోసింది కొయగూర సాంగ్ ని రిలీజ్ చేశారు మేకర్స్. చరణ్ అర్జున్ ఈ జానపదాన్ని రాఎనర్జీ వుండే డ్యాన్స్ నెంబర్ గా కంపోజ్ చేశారు. అనన్య భట్, షకలక శంకర్, గౌరీ నాయుడు జమ్ము వోకల్స్ మరింత వైబ్ ని యాడ్ చేశాయి.

ఉత్తరాంధ్ర జనపదం మూలం నుంచి స్వరపరిచిన ఈ పాటకు గంటేడ గౌరునాయుడు, గౌరీ నాయుడు జమ్ము రాసిన అదనపు సాహిత్యం మరింత ఆకర్షణ తీసుకొచ్చింది.

ఈ సాంగ్ లో ఆనంది పెర్ఫార్మెన్స్ అదిరిపోయింది. రాగ్ మయూర్ ప్రజెన్స్ డ్యాన్స్ మూమెంట్స్ మరింత జోష్ ని తీసుకొచ్చింది.

## రాకాస థియేట్రికల్‌గా ఎక్స్ పీరియెన్స్ చిత్రం



జీ స్టూడియోస్ సమర్పణలో నిహారిక కొణిదెల తన పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ బ్యానర్‌పై ఉమేష్ కుమార్ బన్సాల్‌తో కలిసి 'రాకాస' మూవీని నిర్మించారు. మానస శర్మ తెరకెక్కించిన ఈ చిత్రంలో సంగీత్ శోభన్, నయన్ సారిక జంటగా నటించారు. ఇప్పటి వరకు రిలీజ్ చేసిన గ్లింప్స్, టీజర్, పాటలు, ప్రమోషనల్ కంటెంట్ అంతా కూడా అందరినీ ఆకట్టుకుంది. ఇక తాజాగా ఈ చిత్ర విశేషాల్ని పంచుకునేందుకు దర్శకురాలు మానస శర్మ మీడియాతో ముచ్చటించారు. ఆమె చెప్పిన సంగతులివే..

**మీ నేపథ్యం గురించి చెప్పండి?**

**మానస శర్మ :** మాది శ్రీకాకుళం. నేను మొదటగా యూట్యూబ్‌లో 'మ్యాడ్ హౌస్' చేశాను. ఆ తరువాత 'ఒక చిన్న ఫ్యామిలీ స్టోరీ'కి క్రియేటర్, రైటర్‌గా పని చేశాను. ఆ తరువాత 'బెంచ్ లైఫ్' సిరీస్‌ని చేశాను. ఇది నాకు నాలుగో ప్రాజెక్ట్. ఫాంటసీ, అడ్వెంచర్‌లతో తీసిన 'రాకాస' చాలా కొత్తగా ఉండబోతుంది.

**'రాకాస'లో ప్రధాన అంశం ఏంటి?**

**మానస శర్మ :** 'రాకాస'ని ఫాంటసీ, అడ్వెంచర్, కామెడీ జానర్లో తీశాం. ఇప్పటికే అందరూ మా టీజర్‌ని చూసి ఉంటారు. త్వరలోనే ట్రైలర్ రానుంది. అప్పుడు మా సినిమా గురించి ఇంకా చాలా క్లియర్‌గా తెలుస్తుంది. కామెడీని ప్రధాన అంశంగా, కొద్దిగా హారర్ ఎలిమెంట్స్‌తో పూర్తి ఫాంటసీ, అడ్వెంచర్‌గా ఈ మూవీని తీశాం.

**సంగీత్ శోభన్ ఈ కథలోకి ఎలా వచ్చారు?**

**మానస శర్మ :** 'రాకాస' కథని ముందుగా నెట్‌ఫ్లిక్స్‌లో సిరీస్ కోసం చెప్పాను. ఆ టైంలోనే ఈ కథను సంగీత్ విన్నారు. ఆయనకి కూడా కథ చాలా నచ్చింది. అలా ఈ ప్రాజెక్ట్‌లోకి సంగీత్ వచ్చారు. సంగీత్ అద్భుతమైన నటుడు. మంచి వ్యక్తి. అతని కామెడీ టైమింగ్ అంటే నాకు చాలా ఇష్టం.

**'రాకాస' చిత్రీకరణలో ఎదుర్కొన్న సవాళ్లు ఏంటి?**

**మానస శర్మ:** వెబ్ సిరీస్‌కి, సినిమాకి ఒకే రకమైన ఛాలెంజ్ ఉంటుంది. మేకింగ్ ఒకేలా ఉంటుంది.. రైటింగ్‌లోనే తేడా ఉంటుంది. షూటింగ్ పరంగా, చిత్రీకరణ సమయంలో ఎలాంటి తేడాలుండవు. ఈ సినిమా అవుట్ పుట్ నిహారిక గారికి నచ్చాలని నేను మరింత బాధ్యతగా పని చేశాను. ఈ కథని పదిహేను నిమిషాలు నెరేట్ చేసిన తరువాత నిహారిక గారికి చాలా కాన్ఫిడెంట్ వచ్చేసి ఓకే చెప్పారు.

**నయన్ సారిక గురించి చెప్పండి?**

**మానస శర్మ :** నయన్ సారిక మంచి నటి. డైరెక్టర్ ఏం చెబితే అది చేస్తారు. ఆల్రెడీ నేను ఇది వరకే ఆమెతో పని చేసి ఉన్నాను. ఆమె టాలెంట్, యాక్టింగ్ చూసే ఈ చిత్రంలోకి తీసుకున్నాం. ఆమె పాత్రని ప్రేక్షకులంతా ఇష్టపడతారు.



## బ్యాండ్ మేళం

### సినిమా పెద్ద హిట్ అవ్వాలి

'కోర్ట్'తో బ్లాక్ బస్టర్ పెయిర్‌గా నిలిచిన హర్ష్ రోషన్, శ్రీదేవీ జంట మళ్లీ 'బ్యాండ్ మేళం' అంటూ ఆడియెన్స్ ముందుకు రానుంది. బ్లాక్ బస్టర్ రచయిత కోన వెంకట్ నిర్మాణ సారథ్యంలో ఈ చిత్రం రూపు దిద్దుకుంది. మ్యాంగో మాస్ మీడియా సమర్పణలో కోన ఫిల్మ్ కార్పొరేషన్ బ్యానర్ మీద కావ్య, శ్రావ్య ఈ మూవీని నిర్మించారు. సతీష్ జవ్వాజీ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమాని మార్చి 26న రిలీజ్ చేయబోతోన్నారు. ఈ క్రమంలో సోమవారం నాడు ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్టార్ రైటర్ విజయేంద్ర ప్రసాద్, సెన్సేషనల్ డైరెక్టర్స్ వివి వినాయక్, బాబీ, నటుడు, నిర్మాత బండ్ల గణేష్, ఆస్కార్ గ్రహీత చంద్రబోస్, కింగ్ ఆఫ్ ఎంటర్టైన్మెంట్ శ్రీ విష్ణు, ప్రముఖ నిర్మాత సురేష్ బాబు తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

## నిర్మాత బెల్లి జనార్ధన్ ఆకస్మిక మృతి!

ఇటీవల తూలికా తనిస్క్ క్రియేషన్స్ పతాకంపై 'పోలీస్ వారి హెచ్చరిక' చిత్రాన్ని నిర్మించడం ద్వారా సినీ రంగ ప్రవేశం చేసిన 'బెల్లి జనార్ధన్' ఆకస్మిక మరణం పట్ల చిత్ర దర్శకుడు బాబ్జీ తీవ్ర సంతాపాన్ని వ్యక్తపరిచారు..నెల 22వ తేదీన ఉగాది పండుగ జరుపుకోవడం కోసం అత్తగారి ఊరైన 'కట్టంగూరు కు తన కుటుంబ సభ్యులతో కలిసి వెళ్ళిన బెల్లి జనార్ధన్ ఆ గ్రామంలో గల స్విమ్మింగ్ పూల్ లో ఈత కొడుతుండగా ప్రమాదవశాత్తు నీటి అడుగుకు బలంగా తల తగిలి తీవ్రంగా గాయమవడంతో అక్కడికక్కడే ఊపిరి వదిలారని, 23వ తేదీన వారి స్వగ్రామమైన నకిరేకల్ మండలంలోని 'పాలెం' గ్రామంలో మాజీ సైనికుడైన జనార్ధన్ గారికి సైనిక లాంఛనాలతో అంత్యక్రియలు జరిగాయని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా 'పోలీస్ వారి హెచ్చరిక' సినిమా యూనిట్ తరుపున, వ్యక్తిగతంగా నా తరుపున నిర్మాత బెల్లి జనార్ధన్ గారి ఆకస్మిక మరణం పట్ల తీవ్రమైన దిగ్భ్రాంతిని వ్యక్తపరుస్తూ వారి కుటుంబ సభ్యులకు సంతాపాన్ని తెలుపుకుంటున్నామని దర్శకుడు బాబ్జీ తెలిపారు!



## అహా ఓటీటీలో దుమ్ము రేపుతున్న తురుమ్ ఖాన్‌లు

తెలంగాణ యాస, భాష నేపథ్యంలో విలేజ్ నేటివిటితో తెరకెక్కిన అవుట్ అండ్ అవుట్ కామెడీ ఎంటర్ టైనర్ తురుమ్ ఖాన్ లు. ఈ సినిమా గురించి తెలిసిన ప్రేక్షకులు ఈ చిత్రం ఓటీటీలో ఎప్పుడు వస్తుందా అని కళ్ళు కాయలు కాసేలా ఎదురు చూశారు. ఎట్టకేలకు ఇటీవల ఆహా ఓటీటీ వేదికగా తురుమ్ ఖాన్ లు స్ట్రీమింగ్ అవుతుంది. ఈ చిత్రానికి సంబంధించిన ప్రమోషన్ కామెడీ బిట్లు సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతున్నాయి. కడుపుబ్బ నవ్వించే కామెడీ సన్నివేశాలతో ఆధ్యాంతం అలరించేలా సాగే ఈ చిత్రం ఇన్నాళ్లు ఎక్కడ ఉందని ప్రేక్షకులు కామెంట్లు పెడుతున్నారు అంటే... ఈ చిత్రం వారి హృదయాలకు ఎంతలా హత్తుకుందో అర్థం చేసుకోవచ్చు. ఇంత అద్భుతమైన సినిమా ఇప్పటికైనా ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చిన నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.






## చాన్స్ దక్కించుకున్న కీర్తి సురేష్

నేషనల్ అవార్డు విన్నర్, 'మహానటి' కీర్తి సురేష్ ప్రస్తుతం తన కెరీర్‌లో గోల్డెన్ పీరియడ్‌ను ఎంజాయ్ చేస్తున్నారు. టాలీవుడ్‌లో వరుస హిట్లు కొడుతూనే, బాలీవుడ్‌లో కూడా 'రఫ్తార్' వంటి క్రేజీ ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. తాజాగా ఈ అమ్మడు ఖాతాలో మరో భారీ తెలుగు సినిమా వచ్చి చేరినట్లు సోషల్ మీడియాలో వార్తలు హల్చల్ చేస్తున్నాయి. ఇటీవల 'శంకర్ వరప్రసాద్' చిత్రంతో బాక్సాఫీస్ వద్ద సెన్సేషన్ క్రియేట్ చేసిన దర్శకుడు అనిల్ రావిపూడి, ఇప్పుడు ఒక భారీ మల్టీస్టారర్ కథను సిద్ధం చేశారు. ఇక ఇందులో విక్టరీ వెంకటేష్ నందమూరి కళ్యాణ్ రామ్ వంటి ఇద్దరు స్టార్ హీరోలు కలిసి నటిస్తుండగా.. కీర్తి సురేష్ హీరోయిన్‌గా అవకాశం దక్కించుకున్నట్లు సమాచారం.

## దేత్తడి ఘనీ భాయ్ మాస్ అప్పీలింగ్ గ్లింప్స్



రౌడీ బాయ్స్, లవ్ మీ సినిమాలతో పాపులరైన యంగ్ ట్యాలెంటెడ్ ఆశిష్ హీరోగా, సక్సెస్‌ఫుల్ నిర్మాతలు దిల్ రాజు, శిరీష్ తమ శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై నిర్మిస్తున్న చిత్రం 'దేత్తడి'. ఈ ప్రాజెక్ట్ తో దర్శకుడిగా ఆదిత్య రావు గంగసాని పరిచయం అవుతున్నారు. హైదరాబాద్ కల్చర్ బ్యాక్‌డ్రాప్‌లో కొత్త స్టోరీని ప్రజెంట్ చేస్తున్నారు. ఈ సినిమా ఫస్ట్ లుక్‌కు అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. ఈ రోజు మేకర్స్ గ్లింప్స్ లాంచ్ చేశారు.

ఈ గ్లింప్స్ హైదరాబాద్, సికింద్రాబాద్‌లోని పండుగలు, వేడుకలకు ఉత్సాహాన్ని నింపే పాపులర్ డ్రమ్మర్ ఘన్ను భాయ్ వరల్డ్ ని అద్భుతంగా ప్రజెంట్ చేసింది. ఘన్ను భాయ్, అతని టీం దాదాపు ఏడు కిలోల డ్రమ్ములను మోస్తూ, గంటల తరబడి విరామం లేకుండా ప్రదర్శన ఇస్తూ ప్రశంసలు అందుకున్నారు. ఆ సంగీతం వెనుకకనిపించే ఆత్మగౌరవం, హుందాతనం ఉన్నాయి. ఈ గ్లింప్స్ ఆ విషయాన్ని ఎంతో సున్నితంగా, శక్తివంతంగా ప్రజెంట్ చేసింది.

## ఇక డిజిటల్ వేట



టాలీవుడ్‌లో వరుస హిట్లు అందుకుంటూ గోల్డెన్ లెగ్‌గా పేరు తెచ్చుకున్న యంగ్ హీరోయిన్ సంయుక్త మీనన్ ఇప్పుడు ఒక సరికొత్త ప్రయాణానికి సిద్ధమయ్యారు. ఇప్పటివరకు వెండితెరపై తన అందం, అభినయంతో మెప్పించిన ఈ బ్యూటీ, ఇప్పుడు డిజిటల్ ఎంట్రీ ఇవ్వనుంది. ఈమె తన మొదటి వెబ్ సిరీస్‌ను పట్టాలెక్కించి, ప్రేక్షకులకు సరికొత్త వినోదాన్ని పంచడానికి రెడీ అయ్యారు. 'గువ్వల చెరువు ఘాట్' పేరుతో తెరకెక్కుతున్న ఒక భారీ వెబ్ సిరీస్‌లో యంగ్ హీరో కిరణ్ అబ్బవరం, టాలెంటెడ్ యాక్టర్ తిరువీర్ ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. అయితే సంయుక్తతో పాటు కిరణ్ అబ్బవరానికి కూడా ఇదే మొదటి ఓటీటీ ప్రాజెక్ట్ కావడం విశేషం. 'డియర్ కామ్రేడ్' ఫేమ్ భరత్ కమ్మ ఈ సిరీస్‌ను అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తున్నారు.

Printed, Published & Owned by Sirikonda Maria, Printed at LAKSHYAM TELUGU DAILY, D. No.1227/1, 11 GPR Flats, Pedakakani Village and Mandal, Guntur, Andhra Pradesh - 522509 and Published from : H. No. 25-17-343/18, 60 Feet Road, Srinivasa Thota, Guntur - 522004, Andhra Pradesh. Editor : Sirikonda Augustin, RNI No. APTEL/2014/57702. E-mail : voodayam2007@gmail.com Cell : 9247698676.